www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

| వరల్డోమీటర్ ప్రకారం మంగళవారం రాత్రి 11:30 గంటలకు | కొత్త కేసులు | మరణాలు | బాధితులు |
|---|---|---|---|
| ప్రపంచం | 64,091 | 81,010 | 14,10,095 |
| భారతదేశం | 533 | 150 | 5,311 |
| ఆంధ్రప్రదేశ్ | 11 | 4 | 314 |
| తెలంగాణ | 40 | 11 | 404 |
| అమెరికా | 19,100 | 12,242 | 3,86,104 |

బుధవారం | 8-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 354 | శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 8.05 వరకు తదుపరి బ. పాడ్యమి తె. 4.13 వరకు; నక్షత్రం: చిత్త ఉ. 3.03 తదుపరి స్వాతి; వర్జ్యం: మ. 1.06-2.30; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.42; అమృతఘడియలు: రా. 9.28-10.52; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



## బుల్ జోష్

ఆల్‌టైమ్ రికార్డు లాభం

సెన్సెక్స్ 2,476 పాయింట్లు అప్

మళ్లీ 30 వేల ఎగువకు సూచీ

708 పాయింట్లు బలపడ్డ నిఫ్టీ

రూ. 7.71 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

6

SBI

పొదుపు ఖాతాపై వడ్డీ రేటు

## తగ్గించిన ఎస్‌బీఐ

# క్లోరోక్విన్‌కు ఓకే!

మానవతా దృక్పథంతో...



### కేంద్రం సడలింపు.. అవసరమున్న అన్ని దేశాలకూ ఇస్తామని ప్రకటన

**ముందు సొంత అవసరాలే.. తర్వాతే ఎగుమతి**

**20 దేశాల నుంచి ఆర్డర్లు ఉన్నాయి: భారత్**

**మరో 24 ఔషధాలపైనా నిషేధం ఎత్తివేత**

**సరఫరా చేయకపోతే ప్రతీకారమే**

**అంతకుముందు భారత్‌కు ట్రంప్ హెచ్చరిక**

**మొదట దేశీయ అవసరాలు చూడాలి: రాహుల్**

**అమెరికాకు వెళ్లం.. భారత్‌లోనే సురక్షితం**

**స్వదేశానికి వెళ్లేందుకు అమెరికన్ల వెనకడుగు**

**శంషాబాద్ నుంచి అమెరికాకు 99 మంది**

**ఇదే చివరి అవకాశం.. ఇప్పుడే రండి: అమెరికా**

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 7: మలేరియా నిర్మూలనకు వాడే హైడ్రాక్సీ క్లోరోక్విన్ (హెచ్‌సీక్యూ) ఎగుమతిపై ఉన్న నిషేధాన్ని భారత్ పాక్షికంగా సడలించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ, ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) మంగళవారం సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నాయి. దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలున్నాయా లేదా అన్నది సమీక్షించాక ఈ నిర్ణయం తీసుకొన్నట్లు కేంద్రం వెల్లడించింది. దీనితో పాటు పారాసిటమాల్, విటమిన్ బీ1, బీ12, బీ6 మొదలైన 24 రకాల ఔషధాల ఫార్ములేషన్స్ ఎగుమతిపైనా నిషేధం

మిగతా 8వ పేజీలో...

## భారతీయులూ విలవిల

**హాట్‌స్పాట్లలోనే ఎక్కువగా భారత సంతతి ప్రజలు**

**ఇప్పటికే నలుగురు తెలుగువారు మృతి**

**న్యూజెర్సీలో 30 మందికి పాజిటివ్?**

**ప్రసిద్ధ జర్నలిస్టు బ్రహ్మ కంచిబొట్ల మృతి**

బ్రిటన్‌లో వైద్యులకు గండం

భారత సంతతి సర్జన్ మృతి

స్పెయిన్‌లో మళ్లీ విజృంభణ

ఒక్కరోజులోనే 743 మరణాలు

8



### నిలకడగా బ్రిటన్ ప్రధాని ఆరోగ్యం

ముందు జాగ్రత్త చర్యగానే ఐసీయూలో చికిత్స

టెన్ డౌనింగ్ స్ట్రీట్ వర్గాల వెల్లడి

బోరిస్ కోలుకోవాలని ఆకాంక్షించిన మోదీ

8



కరోనా వైరస్ ఆకారంలో సుధాకర్ కార్స్ సంస్థ తయారు చేసిన వాహనమిది. ఈ వాహనం బుధవారం నుంచి హైదరాబాద్ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు కొవిడ్-19 వైరస్‌పై అవగాహన కలిగించేందుకు సిద్ధమైంది.

## లాక్‌డౌన్ పొడిగింపు?

**ఆ దిశగా ఆలోచిస్తున్నాం**

**రాష్ట్రాలు కోరుతున్నాయి**

**నిపుణులూ అదే సూచిస్తున్నారు**

**తుది నిర్ణయం తీసుకోలేదు: కేంద్రం**

**వచ్చే వారం దేశానికి కీలకం**

**సహకరించండి: వెంకయ్య**

*లాక్‌డౌన్ లేకుంటే.. ఒక కరోనా రోగి కేవలం 30 రోజుల్లో మరో 406 మందికి వైరస్‌ను అంటించగలడు. అదే లాక్‌డౌన్ అమలవుతూ, ప్రజలంతా భౌతిక దూరం పాటించే పరిస్థితి ఉంటే ఒక కరోనా రోగి నుంచి కేవలం 2.5 మందికే ఇన్ఫెక్షన్ సోకుతుంది. ఐసీఎంఆర్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మంగళవారం ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం ఒక కరోనా బాధితుడి నుంచి ఇతరులకు ఇన్ఫెక్షన్ సోకే రేటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సగటున 1.5 నుంచి 4 మధ్యలో ఉందన్నారు. లాక్‌డౌన్ ప్రభావంతో చాలామేరకు వైరస్ వ్యాప్తి వేగం తగ్గిందని స్పష్టంచేశారు.*

8



### సెంట్రల్ విస్టా ఆపాలి

**ఆ రూ.20 వేల కోట్లూ వైద్య సదుపాయాలకు వాడండి**

**ఐదు సూచనలతో మోదీకి సోనియా గాంధీ లేఖ**

2

### కమనీయం.. కోదండరాముని కల్యాణం





ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పెళ్లికూతురుగా ముస్తాబైన సీతమ్మ తల్లి

**కడప** జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణం మంగళవారం రాత్రి పున్నమి చంద్రుడి సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలను జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, ముత్యాల తలంబ్రాలను డిప్యూటీ ఈవో లోకనాథం సమర్పించారు. చతుర్వేద పఠనం చేసిన వేదపండితులు సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య రాత్రి 8.38గంటలకు అష్టనక్షత్రయుక్త శుభలగ్నంలో సీతమ్మ తల్లి మెడలో శ్రీరామచంద్రుడు మంగళసూత్రధారణ చేశారు. లాక్‌డౌన్ దృష్ట్యా కల్యాణోత్సవానికి ముందు పోలీసులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. టీటీడీ అధికారులు, వేదపండితులు మినహా ఎవ్వరినీ లోపలకు అనుమతించకుండా ఆలయ ముఖద్వారాన్ని మూసిపహారా కాశారు. కల్యాణం అనంతరం రాత్రి గజవాహనంపై కోదండరాముడు ఊరేగాడు.

**- రాజంపేట/ఒంటిమిట్ట**



## గల్ఫ్ ఎన్నారైలకు కరోనా కష్టాలు

స్వీయ నిర్బంధంలోనూ వ్యాపిస్తున్న వైరస్

ఇరుకైన గదుల్లో పాటించని భౌతిక దూరం

దుబాయ్‌లో భారత కార్మికులకు పాజిటివ్

ఆంక్షల మధ్య నివసిస్తున్న తెలుగు వారు

కువైత్ బాధితుల్లో భారతీయులే ఎక్కువ

8

### దేశంలో 26 వేల సహాయ శిబిరాలు!

**కోటిమందికిపైగా ఆశ్రయం, ఆహారం.. లాక్‌డౌన్‌పై సుప్రీంకు నివేదన**

### ఒకసారి ఒకరికి మాత్రమే ఫార్వర్డ్!

**వదంతుల చెక్‌కు వాట్సాప్ పరిమితి.. తరచు షేర్ అయ్యే వాటిపై గురి**

**నిజం నిర్ధారించుకునేలా కొత్త ఫీచర్?.. తప్పుల బాధ్యత 'అడ్మిన్'దే**

**గ్రూప్ అడ్మిన్లు మాత్రమే పోస్టులు పెట్టండి.. ఇండోర్ కలెక్టర్ ఆదేశం**

2

# మూడో దశలోకి!

## రాష్ట్రంలో వైరస్ విస్తరణ వేగం

**విదేశాలు, ఢిల్లీ కనెక్షన్ లేకున్నా గుంటూరులో ఒకరికి కరోనా**

**ఎవరి ద్వారా, ఎలా సోకిందో!**

**ఇప్పటికి అలాంటివి 8 కేసులు**

**రాష్ట్రంలో మరో 11 పాజిటివ్**

**గుంటూరులోనే 9 కేసులు**

**నెల్లూరు, కడపలో ఒక్కొక్కరు**

**మొత్తం బాధితుల సంఖ్య 314**

**మృతుల సంఖ్య నాలుగు**

**మూడో దశ ప్రారంభంలో ఉన్నాం**

**ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు**

**2 లక్షల పరీక్షలు చేయాల్సి ఉంది**

**ఇప్పటికి 280 కేసులకు ఢిల్లీ లింక్**

**ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ వెల్లడి**

**ఎనిమిది మందికి ఎలా?**

విదేశాల్లో వైరస్ సోకించుకున్న వారు, మర్కజ్ నిజాముద్దీన్‌లో బాధితులుగా మారిన వారు... వారి ద్వారా వైరస్ సోకిన వారు! రాష్ట్రంలో ఇప్పటిదాకా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినవివే! కానీ... వీరెవరితో సంబంధం లేని, ఎవరి ద్వారా వైరస్ సోకిందో తెలియని కేసులూ మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. ఇప్పటికి ఇలాంటి సస్పెన్స్ కేసులు 8 దాకా లెక్కతేలాయి.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గుంటూరుకు చెందిన ఒక డాక్యుమెంట్ రైటర్‌కు సోమవారం కరోనా పాజిటివ్‌గా తేలింది. ఆయన విదేశాలకు వెళ్లలేదు. ఆయన కుటుంబ సభ్యులూ విదేశాల నుంచి రాలేదు. ఢిల్లీ కనెక్షనూ లేదు. అంటే... ఇంకెవరి ద్వారానో ఆయనకు వైరస్ సోకిందన్న మాట! ఇలాంటి కేసులు ఇప్పటికే విశాఖ జిల్లాలో నాలుగు, కర్నూలు, కృష్ణా, అనంతపురం జిల్లాల్లో ఒకటి చొప్పున బయటపడ్డాయి. అంటే... మొత్తం 8 మందికి 'ఎవరి ద్వారా' అన్నది తెలియకుండానే వైరస్ సోకింది. అధికారులు వారి 'కాంటాక్ట్'ను

మిగతా 7వ పేజీలో...



### రెడ్‌జోన్స్‌లో ర్యాండమ్ పరీక్షలు

**వైజాగ్ తరహాలో జరపాలి**

**వీలైతే హాట్‌స్పాట్‌లలో కూడా..**

**క్వారంటైన్ కేంద్రాలు, ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు**

**ఇంకొన్ని రోజులు శ్రద్ధపెట్టండి**

**కరోనా నివారణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తాం**

7

**ముఖ్యమంత్రి జగన్ ఆశాభావం**

**ఉన్నతాధికారులతో సమీక్ష**

### ట్రూనెట్‌లో కరోనా టెస్ట్

***285 కేంద్రాల్లో వైరస్ పరీక్షలు.. వేగం పుంజుకోనున్న నిర్ధారణ***

**రోజుకు 7వేల నమూనాల పరిశీలన.. టీబీ కేంద్రాల్లోని యంత్రాల వినియోగం**

**ఐసీఎంఆర్ సూచనల మేరకు చర్యలు**

7



కడప జిల్లా రైల్వేకోడూరు మండలం రాఘువాపురంలో చెట్టుపైనే మాగి కుళ్లిపోతున్న అరటి గెల

## చెట్టు దిగని అరటి

### పొలంలోనే మాగిపోతున్న పంట.. రూ. లక్షల పెట్టుబడి మట్టిపాలు

***లాక్‌డౌన్‌తో స్తంభించిన రవాణా***

***టన్ను 3,500కు పడిపోయిన ధర***

***ఈ రేటుకు అమ్మితే 1,250 కోట్లు నష్టం***

***అయినా కొనేవారు లేక అవస్థలు***

***దిగుబడి బాగున్నా.. అమ్మకాలు నిల్***

***కన్నీటి సుడిలో అరటి రైతులు***

కడప, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అరటి రైతులకు కరోనా ఊహించని కష్టాలను మిగిల్చింది. అటు అమ్మడానికీ లేదు.. ఇటు కోయడానికీ లేదు అన్నట్టుగా తయారైంది వీరి పరిస్థితి. దిగుబడిని చెట్టుపైనే వదిలేద్దామంటే పక్వానికి వచ్చిన పంట మాగి కుళ్లిపోతుంది. మరో వారం, పది రోజులు గడిస్తే ఒక్క గెల కూడా చేతికొచ్చే అవకాశం లేదని, లక్షల పెట్టుబడి కళ్లముందే మట్టిపాలవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమయంలో రూ.15వేల వరకూ పలకాల్సిన టన్ను అరటి... రవాణా లేక రూ.3,500 కూడా పలకడం లేదు. ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు రవాణా సౌకర్యం కల్పిస్తున్నా అది అరకొరే. సీఎం జగన్ సొంత జిల్లా కడపలో అరటి రైతులను

మిగతా 3వ పేజీలో...





### ఉత్తరాదికి అరటి, మామిడి ఎగుమతికి కృషి

**'కరోనా' కట్టడికి కేంద్రంతో సమన్వయం**

**నిధులు, నిత్యావసరాలపై నిత్యం సంప్రదింపులు**

**ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ వెల్లడి**

## అప్పుల కుప్ప!

**మార్చి 31తో ముగిసిన ఆర్థిక ఏడాదిలో 77 వేల కోట్ల అప్పు**

3

**బ్యాంకు, బహిరంగ రుణాలు, ఉద్యోగుల నిధులు వాడుకున్న వైనం**

**మొత్తం ఖర్చు రూ.1.87 లక్షల కోట్లు**

**ఆదాయం రూ.1.10 లక్షల కోట్లు**

**అయినా బడ్జెట్ అంచనాలకు దూరమే**

# ఈ సృష్టికంతా ఒకే మనసు!



పరంజ్యోతి

అందరూ సృష్టిని, మనిషిని, ప్రకృతిని వేర్వేరుగా గుర్తిస్తుంటారు. కానీ ఘనీభవించిన మనసే దేహం. నీరు గడ్డకట్టి మంచుగా మారినట్లు మనసే ప్రకృతిగా మారుతుంది. మనసులో ఉన్నదంతా ప్రపంచం యొక్క సూక్ష్మాంశే. బయట ఉన్నదంతా మనసు యొక్క స్థూలాంశే. ఈ రెండూ నాణేనికి బొమ్మా-బొరుసూ లాంటివి. ప్రకృతి ప్రభావం జీవరాశిపై, మనసు ప్రభావం ప్రకృతిపై పడుతూనే ఉంటుంది. అయితే మనిషి తెలివితో బాహ్య ప్రకృతిని, గుణంతో ప్రకృతి సూత్రాలను ధ్వంసం చేస్తుంటాడు. అతివృష్టి, అనావృష్టి, వరదలు, భూకంపాలు ఇవన్నీ దీని నుండి పుట్టిన విషపుత్రికలే. దీనినే జ్యోతిష శాస్త్రం రాశులు, నక్షత్రాలు, గ్రహాల ద్వారా మనిషిలో ఏర్పడే కష్టనష్టాలుగా సూచించింది. నవగ్రహాలంటే దేవతలు మొదలుకొని సమస్త జీవరాశి ఉద్భవానికి కారణమైన సృష్టి తత్వ సంబంధ మూలబిందువులు. మానవుల్లోని గుణాలను గ్రహాలకు ఆపాదించి నియంత్రించే వ్యవస్థ మనది. దశావతారాలు, పంచభూతాలు, నవగ్రహాలు.. ఇవన్నీ మానవ ప్రకృతి-వికృతుల్లోని లోటుపాట్లను సరిచేసి సమతుల్యత సాధించే భూమికలు. ప్రపంచ మనుగడకు, మానవ జీవితానికి ఉన్న సంబంధాన్ని పరిహారాల రూపంలో అందించిన విజ్ఞానదృష్టి కూడా మనదే. రవి ప్రాణానికి, చంద్రుడు మనస్సుకు, కుజుడు శక్తికి, బుధుడు బుద్ధికి, గురుడు వివేక, జ్ఞానాలకు, శుక్రుడు సుఖానికి, శని దుఃఖానికి, శ్రమకు కారకులుగా చెప్పడం.. ప్రకృతికి, మనిషికి ఉన్న సంబంధాన్ని నిర్వచించడమే. మర్రి విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నట్టు.. ఈ సూచికల్లో వ్యక్తిగత, సామూహిక శక్తులు ఉన్నాయి. సామూహిక మనస్తత్వం ప్రకృతి ద్వారా వ్యక్తం అవుతుంది. దీన్నే 'విశ్వ రసాయన శాస్త్రం (కాస్మిక్ కెమిస్ట్రీ)' అని ఆధునికులు పిలుస్తారు. విశ్వమంతా ఒకే శరీరం. ఒక వ్యక్తి కాలి వేలికి గాయం అయితే శరీరమంతా ప్రభావితమవుతుంది. శరీరాంగాల్లో ఏ అవయవం గాయపడ్డా ఆ వార్త గుండె వరకూ చేరుతుంది. శరీరంలోని సజీవ ఏకత్వం ఏ భాగాన్ని స్పృశించినా శరీరం మొత్తం స్పందిస్తుంది. ఏదీ ఒంటరిగా మనలేదు. అలాగే మనలోని దుష్టత్వం కాలాంతరంలో గ్రహాల మధ్య చెడు దృష్టిగా మారుతుంది. అది వ్యక్తులపై మాత్రమే కాకుండా ప్రకృతిపై కూడా దుష్ప్రభావాన్ని సూచిస్తుంది. వ్యక్తిగతమైన తప్పులు సమష్టి విపత్తుకు కారణం అవుతాయి. ఇదే ఇందులోని రహస్యం.



మనలోని దుష్ప్రవర్తన సామూహికమైనప్పుడు దాని ఫలితం గ్రహాల అశుభ దృష్టిగా, వక్రదృష్టిగా మారి రాక్షసత్వంగా, భూకంపంగా మారిపోతుంది. సముద్రంలో ఏ మూల అలజడి కలిగినా అలలు, తరంగాల రూపంలో అంతటా వ్యాపించినట్లే మనో సంద్రంలో కలిగే అలజడి ప్రకృతిలో వ్యక్తమవుతుంది. సుఖభోగాలను ఆశించే మనిషి బ్రహ్మతత్వమైన ధర్మాన్ని వదిలిపెట్టి విధ్వంసకారుడిగా మారినప్పుడు ప్రకృతి అతనిలో రోగాలు కలిగించడం ద్వారా.. లేదా వరదలు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు వంటి విలయాలను సృష్టించడం ద్వారా సరిచేసే ప్రయత్నం చేస్తుంది. మనసు ద్వారా మనం గుర్తించకపోతే కాలం గుర్తించేలా ప్రకృతే స్పందిస్తుంది. లోకం పాడయ్యిందనే సూచన మొదట మనకు ప్రకృతే తెలియచేస్తుంది. మనిషిలోని గుణాలే ప్రకృతిగా ప్రతిబింబిస్తాయి. 'సామూహిక ప్రార్థన' ప్రకృతి నుండి ఏర్పడే విపరీతాలను ఎలా తగ్గిస్తుందో.. 'సామూహిక అనైతికత', సామూహిక విధ్వంసం కూడా అలా వికటించి.. సామూహిక శాపంగా ప్రతిబింబించి తీరుతుంది. ఇది మనకు పెద్ద 'గ్లోబల్ వార్మింగ్' మాత్రమే కాదు, గ్లోబల్ వార్నింగ్ కూడా!

- శివశ్రీ గెంటేల వెంకట రమణులు, 94919 57399

## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 24.0 | 36.2 |
| అనంతపురం | 24.6 | 38.6 |
| విజయవాడ | 26.8 | 37.6 |
| కడప | 27.0 | 41.0 |
| ఒంగోలు | 28.4 | 35.7 |



### తబ్లీగీ ఘటన సమయంలో పోలీసులు ఎక్కడ?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పర్యటన సమయంలో ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. పోలీసు కమిషనర్ అప్పుడేం చేస్తున్నారు? 8-10 రోజుల అనంతరం తబ్లీగీ జమాత్ సమావేశం జరిగింది. అదే కమిషనర్ దానికి అనుమతి ఇచ్చారు. పది రోజుల వ్యవధిలో ఈ ఘటనలు జరిగితే ప్రభుత్వం ఏం చేస్తోంది? పోలీసులు ఎక్కడ ఉన్నారు?

- సుప్రియా సూలే, ఎన్సీపీ ఎంపీ



### కొవిడ్‌కు త్వరలో ఆయుర్వేద చికిత్స

ఆయుర్వేద వైద్యంతో కొవిడ్-19కు కచ్చితంగా త్వరలోనే చికిత్స లభిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయుర్వేదం ఒక్కటే నివారణ మార్గం. బ్రిటన్ యువరాజు చార్లెస్‌కు ఆయుర్వేదంతోనే నయమైంది. ఆ వైద్యానికి పశ్చిమ దేశాల్లో ఆమోదం లేదు. అందుకే ప్రిన్స్ చార్లెస్ ఆ విషయాన్ని బయటపెట్టడం లేదు.

- శ్రీపాద నాయక్, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి

### శనిగ్రహంపై వేడి మిస్టరీ వీడింది!!

హూస్టన్ (అమెరికా): సూర్యుడి నుంచి దూరంగా ఉన్నందున శనిగ్రహం చల్లగా ఉంటుంది. ఒక్కోసారి వేడి పెరిగి 57 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంటుంది. ఈ మిస్టరీని అమెరికాలోని అరిజోనా వర్సిటీ శాస్త్రవేత్తలు ఛేదించేందుకు యత్నించారు. 'కేసిని' వ్యోమనౌక 13ఏళ్ల పరిశీలనపై అధ్యయనం ద్వారా, శనిగ్రహం ఎగువన ఉండే వలయాల్లోని విద్యుత్ ప్రవాహాలకు సూర్యుడి నుంచి వెలువడే సౌర పవనాల మధ్య చర్య జరుగుతుందని, ఇదే సమయంలో దాని ఉపగ్రహాల్లోని కణాలు కూడా వేడెక్కుతాయని గుర్తించారు. ఫలితంగా శనిగ్రహం ఉపరితల వాతావరణం వేడెక్కుతోందని వెల్లడించారు.

## మద్యం షాపులను అనుమతించండి

▸ భారత ఆల్కహాలిక్ బేవరేజ్ సమాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: మద్యం అమ్మకాలను అనుమతించాలని తెలంగాణ సహా 10 రాష్ట్రాలకు భారత ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీల సమాఖ్య(సీఐఏబీసీ) విజ్ఞప్తి చేసింది. లాక్‌డౌన్ అమల్లో ఉన్న కారణంగా మద్యం షాపులను మూసివేసినా చాలాచోట్ల మద్యం అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయని అభిప్రాయపడింది. సామాజిక దూరాన్ని పాటించడం కోసమే లిక్కర్ షాపులను మూసివేశారన్నది అర్థం చేసుకోదగినదే అయినప్పటికీ అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతుండటంతో ప్రభుత్వాల ఖజానాపై భారం పడుతోందని లేఖలో పేర్కొంది. షాపుల మూసివేతతో తాగుడుకు అలవాటు పడినవారి ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని, ఇది శాంతిభద్రతలపై ప్రభావం చూపవచ్చునని లేఖలో సీఐఏబీసీ డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి పేర్కొన్నారు. షాపులను తెరవాలని, మద్యం షాపుల లైసెన్సులను నెలపాటు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. .

### తబ్లీగీని నిషేధించండి

▸ సీజేఐకి లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: తబ్లీగీ జమాత్ సంస్థ కార్యకలాపాలను తక్షణమే నిషేధించేలా కేంద్రాన్ని ఆదేశించాల ని కోరుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఎస్ ఏ బోబ్డేకు ఫిర్యాదు అందింది. తన లేఖనే రిట్ పిటిషన్‌గా పరిగణించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీకి చెందిన అజయ్ గౌతమ్ సీజేఐ బోబ్డేకు ఓ లేఖ రాశారు. ప్రభుత్వ నిబంధనలను తబ్లీగీ జమాత్ సంస్థ ఉల్లంఘించిందని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి వెనుక కుట్రకోణం తెలియాలంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. నిజాముద్దీన్‌లో ఉన్న తబ్లీగీ జమాత్ సంస్థ భవనాన్ని కూల్చివేయాల్సిందిగా ఢిల్లీ సర్కారును ఆదేశించాలని కోరారు. కాగా50మంది కంటే ఎక్కువ మంది ఒక చోట సమావేశం కాకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన అధికారులపై చర్యతీసుకోవాలని అజయ్ గౌతమ్ కోరారు.

# డాక్టర్ రెడ్డీస్ సాయం 5 కోట్లు

▸ 50 వేల మంది కార్మికులకు నిత్యావసరాలు

▸ ఆంధ్ర షుగర్స్ సాయం 2.85 కోట్లు

▸ సుజనా చౌదరి విరాళం 2 కోట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో కరోనా నియంత్రణ చర్యలకు పలువురు దాతలు ముందుకువస్తున్నారు. సీఎం సహాయ నిధికి మంగళవారం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ రూ.5 కోట్లు అందించింది. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణరెడ్డి విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నిని కలిసి చెక్కును అందజేశారు. 50 వేల మంది కార్మికులకు నిత్యావసరాలను ఇచ్చారు. మంగళవారం అమరావతిలో సామాగ్రి వాహనాన్ని హోం మంత్రి మేకతోటి సుచరిత జెండా ఊపి ప్రారంభించా రు. వాహనంలో లక్ష కిలోల బియ్యం, 10 వేల లీటర్ల నూనె, 10 వేల కిలోల కందిపప్పు తదితర సామాగ్రి ఉన్నాయి. సీఎంఆర్‌ఎఫ్‌కు ఆంధ్ర షుగర్స్ లిమిటెడ్, అనుబంధ సంస్థలు రూ.2.85 కోట్ల విరాళాన్ని సీఎం జగన్‌కు అందజేసినట్టు సంస్థ అధినేత పెండ్యాల న రేంద్రనాథ్ చౌదరి తెలిపారు. ఇవికాకుండా రూ.80 లక్షల విలువైన 800 టన్నుల సోడియం హైపో క్లోరైడ్, 7500 లీటర్ల హ్యాండ్ శానిటైజర్లను అందజేయనున్నట్టు తెలిపారు. తన ఎంపీ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తున్నట్లు సుజనా చౌదరి సీఎం జగన్‌కు లేఖ రాశారు. సుజనా ఫౌండేషన్ తరపున రాష్ట్రంలో వైద్యపరికరాలు, నిత్యావసరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మొత్తంలో ఏపీ బీజేపీ ద్వారా రూ.25 లక్షలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా రూ.75 లక్షలు ఖ ర్చు చేస్తామన్నారు. ఇండియన్ టుబాకో అసోసియేషన్(ఐటీఏ) రూ.60 లక్షలు విరాళం ప్రకటించింది. గుం టూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో చైర్మన్ ర ఘునాథబాబుకు ఐటీఏ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు రూ.30 లక్షలు చెక్కును పీఎం కేర్స్‌కు అందజేశా రు. ఏపీసీఎంఆర్‌ఎఫ్‌కు రూ.15 లక్షలు అందజేశారు.



సీఎం జగన్‌కు చెక్ అందజేస్తున్న 'జీవీపీఆర్' వీరారెడ్డి, ఆంధ్ర షుగర్స్ జేఎండీ పెండ్యాల, 'సాగర్ సిమెంట్స్' ఆనంద్‌రెడ్డి



అత్యవసర వైద్య పరికరాలను సకాలంలో చేర్చిన ట్రక్కు డ్రైవర్లను సన్మానిస్తున్న రామ్‌కో ప్రతినిధులు

### జీతంలో 30 శాతం కోతకు అంగీకారం: గవర్నర్

కరోనా విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఏడాది పాటు తన జీతంలో 30 శాతం కోతను విధించుకోడానికి సంసిద్ధత తెలియచేస్తూ గవర్నర్ హరిచందన్ రాష్ట్రపతికి లేఖ రాశారు.

### పోలీసులకు 'కిమ్స్' రూ.50 లక్షలు

పోలీసు సహాయ నిధికి 'కిమ్స్' హాస్పిటల్ రూ.50 లక్షలు అందజేసింది. ఆసుపత్రి అధినేత డాక్టర్ భాస్కర రావు, పోలీస్ బాస్ గౌతమ్ సవాంగ్‌కు విరాళం చెక్కును అందజేశారు. కాకినాడలోని జెమిని ఏడబుల్స్ అండ్ ఫ్యాట్స్ జనరల్ మేనేజర్స్ గురుప్రసాద్, ఎ.రవిచంద్ర రూ.50 లక్షల చెక్కును మంత్రి కన్నబాబుకు అందజేశారు. పీఎం కేర్స్‌కు మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు రూ.6 లక్షలు ప్రకటించారు. కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ సీఈవో మురళీధర్ రూ.50 లక్షల విరాళాన్ని కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డికి అందజేశారు. అలాగే, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ తరపున సంస్థ చైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి ఒక కోటీ 458 రూపాయల చెక్కును సీఎం జగన్‌కు తాడేపల్లిలో కలిసి అందజేశారు. అలాగే సాగర్ సిమెంట్స్ తరపున ఎండీ ఆనంద్‌రెడ్డి, జేఎండీ శ్రీకాంత్‌రెడ్డి కూడా సీఎంను కలిసి తమ వంతుగా కోటి రూపాయల విరాళాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేశారు.



డీజీపీకి 50 లక్షలు చెక్కు అందజేస్తున్న 'కిమ్స్' భాస్కరరావు

### రామ్‌కో విరాళం 2.5 కోట్లు

రామ్‌కో సిమెంట్స్ సీఎం సహాయ నిధికి రూ.2.50 కోట్లు అందించింది. దీంతో పాటు థర్మల్ స్కానర్లు, పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు అందించింది. కృష్ణా, కర్నూలు జిల్లాల్లోని జగ్గయ్యపేట, కొలిమిగుండ్ల మండలాల్లో క్రిమిసంహారక చర్యలు చేపట్టింది. ఒడిసాకు రూ.2 కోట్ల విలువైన అత్యవసర వైద్య పరికరాలను 36 గంటల్లో రోడ్డు మార్గంలో భువనేశ్వర్‌కు తరలించింది. సహకరించిన ట్రక్కు డ్రైవర్లను, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లను రామ్‌కో సత్కరించింది.

# సెంట్రల్ విస్టా ఆపాలి

▸ ఆ 20 వేల కోట్లూ వైద్య సదుపాయాలకు వాడండి

▸ విదేశీ పర్యటనలు వద్దు... ప్రభుత్వ ప్రకటనలూ రద్దు

▸ ఐదు సూచనలతో మోదీకి సోనియా లేఖ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో రూ.20 వేల కోట్లతో ఢిల్లీ నడిబొడ్డున చేపట్టదల్చిన సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్ట్‌ను నిలిపేయాలని, ఆ నిధులతో ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతమున్న చారిత్రక భవనంలో పార్లమెంటు కార్యకలాపాలను సౌకర్యవంతంగా సాగించవచ్చని అభిప్రాయపడ్డారు. సంక్షోభ కాలం ముగిసే వరకూ ఈ విలాసాలు అవసరం లేదనీ ఆమె ప్రధానికి రాసిన ఓ లేఖలో పేర్కొన్నారు. కొవిడ్-19పై పోరుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రధాని ఫోన్ చేయడంతో ఆమె ఈ లేఖ పంపారు. పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవనం, రాజ్‌పథ్, ఇండియా గేట్ వరకూ ఉన్న 3.5 హెక్టార్ల స్థలం రూపురేఖలు మార్చాలన్న ప్రణాళికే సెంట్రల్ విస్టా ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు రూ. 25,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా. బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి కూడా రెండ్రోజుల కిందట ఇదే సూచన చేశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తృణమూల్ కాంగ్రెస్ నేత మొహువా మైత్రే, ఎస్పీ, బీఎస్పీ, డీఎంకే నేతలూ ఈ ప్రాజెక్టు ఆపాలని సూచించారు. సోనియా చేసిన మరో సూచన.. రెండేళ్ల పాటు ప్రభుత్వ ప్రకటనలపై నిషేధం. ఒక్క కరోనాపై చైతన్యానికి సంబంధించిన యాడ్స్ తప్ప మిగిలినవన్నీ నిలిపేయాలన్నారు. ప్రస్తుతం ఏటా రూ.1250 కోట్లు కేవలం కేంద్ర సర్కారే ప్రకటనల కోసం ఖర్చు చేస్తోంది. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు, అధికారులు జరిపే విదేశీ పర్యటనలను నిలిపివేయాలని సోనియా ప్రతిపాదించారు. ఒక్క ప్రధాని ఖాతా కింద ఏటా విదేశీయానాలకు రూ 400 కోట్ల మేర ఖర్చవుతోంది. మరో సూచన ఏంటంటే.. పీఎం కేర్స్ నిధిలో జమ అయిన మొత్తాన్ని ప్రధాని సహాయ నిధికి బదిలీ చేయాలని, దీనివల్ల నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటాయని పేర్కొన్నారు. అదే విధంగా- ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలను మినహాయించి వ్యయ బడ్జెట్‌లో 30% తగ్గించాలని, దాంతో ఆదా అయ్యే రూ.2.5 లక్షల కోట్లతో వలస కార్మికులు, కార్మికులు, రైతులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక భద్రత కల్పించాలని ఆమె సూచించారు. ఎంపీల జీతభత్యాల్లో 30 శాతం కోత, రెండేళ్ల పాటు ఎంపీల్యాడ్స్ నిధుల నిలిపివేతను స్వాగతించారు.

**ఎన్‌బీఏ నిరసన**

రెండేళ్ల పాటు మీడియా సంస్థల్లో ప్రభుత్వ, పీఎస్‌యూల ప్రకటనలు ఇవ్వొద్దంటూ సోనియా చేసిన సూచనపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ సంఘం(ఎన్‌బీఏ) నిరసన వ్యక్తం చేసింది. ఇది మొత్తం మీడియానే ఇబ్బందుల పాల్జేస్తుందని, ఈ సూచన తీవ్ర నిరాశా నిస్పృహలకు దారి తీస్తుందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఎన్‌బీఏ అధ్యక్షుడు రజత్ శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఒకసారి ఒకరికి మాత్రమే ఫార్వర్డ్!

▸ వదంతుల అడ్డుకట్టకు వాట్సాప్ పరిమితి

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరోనాపై విస్తృతంగా వదంతులు, తప్పుడు వార్తలు ప్రచారమవుతున్న నేపథ్యంలో వాట్సాప్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్కువగా ఫార్వార్డ్ అవుతున్న సందేశాలను ఒకసారి ఒకరికి మా త్రమే పంపేలా యాప్‌లో మార్పులు చేసింది. 'ఎక్కువగా' అంటే.. ఐదుసార్లు లేదా అంతకుమించి ఫార్వార్డ్ అయిన ఏ సందేశమైనా వైరల్ అవుతున్నట్టే. వాట్సాప్ కొత్తగా విధించిన పరిమితి ప్రకారం అలాంటి సందేశాలను ఒకరికి/ఒక గ్రూపునకు మించి పంపించలేమన్నమాట. అలాగే.. వదంతులకు అడ్డుకట్ట వేసే మరో ఫీచర్‌ను కూడా వాట్సాప్ సంస్థ పరీక్షిస్తోంది. తరచుగా లేదా ఎక్కువమంది ఫార్వార్డ్ చేసే మెసేజ్‌లపై ఒక భూతద్దం బొమ్మ ఉంటుంది. అలాంటి గుర్తు ఉన్న సందేశం మనకు వచ్చినప్పుడు ఆ భూతద్దంపై టచ్ చేస్తే ఆన్‌లైన్ సెర్చ్‌లోకి తీసుకెళ్తుంది. వినియోగదారులు సెర్చ్ ఫలితాల్లో వార్తలను చదివి అది నిజమా కాదా తెలుసుకోవచ్చు. తప్పని తేలితే మరొకరికి ఫార్వార్డ్ చేయకుండా ఉండొచ్చు. కా గా.. సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం చే రవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ స ర్కారు మరోమారు హెచ్చరించింది. కాగా.. వాట్సాప్ ద్వారా త ప్పుడు వార్తలు, వదంతుల వ్యాప్తిని అడ్డుకోవాలంటూ ఇండో ర్ కలెక్టర్ ఇచ్చిన పిలుపు మేరకు అక్కడ వేలాదిమంది వా ట్సాప్ గ్రూప్ అడ్మిన్లు తమ గ్రూపు సెట్టింగులను మార్చేశా రు. తాము తప్ప గ్రూపులోని సభ్యులెవరూ మెసేజ్‌లను పోస్ట్ చేయకుండా నిలువరించారు.

### తప్పుడు వార్తల్ని తొలగించండి

కరోనా వైరస్ ముప్పు నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, వదంతులు ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవడానికి కేంద్రం నడుం బిగించింది. కొవిడ్-19పై పోరులో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిర్వీర్యం చేసే వదంతులను, ఆడియో, వీడియో క్లిప్పులను గుర్తించి తొలగించాలని టిక్‌టాక్, హెలో, ఫేస్‌బుక్ వంటి వాటిని ఆదేశించింది. అంతేకాదు, తప్పుడు వార్తలను, వదంతులను ప్రచారం చేస్తున్నవారి వివరాలను తమకు ఇవ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కోరినట్టు సమాచారం. 'వాయేజర్ ఇన్ఫోసెక్' అనే సంస్థ.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 30వేల వీడియోలను ఐదురోజుల్లో పరిశీలించి ఇచ్చిన నివేదిక మేరకు కేంద్రం ఈ ఆదేశాలు జారీ చేసింది.

### 3 టిక్ మార్కులు తప్పుడు ప్రచారం: పీఐబీ

వాట్సాప్ ద్వారా మనం ఎవరికైనా సందేశం పంపినప్పుడు ఒక టిక్ మార్కు వస్తుంది. అది వారికి చేరితే రెండు టిక్ మార్కులు కనపడతాయి. ఆ సందేశాన్ని వారు చదివితే రెండు బ్లూ టిక్ మార్కులు వస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అందరి వాట్సాప్ పోస్టులపైనా నిఘా వేసిందని.. అలా ప్రభుత్వం చూసిన పోస్టులకు మూడు బ్లూ టిక్ మార్కులు వస్తాయని, వాటిని పెట్టినవారిపై చర్యలు తీసుకుంటుందని పేర్కొంటూ ఒక సందేశం విస్తృతంగా వ్యాపిస్తోంది. కానీ, అది అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం మంగళవారం వివరణ ఇచ్చింది. అది వదంతేనని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పష్టం చేసింది.

## నవ్య | చిత్రజ్యోతి

### భయానికి దూరంగా ఉందాం

- మహేశ్‌బాబు



"సామాజిక దూరం, చక్కటి పరిశుభ్రత పాటించడంతో పాటు భయానికి దూరంగా ఉండటం(ఫియర్ డిస్టెన్సింగ్)పై దృష్టి సారించడమూ అంతే ముఖ్యం" అని మహేశ్‌బాబు అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరోనాపై యుద్ధంలో ప్రభుత్వాలు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఆసుపత్రుల్లో, వీధుల్లో తమ ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేస్తున్నవారందరిపై మరింత గౌరవం, ఆరాధన పెరిగాయని ఆయన తెలిపారు. "ఫియర్ డిస్టెన్సింగ్ - భయం, ఆందోళన సృష్టించే వార్తలు, మనుషులకు మనమే దూరంగా ఉందాం. ఇప్పుడు ఫేక్ న్యూస్ పెద్ద సమస్య. తప్పుదారి పట్టించే సమాచారానికి దూరంగా ఉండండి" అని మహేశ్‌బాబు అన్నారు.

### వైద్యులకు మాస్కులు వదిలేయండి

- విజయ్ దేవరకొండ



"మెడికల్ మాస్కులను వైద్యులకు వదిలేయండి. వాటి బదులు చేతి రుమాలు, స్కార్ఫ్, అమ్మ చున్నీని ఉపయోగించండి" అని విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమాల్లో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనా మహమ్మారి బారిన పడుతున్న ప్రజల సంఖ్య పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు, శానిటైజర్లు ఉపయోగిస్తున్నారు. అందువల్ల, వైద్యులకు అవసరమైన మాస్కుల కొరత ఏర్పడుతుందని భావించి ఈ సూచన చేసినట్టున్నారు. "ముఖాన్ని కవర్ చేసుకోండి. సేఫ్‌గా ఉండండి. ముఖాన్ని క్లాత్‌తో కవర్ చేసుకోవడం వల్ల వ్యాధి నెమ్మదిగా వ్యాప్తి చెందుతుంది" అని విజయ్ దేవరకొండ అన్నారు.



ట్రెండ్‌సెట్స్ బిల్డర్స్ అధినేత, ప్రముఖ నిర్మాత డా.కె.ఎల్ నారాయణ తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 25 లక్షలు విరాళం ప్రకటించారు. ఆ చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేశారు.

### మోహన్‌బాబు దాతృత్వం



విలక్షణ నటుడు డా.మంచు మోహన్‌బాబు మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులు పడుతున్న పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఆయన కృషి చేస్తున్నారు. పెద్ద కుమారుడు విష్ణుతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరి మండలంలో మోహన్‌బాబు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 10 గ్రామాలకు మంచు కుటుంబం ప్రతిరోజూ 8 టన్నుల కాయగూరలు సరఫరా చేస్తోంది. అలాగే, 800 మంది నిరుపేదలకు మధ్యాహ్నం, రాత్రిపూట భోజనం పెడుతున్నారు. అనారోగ్యంతో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిసింది. లాక్‌డౌన్ తొలగించే వరకూ ఈ సేవలు సదుపాయాన్ని కొనసాగించాలని మోహన్‌బాబు నిర్ణయించుకున్నారని సమాచారం.

### ఎవరూ ఆకలితో నిద్రపోకూడదు

- హృతిక్ రోషన్



వృద్ధులు, రోజువారీ కార్మికులు, పేదలకు లాక్‌డౌన్ సమయంలో భోజన సదుపాయం కల్పించడానికి హిందీ కథానాయకుడు హృతిక్ రోషన్ ముందుకొచ్చారు. అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రతిరోజూ 1.2లక్ష మందికి ఆయన భోజనం పెడుతున్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ హృతిక్ సహకారంతో దేశవ్యాప్తంగా వృద్ధాశ్రమాలు, పేద ప్రజలకు ఆరోగ్యకరమైన భోజనం అందివ్వడం సంతోషంగా ఉందని అక్షయ పాత్ర ట్వీట్ చేసింది. "దేశంలో ఎవరూ ఆకలితో నిద్రపోకుండా చూసుకొనే శక్తి అక్షయ పాత్రకు రావాలని కోరుకుంటున్నా. మీరే నిజమైన సూపర్ హీరోలు. మనమంతా మన శక్తి మేరకు సహాయం చేద్దాం. సహాయం ఏదైనా చిన్నది లేదా పెద్దది కాదు. అందరికీ ఆల్ ది బెస్ట్" అని హృతిక్ ట్వీట్ చేశారు.

### అజిత్ విరాళం రూ.1.25 కోట్లు



కరోనా నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఇప్పటికే సినీ సెలబ్రిటీలు భారీ విరాళాలు అందజేశారు. తాజాగా తమిళ స్టార్‌హీరో అజిత్ రూ.1.25 కోట్లు విరాళం ప్రకటించారు. అందులో పీయం కేర్స్ ఫండ్‌కి రూ.50లక్షలు, తమిళనాడు సీయం రిలీఫ్ ఫండ్‌కు రూ. 50 లక్షలు, దక్షిణ భారత చలనచిత్ర కార్మిక సమాఖ్య(ఫెఫ్సీ)కు రూ.25లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. లీడ్ ఇండియా, స్కైజోన్ ఇండియా సంస్థల తరపున నిర్మాత రామ్ తాళ్లూరి తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5లక్షలు, సినీ కార్మికులకు రూ.50 వేలు విలువగల నిత్యావసర వస్తువులను అందజేశారు.

### జోవా మొరానీకు కరోనా



బాలీవుడ్ నిర్మాత కరీమ్ మొరాని ఇంట్లో కరోనా కలవరం సృష్టిస్తోంది. మార్చి మొదటివారంలో శ్రీలంక నుంచి వచ్చిన ఆయన కుమార్తె షాజా మొరానికు కరోనా లక్షణాలు లేనప్పటికీ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలిందని కరీమ్ తెలిపారు. తాజాగా కరీమ్ రెండో కూతురు నటి జోవా మొరానీకు కూడా కరోనా సోకిందని తెలిసింది. 15 రోజుల కిందట రాజస్థాన్ నుంచి ఇంటికి తిరిగొచ్చిన జోవాకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వీరిద్దరూ వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో కరీమ్ కుటుంబ సభ్యులతోపాటు.. వారి సహాయకులకు వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం వారంతా క్వారంటైన్‌లో ఉన్నారు.

# కరోనా కల్లోలం

## జనారణ్యం నుంచి జలాల్లోకి..



ఈవన్నీ తాబేళ్ల పిల్లలు...కృష్ణాజిల్లా పాలకాయితిప్ప సమీపంలోని డాల్ఫిన్ భవనం వద్ద ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల హేచరీలోని పునరుత్పత్తి కేంద్రం నుంచి మొత్తం 170 పిల్లలను మంగళవారం సముద్రంలోకి వదిలారు. గత రెండు నెలల నుంచి గుడ్ల సేకరణ, సంరక్షణ పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసి పిల్లలను అటవీశాఖాధికారులు, మెరైన్ పోలీసు యంత్రాంగం సముద్రంలోకి వదులుతున్నారు.

- పాలకాయితిప్ప (కోడూరు)

## వైసీపీ నాయకుని 'మందు' చూపు!

గిద్దలూరు, ఏప్రిల్ 7: స్థానిక ఎన్నికల సమయంలో మద్యం పంచకూడదని ఒక పక్క సీఎం ఆదేశాలు జారీ చేస్తే.. మరోపక్క ఆ పార్టీ నాయకుడే ఎన్నికల కోసం అక్రమంగా నిల్వ చేయడమే కాకుండా లాక్‌డౌన్ నేపథ్యంలో విక్రయిస్తూ పట్టుబడ్డ వైనం ఇది. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం గడికోట గ్రామానికి చెందిన పిడుగు శ్రీనివాసరెడ్డి ఎంపీటీసీ పదవికి వైసీపీ తరపున నామినేషన్ దాఖలు చేశాడు. ఎన్నికల్లో పంచేందుకు బెంగళూరు నుంచి పలు పర్యాయాలు మద్యం తీసుకువచ్చి ఇంట్లో నిల్వ చేశాడు. అయితే ఎన్నిక ఏకగ్రీవం కావడంతో మద్యం పంచకుండా దాచుకున్నాడు. ప్రస్తుతం లాక్‌డౌన్ విధించడంతో మద్యం షాపులు మూతపడ్డాయి. దీంతో మందుకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా శ్రీనివాసరెడ్డి ఎన్నికల కోసం తాను అక్రమంగా తెచ్చుకున్న కర్ణాటక మద్యాన్ని భారీ రేట్లకు అమ్మడం ప్రారంభించాడు. ఈ విషయం ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్.తిరుపతయ్య, స్థానిక సీఐ సోమయ్య, సిబ్బందితో మంగళవారం తెల్లవారుజామున గడికోట వెళ్లి శ్రీనివాసరెడ్డి ఇంటిని తనిఖీ చేశారు. ఇంట్లో, కారులో 25కేసుల మద్యం లభించడంతో స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేశారు.

# ఏమిటీ వివక్ష?

- టీడీపీ ఎమ్మెల్యేల ఫోన్లు కలెక్టర్ తీయరా?
- లాక్‌డౌన్ ఆంక్షలు ఉల్లంఘించి మంత్రుల సమావేశాలు
- గవర్నర్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం గవర్నర్‌కు ఒక లేఖ రాశారు. రైతుల సమస్యలపై నిర్వహించిన అధికారిక సమావేశానికి అధికార పక్ష ఎమ్మెల్యేలను మాత్రమే పిలిచి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పిలవలేదని ఆయన ఆక్షేపించారు. 'కరోనా లాక్‌డౌన్ వల్ల ఆక్వా, ఉద్యాన, పౌల్ట్రీ, సెరికల్చర్, ధాన్యం తదితర వ్యవసాయ ఉత్పత్తుల రైతులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. అనేకసార్లు విన్నవించినా ప్రభుత్వంలో ఈ సమస్యలపై చలనం లేదు. దీనితో కలెక్టర్‌ను కలిసి ఈ సమస్యలను వివరించాలని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే, టీడీఎల్పీ ఉప నేత నిమ్మల రామానాయుడు అనుకొన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆయన ఫోన్‌ను కలెక్టర్ తీయలేదు. దీనితో కలెక్టర్‌ను కలవడానికి లాక్‌డౌన్ నిబంధనలకు లోబడి సైకిల్‌పై ఒంటరిగా బయలుదేరారు. కానీ ఆయనను అరెస్టు చేసి మళ్లీ పాలకొల్లు పంపారు. అదే రోజు పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌తో కలిసి భీమవరంలో మత్స్యశాఖ అధికారులతో ఒక సమావేశం నిర్వహించారు. దీనికి వైసీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశానికి ఆ జిల్లాలో ఉన్న ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను మాత్రం పిలవలేదు. ఎందుకీ వివక్ష అని తన లేఖలో చంద్రబాబు ప్రశ్నించారు. ఈ వివక్షాపూరిత ధోరణి, లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘనలపై విచారణ జరిపించి తగిన చర్య తీసుకోవాలని ఆయన గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

### ఏబీ సస్పెన్షన్ పొడిగింపు

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. నిఘా పరికరాల కొనుగోలుకు సంబంధించి ఆయన అవకతవకలకు పాల్పడ్డారంటూ వైసీపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తన సస్పెన్షన్‌పై వెంకటేశ్వరరావు క్యాట్‌ను ఆశ్రయించగా ప్రభుత్వ నిర్ణయాన్ని క్యాట్ సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయగా ఏబీపై ఆరోపణలకు సంబంధించి నెల రోజుల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించింది. అఖిల భారత సర్వీసుల అధికారుల సస్పెన్షన్ వ్యవహారాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఏబీ సస్పెన్షన్‌ను ఆగస్టు 5వరకూ పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

# చెట్టు దిగని అరటి



చిన్నకుడాలలో పశుగ్రాసంగా వేసిన అరటి పండ్లు

(మొదటి పేజీ తరువాయి)

కదిపితే కన్నీటి సుడులే. అరటి సాగుకు ఈ జిల్లా ప్రసిద్ధి. ఇక్కడ పండించిన పంట ఢిల్లీ, ముంబై, రాజస్థాన్, గుజరాత్, బెంగళూరు వంటి ప్రాంతాలకు రవాణా చేస్తారు. లాక్‌డౌన్ కారణంగా లారీలు నిలిచిపోయాయి. రవాణా స్తంభించడంతో పంట కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ధర వచ్చినప్పుడు కోద్దామనుకున్నా పక్వానికి వచ్చిన కాయ చెట్టుపైనే మాగి కుళ్లిపోతోంది. దీంతో ఏం చేయాలో తెలీక రైతులు దిక్కులు చూస్తున్నారు.

### 12లక్షల టన్నులు పొలాల్లోనే

జిల్లాలో 20వేల హెక్టార్లలో అరటి సాగు చేశారు. హెక్టారుకు సగటున 60- 62 టన్నుల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ఈ లెక్కన సరాసరి 12లక్షల టన్నుల దిగుబడి పొలాల్లోనే ఉండిపోయింది. ప్రస్తుతం టన్ను అరటి రూ.13,500- రూ.15వేలు పలకాలి. కరోనా కారణంగా రూ.3,500 మించడం లేదు. "ఆ ధరకే ఇచ్చేస్తాం, కొనండి మహాప్రభో" అంటున్నా కొనేవారు కరువయ్యారు. కొనుగోలు చేసిన పంటను రవాణా ఎలా చేయాలంటూ వ్యాపారులు ముందుకు రావడంలేదు. 'హలికునికి హాహాకారాలు..' శీర్షికన అరటి రైతుల కష్టాలను మార్చి 24న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. స్పందించిన సీఎం జగన్ ఉద్యాన పంటల రవాణాకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అంతేకాకుండా వ్యాపారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు రవాణా చేస్తే కి.మీ.కు రూ.55 రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటివరకు కేవలం 24వేల టన్నులు మించి రవాణా చేయలేని పరిస్థితి. రూ.3,500 ప్రకారం అమ్మినా టన్నుకు రూ.10వేలు చొప్పున రూ.1,250కోట్లకు పైగా అరటి రైతు నష్టపోయే పరిస్థితి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### పశుగ్రాసంగా గెలలు

పక్వానికి వచ్చి మాగిపోతున్న పంట రవాణా చేసేందుకు పనికిరాకుండా ఉండటంతో అక్కడక్కడా పశువులకు ఆహారంగా పడేస్తున్నారు. లింగాల మండలం చిన్నకుడాల గ్రామానికి చెందిన చలమారెడ్డి ఆరెకరాల్లో అరటి సాగు చేశారు. పంట పక్వానికి వచ్చింది. కొనేవారు లేకపోవడం, చెట్టుపైన గెలలు మాగిపోతుండటంతో 200 గెలలు కోసి గేదెలకు పశుగ్రాసంగా వదిలేశారు. ఇలాంటి రైతులు ఎందరో.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యాపారులతో నిమిత్తం లేకుండా ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టన్ను కనీసం రూ.8- 10వేలకు కొనుగోలు చేసి ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని అరటి రైతులు వేదన చెందుతున్నారు.

#### చెట్టుపైనే కుళ్లిపోతోంది

బోరుబావి కింద 2ఎకరాల్లో అరటి సాగుచేశాం. రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టాము. పంట పక్వానికి వచ్చింది. కోసి అమ్ముదామంటే కరోనా వల్ల రవాణా లేక వ్యాపారులు ముందుకు రావడం లేదు. పక్వానికి వచ్చిన గెలలు పొలంలో చెట్టుపైనే మాగి కుళ్లిపోతుంటే కన్నీళ్లు ఆగడంలేదు. టన్ను రూ.3,500కు అమ్మితే పెట్టుబడి కొంతయినా చేతికొస్తుందని ఆశిస్తే కొనేవారే లేరు.

- ఎరికల ఓబుల్‌రెడ్డి, అరటి రైతు,

#### ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఐదు ఎకరాల్లో అరటి సాగు కోసం రూ.8లక్షలు పెట్టుబడి పెట్టాం. గెలలు బాగా వచ్చాయి. కష్టాలు తీరుతాయనుకున్నాం. మా ఆశలపై కరోనా నీళ్లు చల్లింది. ఇప్పటికే పక్వానికి వచ్చిన గెలలు చెట్లపైనే మాగిపోతున్నాయి. ఆ పంట రవాణాకు పనికిరాదు. మరో పది రోజులు గడిస్తే ఒక్క గెల కూడా అమ్ముకోలేం. పెట్టుబడి మొత్తం మట్టిపాలవుతోంది. పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా సీఎం జగన్ చర్యలు తీసుకోవాలి.

- షేక్షావలి, అరటి రైతు,

## 'కరోనా'కట్టడికి కేంద్రంతో సమన్వయం

**ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ వెల్లడి**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కట్టడికి చేపట్టిన యుద్ధంలో విజయం సాధించేందుకు ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఢిల్లీ ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా తెలిపారు. మంగళవారం ఏపీ భవన్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో పండించే అరటి, మామిడి పండ్లను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కేంద్రంతో మాట్లాడే విషయంపై చర్చించామన్నారు. లాక్‌డౌన్ వల్ల రాష్ట్ర ప్రజలకు నిత్యావసర సరుకుల కేటాయించాలని కోరతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. ప్రధాని మోదీ, కేంద్ర ఆహారం, వినియోగ వ్యవహారాలశాఖ మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్‌లకు రాసిన లేఖల పురోగతిపైనా సమీక్షించారు. కేంద్ర ఆరోగ్య శాఖ సహకారంతో ఎన్-95, ట్రిపుల్ లేయర్ మాస్కులు, శానిటైజర్లు, ఔషధాలను కార్గో విమానాల్లో విజయవాడ తరలించినట్లు వివరించారు.

## వైద్యుల సేవలు సాహసోపేతం: పవన్

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా కరోనా వైరస్ ముప్పు ఉందని తెలిసినా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది చేస్తున్న సేవలు సాహసోపేతమైనవని జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం ఒక ప్రకటనలో కొనియాడారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

### కరోనా నియంత్రణపై చిత్తశుద్ధి లేదు: శైలజానాథ్

అనంతపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కరోనా వైరస్ నియంత్రణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, తీసుకుంటున్న అరకొర చర్యలే ఇందుకు నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ వైరస్‌ను ఎదుర్కోవడంలో ప్రభుత్వం శాస్త్రీయంగా ముందుకు సాగడం లేదన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పేదలు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులకు ఉచితంగా రేషన్ అందించడంతో పాటు ప్రతి కుటుంబానికి రూ. 5 వేలు నగదు పంపిణీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### 30 వరకు గుంటూరు మిర్చియార్డు మూత

గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి విక్రయ కేంద్రమైన గుంటూరు మిర్చియార్డును ఈ నెలాఖరు వరకు మూసి వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఐ.శామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు.

### ఏపీపీజీఈసెట్ దరఖాస్తు గడువు పెంపు

ఏయూ క్యాంపస్ (విశాఖపట్నం), ఏప్రిల్ 7: రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీపీజీఈసెట్ దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ పేరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### యువ శాస్త్రవేత్త పవన్‌కు సీఎం పేషీ నుంచి ఫోన్

పలమనేరు రూరల్, ఏప్రిల్ 7: కరోనా వైరస్‌ను నిర్వీర్యం చేసే పరికరాన్ని తయారు చేసిన యువ శాస్త్రవేత్త పవన్‌కు సీఎం పేషీ అధికారులు మంగళవారం ఫోన్ చేశారు. పరికరం పనిచేసే విధానం గురించి పూర్తి వీడియో పంపాలని వారు కోరినట్లు పవన్ తెలిపారు. పవన్ తయారు చేసిన కరోనాను నిర్వీర్యం చేసే పరికరం (బాక్సు) గురించి పత్రికల్లో రావడంతో సీఎం పేషీ అధికారులు స్పందించారు.

## వ్యవసాయోత్పత్తుల రవాణాల్లో.. కేంద్ర మార్గదర్శకాలు అమలు చేస్తున్నారా?

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ సందర్భంగా వ్యవసాయోత్పత్తుల తరలింపు, విక్రయాలు, వ్యవసాయ కూలీల పనుల్ని ఆటంకపరచరాదంటూ కేంద్రప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఎలా అమలు చేస్తున్నారో తెలపాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పుచ్చ, మామిడి తదితర పంటల ఉత్పత్తులు చేతికొచ్చే కాలమైనందున రైతులు నష్టపోకుండా లాక్‌డౌన్ సందర్భంగా కేంద్ర మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ ప్రకాశం జిల్లాకు చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. మంగళవారం దీనిపై ధర్మాసనం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది అంబటి సుధాకర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వ్యవసాయోత్పత్తుల్ని వెంటనే విక్రయించని పక్షంలో అవి పాడైపోతాయని, తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అందువల్ల కేంద్రమార్గదర్శకాల మేరకు రైతులు, కూలీల పనులకు అవాంతరాలు కలుగకుండా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

### ఆరంభమైన ఆర్టీసీ ఆన్‌లైన్ బుకింగ్

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మార్చి 22 నుంచి డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు రోడ్డు ఎక్కేందుకు సిద్ధం అవుతున్నాయి. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో పీటీడీ అధికారులు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ తెరిచారు. ఈ నెల 15 నుంచి బస్సులు అందుబాటులో ఉంచడంతో ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేస్తున్నారు. సోమవారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైంది.

### రేషన్ కార్డున్న ప్రతి వారికీ రూ.1000

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బియ్యం కార్డులు ఉన్న 1.33 కోట్ల కుటుంబాలతో పాటు రేషన్ తీసుకున్న కుటుంబాలన్నింటికీ రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేయనున్నట్లు విపత్తుల నిర్వహణశాఖ కమిషనర్ కె.కన్నబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డులు ఉన్న కుటుంబాలకు ఈ నెల 4 నుంచి ఆర్థిక సాయం పంపిణీ చేస్తున్నారని, కానీ, రేషన్ తీసుకున్న అందరినీ పరిశీలించి, అర్హులకు రూ.1000 ఇవ్వాలని సీఎం ఆదేశించినట్టు తెలిపారు.

### ఉద్యోగుల సంక్షేమాన్ని అటకెక్కించే కుట్ర: అశోక్ బాబు

అవనిగడ్డ టౌన్, ఏప్రిల్ 7: "రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్‌ను అడ్డుపెట్టుకొని ఉద్యోగుల సంక్షేమాన్ని అటకెక్కించే కుట్రకు పాల్పడుతోంది. తాజా పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఆదాయం కొంతమేర తగ్గిన మాట వాస్తవం. అయితే మార్చి నెలలో సహజంగా అధిక రెవెన్యూ ఉంటుంది. ఇప్పుడే సగం జీతాలు మాత్రమే ఇస్తున్న ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లో ఆయా నెలల జీతాలతో పాటు ఉద్యోగులకు బకాయి పడిన మొత్తాన్ని ఎలా ఇస్తుంది?" అని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు ప్రశ్నించారు. మంగళవారం అవనిగడ్డకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయటంతో పాటు పెన్షనర్లకూ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ పూర్తి చెల్లింపులు చేయాలని కోరారు.

### మున్సిపల్ ఉద్యోగులకు పూర్తి వేతనాలివ్వాలి

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నిరోధానికి 24 గంటలూ శ్రమిస్తున్న పట్టణ స్థానిక సంస్థల ఉద్యోగులందరికీ మార్చి నెల వేతనాలు పూర్తిగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహనరావు ఈ మేరకు పురపాలకశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### నిమ్మల దీక్ష విరమణ

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 7: ఇరిగేషన్, మత్స్య, వ్యవసాయశాఖల మంత్రులు బుధవారం ఉదయం పాలకొల్లు ఏఎంసీ వద్దకు వస్తే ఆక్వా, వరి రైతులు ఏ విధంగా నష్టపోతున్నారో క్షేత్రస్థాయికి తీసుకెళ్లి చూపిస్తానని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు. 24 గంటలపాటు తన నివాసంలో చేపట్టిన నిరశన దీక్ష మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. రైతులు ఎమ్మెల్యేకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

# వర్సిటీల్లో రాజకీయ కంపు

- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్లకే పదవులు
- నోట్ ఫైల్‌లో సిఫారసు చేసిన వారికే చోటు
- అనామకులకు విశిష్ట వ్యక్తుల కోటాలో స్థానం

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రభుత్వం చేపట్టిన విశ్వవిద్యాలయాల పాలక మండలి సభ్యుల నియామకం రాజకీయ రంగు పులుముకుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సూచించిన వారికే పదవులు వరించాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్లాస్-2 మెంబర్లకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నోట్‌ఫైల్‌లో సిఫారసు చేసిన వారికే చోటు దక్కడం గమనార్హం. విశిష్ట వ్యక్తుల కోటాలో అనామకులకు స్థానం కల్పించారు. ఒక్క వర్సిటీలోనూ సామాజిక సమతుల్యం పాటించ లేదు.

- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 9 మంది పాలక మండలి సభ్యుల్లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సిఫారసు చేసిన ఆరుగురిని నామినేట్ చేశారు. ఒకరిని సీఎంవో సిఫారసు చేసిందని నియమించారు.
- శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 9 మంది సభ్యుల్లో నలుగురిని విజయసాయిరెడ్డి సామాజిక వర్గం నుంచే నామినేషన్ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేశ్, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, సీఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి సిఫారసు చేసిన వారిని నియమించారు. పాలక మండలి సభ్యుడిగా ఇవ్వడం కుదరకపోవడంతో ఒకరికి ఏకంగా 'సెట్' కన్వీనర్ పదవి కట్టబెట్టారు.
- ఆచార్య నాగార్జున వర్సిటీలో సీఎంవో, హోంమంత్రి మేకతోటి సుచరిత, ఎమ్మెల్యేలు కిలారు వెంకట రోశయ్య, ముస్తఫా, ఆళ్ల రామకృష్ణారెడ్డి, నంబూరు శంకరరావు, మంత్రులు మోపిదేవి వెంకటరమణ, ఆదిమూలపు సురేశ్, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సిఫారసు చేసిన వారిని నామినేట్ చేశారు. ప్రొబెషన్ కూడా డిక్లేర్ కాని టీచర్‌ను సీనియర్ ప్రొఫెసర్ కేటగిరీ కింద నామినేట్ చేశారు. పర్మినెంట్ ప్రిన్సిపాల్ కాని వ్యక్తిని అఫిలియేటెడ్ కాలేజి ప్రిన్సిపాల్ కోటాలో నియమించారు. మంత్రి సిఫారసు మేరకే ఈయనకు దక్కిందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ మెసేజ్ పెట్టడం విచిత్రం.
- శ్రీ కృష్ణదేవరాయ వర్సిటీలో నలుగురు సభ్యులను అనంత వెంకట్రామిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన వారినే నియమించారు.
- ఆదికవి నన్నయ వర్సిటీలో ఎం.భరత్, పి.విశ్వరూప్, జక్కంపూడి రాజా, సజ్జల రామకృష్ణారెడ్డి, మేరుగ నాగార్జున సిఫారసు చేసిన వారిని నామినేట్ చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్‌ను పబ్లిక్ లైఫ్ కేటగిరీ కింద, ఓఎన్‌జీసీలో రెసిడెంట్ డాక్టర్‌ను ఇండస్ట్రీ కేటగిరీలో విశిష్ట వ్యక్తిగా నామినేట్ చేశారు.
- యోగివేమన వర్సిటీలో అవినాశ్‌రెడ్డి, అంజాద్‌బాషా, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్.శివ ప్రసాద్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సిఫారసు చేసిన నలుగురిని నామినేట్ చేశారు. పబ్లిక్ లైఫ్ కేటగిరీలో కాలేజీ కరస్పాండెంట్‌ను నామినేట్ చేశారు.
- డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీ అఫిలియేటెడ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పబ్లిక్ లైఫ్ కేటగిరీలో ఆ వర్సిటీ ఈసీ సభ్యుడిగా నియమించారు.
- జేఎన్‌టీయూ కాకినాడలో విజయసాయిరెడ్డి ఎక్కువ పేర్లు సిఫారసు చేశారు.
- జేఎన్‌టీయూ అనంతపురానికి ప్రిన్సిపాల్ కోటాలో టీచర్‌ను, టీచర్ కోటాలో ప్రిన్సిపాల్‌ను చూపించారు. కనీసం ప్రొఫెసర్ కూడా కాని వ్యక్తిని సీనియర్ ప్రొఫెసర్‌గా నియమించారు. జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ జయరామిరెడ్డి సిఫారసు మేరకు ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ను నియమించారు.
- కృష్ణా వర్సిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డి, వెలంపల్లి శ్రీనివాస్, అజేయ కల్లం, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సిఫారసు మేరకు నియామకాలు జరిగాయి.
- విక్రమ సింహపురి వర్సిటీలో మంత్రి బాలినేని, ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి సిఫారసు మేరకు సాఫ్ట్‌వేర్ కంపెనీ టీం లీడర్‌ను.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి అనిల్ కుమార్ సిఫారసు మేరకు కొందరిని నియమించారు.
- శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి భార్య పేరును ఎస్వీయూలోనే కాకుండా ఇక్కడ కూడా ప్యానెల్‌లో పెట్టారు. పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి సిఫారసు మేరకు మరొకరిని నియమించారు. చెన్నైలోని ఓ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌ను పబ్లిక్ లైఫ్ కేటగిరీలో నియమించారు.
- రాయలసీమ వర్సిటీలో నలుగురిని రెడ్డి సామాజిక వర్గం నుంచి నామినేట్ చేశారు. ఒక కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌ను ఇండస్ట్రీ కేటగిరీలో విశిష్ట వ్యక్తిగా నియమించారు. మాజీ వీసీని ఇతరుల కేటగిరీలో నియమించారు. ఆదిమూలపు సురేశ్, కర్నూలు నేతల సిఫారసు మేరకు కొందరిని నియమించారు.
- ద్రవిడ వర్సిటీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి సిఫారసు మేరకు ఒకరిని సభ్యునిగా నియమించారు.

# కరోనా కట్టడిలో భాగస్వాములవుదాం

- వైద్య సిబ్బందికి ధన్యవాదాలు : బాబు
- జగన్‌ను చూసి ప్రజలు నవ్వుతున్నారు
- ప్రజోపయోగ నిర్ణయాలేవీ?
- కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?
- ప్రభుత్వ తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరోనా కట్టడికి జరుగుతున్న కృషిలో అందరం భాగస్వాములవుదామని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. నిపుణుల సూచనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిద్దామని, స్వీయ నియంత్రణ, భౌతిక దూరంతో కరోనాని తరమికొడదామని మంగళవారం ట్వీట్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత కరోనా విపత్తులో వైద్యసేవలు చేస్తున్న వారిని ఆయన కొనియాడారు. కాగా కరోనా వైరస్ నివారణలో సీఎం జగన్ అవగాహన లేమిని చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అయ్యన్నపాత్రుడు ఎద్దేవా చేశారు. విపత్తు సాయంగా కేంద్రం ఇచ్చే సొమ్మును వైసీపీ నాయకులు పంచి, రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అవివేకమని విమర్శించారు. పబ్జీ గేమ్ ఆడుకునే ముఖ్యమంత్రికి కరోనాని ఎలా అరికట్టాలో ఏమి తెలుస్తుందని ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. రాజధాని భూములు ఇళ్ల పట్టాలకు ఇవ్వడాన్ని హైకోర్టు తప్పు పట్టినా తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు జగన్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కరోనా నివారణపై ముందు చూపు లేని సీఎం జగన్.. మంచి పాలనానుభవం కలిగిన చంద్రబాబు సూచనలు ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో పరిగణనలోకి తీసుకోకపోవడం సిగ్గుచేటని కొల్లు రవీంద్ర విమర్శించారు. కరోనా వైరస్ ప్రభావంతో ఉపాధి కోల్పోయిన గిరిజన రైతులను, కూలీలను ఆదుకోవాలని కిడారి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోకుండా నగదు పంపిణీ పేరుతో కరోనానూ రాజకీయంగా వాడుకోవాలని వైసీపీ చూస్తోందని అఖిలప్రియ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కరోనా విలయతాండవం చేస్తుంటే ప్రజల ప్రాణాలు గాలికొదిలేసి, జగన్ రాజకీయం చేయడంలో బిజీగా ఉన్నారని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ విమర్శించారు.

### ఆ పాపం ఊరికే వదలదు : బుద్దా

కరోనాపై పోరాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బందికి కేంద్రం పంపిన ఎన్95 మాస్కులు, రక్షణ కిట్లను కొట్టేసి, వారి ప్రాణాలను వైసీపీ నేతలు రిస్కులో పెట్టారని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆరోపించారు. 10 నెలలుగా ఆస్పత్రుల్లో కనీస వసతులు లేకుండా చేసి, ఇప్పుడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జగన్‌ని, ఎంపీ విజయసాయిరెడ్డిని ఆ పాపం ఊరికే వదలదని మంగళవారం ట్వీట్ చేశారు. వైసీపీ నాయకులు మాయం చేసిన మాస్కులు, రక్షణ కిట్లు లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు.

## తెలుగు జాలరులు, కూలీలను ఆదుకోండి

- తమిళనాడు సీఎంకు చంద్రబాబు విజ్ఞప్తి

చెన్నై, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ కారణంగా తమిళనాడులోని చెన్నై, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాల్లో చిక్కుకుపోయి అవస్థలు పడుతున్న తెలుగు వలస కూలీలు, జాలరులను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక లేఖ రాశారు. తమిళనాట లాక్‌డౌన్‌ను, కరోనా నిరోధక చర్యలకు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎడప్పాడి నాయకత్వాన్ని చంద్రబాబు ప్రశంసించారు. పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన జాలరులు, నిర్మాణ, పరిశ్రమల్లోని కార్మికులకు బస, ఆహారం, తాగునీరు, వైద్య సహాయం, ఇతర నిత్యావసరాలను సమకూర్చాలని ఎడప్పాడిని ఈ సందర్భంగా కోరారు.

# ఆంక్షలు మాకేనా?

- కోర్టు తీర్పులు లెక్క చేయరా?
- అమరావతి రైతుల ఆగ్రహం
- 112వ రోజు కొనసాగిన ఆందోళన

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): "కరోనా విస్తరించకుండా అమలు చేస్తున్న ఆంక్షలు మాకు మాత్రమే వర్తిస్తాయా? రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు వర్తించవా?" అంటూ అమరావతి ప్రాంత రైతులు మండిపడ్డారు. అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలంటూ ఆ ప్రాంత రైతులు చేస్తున్న ఆందోళనలు మంగళవారానికి 112వ రోజుకు చేరాయి. పెదపరిమి, నీరుకొండ దీక్షా శిబిరాల్లో రైతులు వంతుల వారీగా నిరసన ప్రదర్శనలు చేశారు. అనంతవరం, తుళ్లూరు, మందడం, రాయపూడి, వెలగపూడి, కృష్ణాయపాలెం, బోరుపాలెం, వెంకటపాలెం, ఎర్రబాలెం, కురగల్లు తదితర గ్రామాల్లో రైతులు, మహిళలు ఎక్కడికక్కడ వీధుల్లో కూర్చొని మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. చాలా ప్రాంతాల్లో మహిళలు ఇళ్లలోనే కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. "రాజధాని అభివృద్ధితో రాష్ట్రం బాగుంటుందన్న ఆశతో మా భూములు ఇచ్చాం. ఇక్కడ ఉద్దేశపూర్వకంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ప్రభుత్వం కుట్రలకు తెర తీస్తే సహించేది లేదు" అని రైతులు తేల్చి చెబుతున్నారు. హైకోర్టు స్టే ఇచ్చినా లెక్క చేయకుండా వచ్చి లేఅవుట్లు ఎలా వేస్తారని సీఆర్‌డీఏ అధికారులను నీరుకొండ, కురగల్లు రైతులు నిలదీశారు. కాగా, రాజధాని రైతులు 'అమరావతి వెలుగు' కొనసాగించారు. మంగళవారం రాత్రి 7.30 నుంచి ఐదు నిముషాల పాటు ఇళ్లలో విద్యుత్‌ను నిలిపివేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. 29 గ్రామాల కూడళ్లలో మహిళలు కొవ్వొత్తులు పట్టుకుని 'జై అమరావతి' నినాదాలతో హోరెత్తించారు.



కృష్ణాయపాలెంలో నిరసన తెలుపుతున్న మహిళలు

# అప్పుల కుప్ప!

- మార్చి 31తో ముగిసిన ఆర్థిక ఏడాదిలో 77 వేల కోట్ల అప్పు
- బ్యాంకు, బహిరంగ రుణాలు, ఉద్యోగుల నిధులు వాడుకున్న వైనం
- మొత్తం ఖర్చు రూ.1.87 లక్షల కోట్లు
- అయినా బడ్జెట్ అంచనాలకు దూరమే

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం(2019-20)లో ఏకంగా రూ.77,000 కోట్లు అప్పు చేసింది. వివిధ కార్పొరేషన్లు, బ్యాంకులు, బహిరంగ మార్కెట్ నుంచి సేకరించిన రుణాలు, ప్రభుత్వ ఉద్యోగుల నిధులు కలిపి రూ.77,000 కోట్లను అప్పురూపంలో వినియోగించుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వివిధ రూపాల్లో చేసిన ఖర్చు మొత్తం రూ.1.87 లక్షల కోట్లు. వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం రూ.1.10 లక్షల కోట్లు. ఆదాయానికి, వ్యయానికి మధ్య వ్యత్యాసంగా ఉన్న రూ.77,000 కోట్లను ప్రభుత్వం అప్పు రూపంలో తెచ్చుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. దీనిలో వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన మొత్తం రూ.16,000 కోట్లు, బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ బాండ్ల వేలం ద్వారా రూ.45,000 కోట్లు, ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న ఉద్యోగుల నిధులు, ఇతర నిధుల నుంచి రూ.16 వేల కోట్లు వినియోగించినట్టు అధికారులు తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంకంటే 2019-20లో ఆదాయం దాదాపు రూ.4,000 కోట్లకు పైగా తగ్గినట్టు ఆర్థిక శాఖ పేర్కొంది. అయినప్పటికీ 2019-20లో అప్పులు ఎక్కువ చేయడం వల్ల అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో కంటే రూ.30,000 కోట్లు అధికంగా ఖర్చు పెట్టగలిగామని తెలిపారు. చివరి త్రైమాసికంలో అప్పులు తెచ్చుకునేందుకు కేంద్రం అనుమతులివ్వడం, ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని స్వల్పంగా పెంచడంతో అప్పు తెచ్చుకోవడం సాధ్యపడిందని ఆర్థిక శాఖ అధికారులు వివరించారు. చివరి త్రైమాసికంలో దాదాపు రూ.15,000 కోట్లు బహిరంగ మార్కెట్ నుంచి అప్పు తీసుకురాగలిగినట్టు పేర్కొన్నారు. ఇంత భారీస్థాయిలో అప్పులు చేసినప్పటికీ ఖర్చు విషయంలో బడ్జెట్ అంచనాను చేరుకోలేకపోయామని తెలిపారు. 2019-20 బడ్జెట్‌లో ఖర్చు రూ.2.27 లక్షల కోట్లుగా అంచనా వేశారు. కానీ, రూ.1.87 లక్షల కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేయగలిగింది. వాస్తవిక ఖర్చుకి, బడ్జెట్ అంచనాకు రూ.47,000 కోట్ల వ్యత్యాసం ఉంది.

| అప్పులు ఇలా తెచ్చారు.. (కోట్లలో) | |
|---|---|
| వివిధ కార్పొరేషన్లు: | రూ.16,000 |
| ప్రభుత్వ బాండ్ల వేలం: | రూ.45,000 |
| ఉద్యోగుల నిధుల నుంచి: | రూ.16000 |
| మొత్తం: | రూ.77000 |

| 2019-20 ఆర్థిక సం.లో... (లక్షల కోట్లలో) | |
|---|---|
| బడ్జెట్ అంచనా: | రూ.2.27 |
| ఖర్చు చేసిన మొత్తం: | రూ.1.87 |
| లభించిన ఆదాయం: | రూ.1.10 |
| ఖర్చు, బడ్జెట్ అంచనాల మధ్య తేడా: | రూ.47,000 కోట్లు |

అమెరికా కేంద్ర జాతీయ ఆరోగ్య, మానవ సేవల ఇన్‌స్పెక్టర్ జనరల్ క్రిస్టి గ్రిమ్ తాజాగా ఒక నివేదిక విడుదల చేశారు. కరోనా వైరస్ అనుమానితులను పరీక్షించడానికి సాధనాలు తగినన్ని లేవని, చేసిన పరీక్షల ఫలితాల కోసం సుదీర్ఘంగా నిరీక్షించవలసి వస్తున్నదని, రోగుల, సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆస్పత్రులకు తగినంత సామర్థ్యం లేదని ఆమె ఆ నివేదికలో రాశారు. సోమవారం నాడు, విలేఖరుల సమావేశంలో అధ్యక్షుడు ట్రంప్‌ను ఆ నివేదిక విషయమై ఫాక్స్ న్యూస్ రిపోర్టర్ క్రిస్టిన్ ఫిషర్ అడిగారు. ఆయనకు బాగా కోపం వచ్చింది. ఆ అధికారిణి 1999 నుంచి అదే పదవిలో ఉంటున్నప్పటికీ, ఆమె ఒబామా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారని, అందుకే ఆ నివేదిక అట్లా ఇచ్చారని ఆరోపించారు. అక్కడితో ఊరుకోలేదు. "ఇదేమిటి ఇటువంటి పనికి మాలిన ప్రశ్న వేశావు, శెభాష్, బాగా చేశావ్ అని మెచ్చుకోవాలి కానీ" – అని ఆ మహిళా రిపోర్టర్‌ను గదమాయించారు ట్రంప్.

ఫాక్స్ రిపోర్టర్‌నే కాదు, ఎబిసి న్యూస్ రిపోర్టర్ జోనాథన్ కార్ల్‌తో కూడా ట్రంప్ అదే పద్ధతిలో వ్యవహరించారు. గ్రిమ్ నివేదిక గురించి అడగగానే, "నువ్వొక పనికిమాలిన రిపోర్టర్‌వి" అని ట్రంప్ గద్దించారు. "నువ్వొక చెత్త" కూడా దూషించారు. ఈ మాటలు, దూషణలు, వ్యాఖ్యలు మనకు చాలా చిరపరిచితంగా కనిపిస్తే ఆశ్చర్యం లేదు. ట్రంపులు ఇందుగలరందులేరని సందేహము వలదు. ట్రంపంతటి గొప్పవాడితో పోలిక వచ్చినందుకు సంతోషిస్తే చెప్పలేము కానీ, ప్రపంచమంతా ఏవగించుకునే అవలక్షణం అది.

అమెరికా లాంటి దేశం కూడా కరోనా విపత్తుకు కావలసినంత సన్నద్ధతలో లేదని అందరికీ తెలుసు. ఆ మాటకు వస్తే, ప్రపంచంలో ఏ దేశమూ కూడా ఇంత స్థాయి ఆపదకు సిద్ధంగా ఉండడం సాధ్యం కాదు. అందుకు ఎవరూ తప్పు పట్టరు. కానీ, ముప్పు ముంగిటికి వచ్చినా కూడా ఆదమరిచో, అహంకరించో నిర్లిప్తత వహిస్తేనే విమర్శకుల తప్పు పడతారు. మన దేశం కంటె ఎన్నో రెట్లు ఎక్కువ సన్నద్ధత ఉన్నప్పటికీ, అక్కడి వ్యాధి వేగానికి అది సరిపోవడం లేదు. మనదేశంలో కరోనా వ్యాప్తి సాపేక్షంగా నెమ్మదిగా ఉన్నది కాబట్టి, ఇంకా వేడి తెలియడం లేదు కానీ, కరోనా పరీక్షల దగ్గర నుంచి, వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించడం దాకా ఎన్నో కొరతలు ఉన్నాయి. వైద్యులు ధరించవలసిన రక్షణ కవచాల కొరత అందులో పెద్దది, కీలకమయినది. పడకలు, ఐసియూ సదుపాయాలు, వెంటిలేటర్ల వంటివి సరే. మాస్కుల దగ్గర నుంచి మొదలుపెట్టి, సమస్తమూ మన దేశంలో తగినన్ని అందుబాటులో లేవు. కరోనాపై యుద్ధంలో ముందుపీటీన నిలిచి

# శాపనార్థాలు

పోరాడే వైద్య, ఆరోగ్య సిబ్బందికి డాలూ కవచమూ ఇవ్వకుండా ఎట్లా? వైద్యుల సాహసత్యాగాలకు చప్పట్లు కొట్టి సరిపెట్టడం కాదు, ముందు పిపిఇలు (వైద్యుల రక్షణ వస్త్రాలు) సమకూర్చమని కొందరు వైద్యులు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

కరోనా పోరాట సామగ్రి తగినంతగా లేకపోవడానికి కేంద్రంలోను, రాష్ట్రంలోను ప్రస్తుతమున్న ప్రభుత్వాలు కారణం కాకపోవచ్చు. సాంప్రదాయికంగా, ఆరోగ్యానికి మనం కేటాయిస్తున్న బడ్జెట్‌లలోనే లోపమున్నది. ప్రజారోగ్యం కీలకరంగమన్న గుర్తింపు లోపించడంలోనే సమస్య ఉన్నది. అయితే, ప్రమాదం పొడసూపిన రెండు మూడు నెలల నుంచి, ప్రాధాన్యాల వారీగా తగిన సామగ్రిని సమకూర్చుకోవడం మాత్రం ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యతలో విఫలమయినప్పుడు, పౌరసమాజం, ముఖ్యంగా మీడియా ఎత్తిచూపుతుంది. అది బాధ్యత. అది విధి. కర్తవ్యం. లోపాన్ని చూపవద్దంటే ఎట్లా? చూపిస్తే కోపం వస్తే ఎట్లా? పనికిమాలిన రిపోర్టర్ అనీ, చెత్త ప్రశ్న అనీ నోరుపారేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడికి అయినా, తెలంగాణ ముఖ్యమంత్రికి అయినా ఏమి అధికారం ఉన్నది? నిన్ను తప్పు పట్టడానికి కాదు, నీకు సహకరించడానికే మీడియా సమాచారం ఇస్తుంది, సమాజ ప్రయోజనం ముఖ్యమైనప్పుడు నిన్ను తప్పు పట్టడానికి కూడా మీడియా ప్రయత్నిస్తుంది. కరోనా వంటి కల్లోలం కమ్ముకున్నప్పుడు, సమాజంలోని వివిధ శ్రేణులను కలుపుకుని పోయి, ఫలితాలను సాధించాలి కానీ, రెండు ప్రసంగాలకు ప్రజలు జేజేలు పలికారు కదా అని, ఇప్పుడు అధికప్రసంగానికి పాల్పడితే ఎట్లా? వైద్యులకు రక్షణ పరికరాలు లేవని, భద్రతా వాతావరణం లేదని ప్రభుత్వానికి గుర్తు చేస్తే, రాసినవాడికి కరోనా రావాలని పిల్లిశాపనార్థాలు పెడతారా? నాయకుడు మాట్లాడే పద్ధతేనా అది? అమెరికా నుంచి నేర్చుకోవలసినవి ఎన్నో ఉండగా, ట్రంపు నోటిదురుసు మాత్రమే మీకు ఆదర్శంగా కనిపించిందా? అతను కూడా కరోనా రావాలని శాపం వచ్చేదాకా వెళ్లలేదు!

మీడియా లేకపోతే, మీడియా ఆ సమాచారం ఇవ్వకపోతే, ప్రభుత్వాలను మేల్కొల్పేది ఎవరు? నీవే తప్ప ఇతః పరంబెరుగ– అని కేవలం ప్రభుత్వం మీదనే ఆధారపడి సర్వాన్నీ త్యజించడానికి ప్రజాస్వామిక సమాజం సిద్ధంగా ఉండదు కదా? పిపిఇల సమస్య కానీ, వైద్యులకు సానుకూల వాతావరణం కానీ, రాష్ట్రంలోను, కేంద్రంలోను, అంతర్జాతీయంగానూ కూడా ముఖ్య సమస్య. దీని గురించి కేంద్రానికి కూడా ఎందరో నిపుణులు గుర్తు చేయవలసి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం గవర్నర్‌కు సమర్పించిన నివేదికలో కూడా ఏ పరికరాలు, సామగ్రి ఎంత వరకు అందుబాటులో ఉన్నాయో చెప్పింది కదా, ఆ వివరాలకంటె భిన్నంగా ఉన్నాయా మీడియాలో వచ్చిన లెక్కలు? ఈ ఉపద్రవంలో మీడియా ఒక కీలకవ్యవస్థ. అది అర్థం కాకపోతే, పాలకులను ఎవరూ కాపాడలేరు. మీడియా ఒక అత్యవసర వ్యవస్థ. ప్రజలకు, వైద్యులకు, ఆరోగ్యసిబ్బందికి, పోలీసులకు, చివరకు ప్రభుత్వానికి అందరికీ ఇది అనుసంధానం కలిగిస్తుంది. ప్రభుత్వం చూడలేని వాటిని మీడియా చూస్తుంది, చూపిస్తుంది. అది ప్రజల కన్ను, ప్రజల అక్షరం. సమాజ ప్రయోజనాల కోసం ఈ తరుణంలో కొన్ని అంశాలలో ప్రభుత్వంతో కలసి నడుస్తుంది. అనేక అంశాలలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్నే నిలదీస్తుంది.

# మోదీ వెలిగించిన ఆశా దీపాలు

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

స్వాతంత్ర్య సమర కాలంలో మహాత్మా గాంధీ పిలుపు ఇస్తే కోట్లాది ప్రజలు పాటించేవారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా గాంధీ పిలుపును పాటించి లక్షలాది దేశ భక్తులు విదేశీ వస్త్ర దహనం చేశారు. స్వాతంత్ర్యానంతరం నాయకులు ఉపన్యాసాలు వెలువరించడం, సందేశాలు ఇవ్వడం మామూలైపోయింది. ఎన్నికల సమయాల్లో రాజకీయ పార్టీల నేతల సభలకు హాజరయ్యే లక్షలాది ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారని చెప్పడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు. ఎందుకంటే ఒక పార్టీ నిర్వహించిన బహిరంగ సభలకు భారీ ఎత్తున ప్రజలు హాజరైనప్పటికీ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అసలు టీవీల్లో, రేడియోల్లో నేతలు ఇచ్చిన సందేశాల్ని ప్రజలు వింటున్నారా అన్న అనుమానాలు కూడా అప్పుడప్పుడూ కలుగుతుంటాయి.

కానీ ఆశ్చర్యకరంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల రెండు సందర్భాలలో ఇచ్చిన పిలుపులను దేశ ప్రజలు చాలా సీరియస్‌గా తీసుకుని పాటించారు. మార్చి 23న 'జనతా కర్ఫ్యూ' సందర్భంగా మోదీ ఇచ్చిన పిలుపును పాటించి కోట్లాది మంది సాయంత్రం అయిదు గంటలకు రకరకాల కరతాళ ధ్వనులు చేశారు. మళ్లీ ఏప్రిల్ 5న ఆదివారం నాడు రాత్రి తొమ్మిది గంటలకు ప్రజలు గుర్తు పెట్టుకుని మరీ లైట్లు ఆర్పేసి దివ్వెలు వెలిగించారు. దేశ రాజధాని ఢిల్లీ లోనే కాదు, దేశంలో నలుమూలలనుంచి వచ్చిన సమాచారాన్ని బట్టి చూస్తే అసంఖ్యాక ప్రజలు దీపాలు వెలిగించినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక కమ్యూనిస్టు నాయకుడు కూడా దీపాలు వెలిగించి ఫోటోలు పంపితే సిరిసిల్లా నుంచి ఒక ప్రగతిశీల రచయిత ఫోన్‌లో మాట్లాడుతూ తమ చుట్టుప్రక్కల అంతా దీపాలు వెలిగించినట్లు తెలిపారు. 'ఇదేమిటి మీరు మోదీ పిలుపును పాటించారా..' అని ఆశ్చర్యం వ్యక్తం చేసినప్పుడు 'ఏం చేస్తాం. మా ఆవిడ, పిల్లలు నా సలహా ఏమైనా తీసుకుంటే కదా..' అన్నాడు. 'చప్పట్లు కొట్టమన్నప్పుడు వచ్చిన ప్రతిస్పందన దీపాలు వెలిగించమన్నప్పుడు రాకపోవచ్చని అనుకున్నాను కాని అంతకంటే ఎక్కువ ప్రతిస్పందన వచ్చింది' అని హైదరాబాద్ నుంచి ఒక సంపాదకుడితో మాట్లాడినప్పుడు చెప్పారు. ఢిల్లీలో రోడ్లు తుడిచే ఒక మహిళ కూడా పహార్‌గంజ్‌లో తమ బస్తీలో అంతా దీపాలు వెలిగించినట్లు చెప్పింది. 'ఎందుకోగాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఇటీవలి కాలంలో ఒక అనుబంధం ఏర్పడినట్లుంది..' అని ఆమె చెప్పడం గమనార్హం. కాని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఒక ఐఏఎస్ అధికారిని కదిపినప్పుడు 'ఇదేం తమాషా అండీ.. ఆర్థిక చర్యలను ప్రకటించాలికాని చప్పట్లుకొట్టమనడం, దీపాలు వెలిగించమనడం ఏమిటి..' అని అడిగారు. కాని ఈ దేశంలో మెజారిటీ ప్రజలు సదరు అధికారి మాటలతో ఏకీభవిస్తున్నట్లు కనపడడం లేదు.

ప్రస్తుత పరిస్థితిని స్వాతంత్ర్య సమయంలో ఉన్న పరిస్థితితో పోల్చడం లేదు కాని టీవీలో ప్రధానమంత్రి చెప్పినంత మాత్రాన ప్రజలు అంత సీరియస్‌గా తీసుకుంటారా? అని ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇవాళ మన దేశంలో దాదాపు 20 కోట్ల టీవీ సెట్లు ఉన్నాయని, 80 కోట్ల మొబైల్స్ ఉన్నాయని అంచనా. అందులో దాదాపు 40 కోట్లు ముఖేశ్ అంబానీ ప్రవేశపెట్టిన జియో ఫోన్లే ఉన్నాయని గణాంక వివరాలు చెబుతున్నాయి. మరి మోదీ ఇచ్చిన సందేశం ఏదో రకంగా ప్రజలకు చేరితే ఆశ్చర్యం ఏమున్నది? చేరితే చేరనీ.. ప్రజలు దాన్ని ఎందుకు గౌరవించాలి? అంటే కరోనా వైరస్ సంక్షోభ సమయంలో ప్రజలు మోదీతో అనుబంధం ఏర్పర్చుకుని ఆయన పిలుపును గౌరవిస్తున్నారన్నమాట. ప్రజలతో కనెక్టు కావడం అంటే ఇదే. బహుశా ఈ కనెక్టు కాగలిగిన శక్తి వల్లే గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్రమోదీ భారతీయ జనతా పార్టీకి అఖండ విజయం సాధించిపెట్టగలిగారు.

నరేంద్ర మోదీని అడగడానికి చాలా ప్రశ్నలు ఉండవచ్చు. ప్రధానంగా ఆర్థిక వ్యవస్థ క్షీణించడాన్ని అనేకమంది ఆర్థిక వేత్తలు వేలెత్తి చూపుతున్నారు. ఆయన తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీని ప్రవేశపెట్టడం మొదలైన నిర్ణయాలు అంత సానుకూల ఫలితాలు సాధించలేదని విమర్శలు కూడా వచ్చాయి. మోదీ హామీ ఇచ్చిన విధంగా ఉపాధి కల్పన జరగలేదని, పేదరికాన్ని రూపుమాపలేదని, రైతులకు గిట్టుబాటు ధర లభించలేదని, విద్యా, వైద్య రంగాలపై ఆయన చూపాల్సినంత శ్రద్ధ చూపలేదని, రాష్ట్రాల పట్ల ఆయన సమతుల్య వైఖరిని ప్రదర్శించలేదని ఇత్యాది విమర్శలు లేకపోలేదు. పర్యవసానాలు ఆలోచించకుండా మోదీ నిర్ణయాలు తీసుకుంటారని కూడా చాలా సందర్భాల్లో స్పష్టమయింది. తాజాగా లాక్‌డౌన్ తర్వాత లక్షలాది వలస కూలీలు దుర్భరమైన ఇక్కట్ల పాలు కావడం అందరికీ తెలిసిందే. ఇవి కాక వ్యవస్థలను ఆయన గుప్పిట్లో పెట్టుకున్నారని, కేంద్రంలో అధికారం పూర్తిగా మోదీ చుట్టే కేంద్రీకృతమైందని విమర్శలు చేసే వారు ఉన్నారు.




> మోదీ పాలనలో ఎన్ని తప్పులు జరుగుతున్నా, ప్రతిపక్షాల్లో తాము అనుసరించగలిగిన నేతలు లేరని ప్రజలు భావిస్తున్నందువల్లనే వారు మోదీతో కనెక్టు కాగలుగుతున్నారు. ప్రధానమంత్రిపై విమర్శలు చేసే వారికి విశ్వసనీయత లేదని జనం భావిస్తున్నట్టుంది. మోదీ పట్ల వ్యతిరేకత ఏర్పర్చగలిగినంత స్థాయిలో ప్రజలతో కనెక్టు కాగలిన నాయకులు ప్రతిపక్ష శిబిరంలో ఆవిర్భవించేవరకూ లేదా మోదీనీ ఆయన మాయాజాలాన్నీ ఇక భరించలేమని ఓటర్లు అనుకునేంతవరకూ ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మార్పు వచ్చే అవకాశం లేదు.

కానీ ఇవాళ ప్రజలు ఈ ప్రశ్నలు అడగడానికి సిద్ధ పడడం లేదు. ఫేస్‌బుక్‌లోనూ, ఇతరత్రా సోషల్ మీడియాలోనూ, పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలను ఈ విషయంపై చైతన్యపరిచేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. కాని నిశితంగా పరిశీలిస్తే ఈ ప్రయత్నాలన్నీ అంతగా సఫలీకృతమైనట్లు కనపడడం లేదు. మరో వైపు మోదీ, ఆయన అనుయాయులు చేసే ప్రకటనలను, సోషల్ మీడియాలో వారి ప్రచారాన్ని అనుసరించేవారు వేలాది మంది కనపడుతున్నారు. దీనికి కారణం ఏమిటి?

ప్రధాన కారణం మోదీని విమర్శించేవారు ప్రజలతో కనెక్టు కాలేకపోవడమే అని వేరే చెప్పనక్కర్లేదు. మోదీ హయాంలో ఎన్ని తప్పులు జరిగినా ప్రతిపక్షాల్లోను, విమర్శకుల్లోనూ తాము గౌరవించేవారు, అనుసరించగలిగిన వారు లేరని ప్రజలు భావిస్తున్నందువల్లనే వారు మోదీతో కనెక్టు కాగలుగుతున్నారని అనుకోక తప్పదు. మోదీ పట్ల వారు చేసే విమర్శలు సరైనవే కావచ్చు కాని విమర్శలు చేసే వారికి తాము నమ్మదగిన విశ్వసనీయత లేదని జనం భావించవచ్చు. మోదీతో పోలిస్తే చాలా మంది ప్రతిపక్ష నాయకులు వారికి అంగుష్ట మాత్రుల్లాగా కనిపిస్తున్నారని కూడా అనుకోవచ్చు. అందువల్ల మోదీ పట్ల వ్యతిరేకత ఏర్పర్చగలిగినంత స్థాయిలో ప్రజలకు కనెక్టు కాగలిన నాయకులు ప్రతిపక్ష శిబిరంలో ఆవిర్భవించేవరకూ, లేదా మోదీని, ఆయన మాయాజాలాన్ని ఇక భరించలేమని ప్రజలు అనుకునేంతవరకూ ప్రస్తుత వాతావరణంలో మార్పు వచ్చేందుకు అవకాశం లేదు.

ప్రస్తుత కరోనా వైరస్ సంక్షోభ సమయంలో దేశ ప్రజలకు మోదీ మరింత కనెక్టు కావడానికి అనేక కారణాలున్నాయి. ఒకటి మోదీకి సంక్షోభ సమయాన్ని అవకాశంగా మార్చుకోగలిగిన శక్తి ఉన్నది. వైరస్ ముదిరిపోతున్నదని కొద్దిగా ఆలస్యంగా గ్రహించినప్పటికీ ఆయన కొద్ది రోజుల్లోనే పరిస్థితి తన గుప్పిట్లోకి తీసుకురాగలిగారు. ఇది మొత్తం ప్రపంచవ్యాప్త సమస్య కాబట్టి భారత దేశంలో పరిస్థితిని అదుపులోకి తీసుకుని రాష్ట్రాలకు మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత ఆయనపై పడింది. రాజ్యాంగం ప్రకారం భారత దేశం రాష్ట్రాల సమితి మాత్రమే కాని సమాఖ్య కాదు. రాజ్యాంగంలో ఫెడరేషన్ అన్న మాటే లేదు. రాష్ట్రాలకు సంబంధించిన అనేక నిర్ణయాలు కేంద్రం గుప్పిట్లో ఉంటాయి. కాని నరేంద్ర మోదీ ఎటువంటి విశేష అధికారాలను ప్రయోగించకుండానే రాష్ట్రాలను విశ్వాసం లోకి తీసుకుని కరోనా వైరస్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. 1897 నాటి అంటువ్యాధుల చట్టం, ఎన్డీఎంఏ చట్టం ఈ రెండు చట్టాల ద్వారా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించాలని మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇది కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన సమస్య కనుక రాష్ట్రాలు కూడా వెంటనే సానుకూలంగా స్పందించవలసి వచ్చింది. ఇది ప్రభుత్వాల ద్వారా ఎదుర్కోవాల్సిన సమస్య కనుక ప్రజల కళ్ల ముందు ప్రభుత్వాలు ప్రత్యక్షంగా పనిచేస్తున్నట్లు కనపడాల్సిన అవసరం కూడా ఏర్పడింది. ప్రభుత్వమే సర్వంతర్యామి అయినందువల్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా 'ప్రభుత్వ వివేకానికి అదనపు వివేకాన్ని ఏ రకంగా జోడించగలం?' అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర స్థాయిలో నరేంద్రమోదీ, రాష్ట్ర స్థాయిలో వివిధ ముఖ్యమంత్రులు తమ సమర్థతతో పాటు తమ ఉనికిని నిరూపించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ముఖ్యమంత్రుల్లో కూడా జనంతో కనెక్టు కాగలిగిన కేసీఆర్ లాంటి నేతలు తక్కువే కావడం వల్ల దేశవ్యాప్తంగా మోదీ విశ్వరూపమే అధికంగా కనిపిస్తోంది. మన దేశంలో పరోక్షంగా అధ్యక్ష పాలన అమలులో ఉన్నదా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. మోదీతో కనెక్ట్ అయితే జనంతో కూడా కనెక్ట్ కాగలమని నేతలు గ్రహించే పరిస్థితి ఏర్పడుతోంది.

విచిత్రమేమంటే తబ్లిగీ సంఘటన తర్వాత మోదీ పట్ల జనానికి ఆదరణ మరింత పెరిగింది. కారణం ఈ సంఘటన మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని మెజారిటీ ప్రజలు నమ్మేందుకు ఆస్కారం కలిగించడం. ఆ అవిశ్వాస అగ్నికి ఆజ్యం పోసేందుకు జరిగే ప్రయత్నాలు ఎలాగూ జరుగుతాయి. ఈ సంఘటన తర్వాత భారత దేశమంతా దీపాలు వెలిగించాలని మోదీ ప్రజలకు పిలుపు ఇవ్వడం అనాలోచితంగా జరిగింది కాదు. భారత దేశంలోని మెజారిటీ ప్రజల జీవితాల్లో దీపాలకున్న ప్రాధాన్యత, పవిత్రత ఆయనకు తెలియనిది కాదు. సరే, ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలను మోదీ ఎప్పుడు ఫలింపజేస్తారని అడిగేవారు ఎప్పుడూ ఉంటారు.

*(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)*

గల్ఫ్ లేఖ

# కరోనా — తబ్లీఘ్

సౌదీ అరేబియాలోని మక్కాలో ఇస్లాం ఆవిర్భవించింది. విశ్వవ్యాప్తంగా ఈ మతాన్ని అనుసరించేవారిని భారత దేశం అనేక విధాలుగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహమేమీ లేదు. ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో కేంద్రీకృతమైన తబ్లీఘ్ జమాత్ అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా సుప్రసిద్ధమైనది. ఇంచుమించు 120 దేశాలలోని ముస్లింల ఆధ్యాత్మిక, ధార్మిక విధానాలపై బలమైన పట్టు ఈ ఇస్లామిక్ సంస్థకు ఉన్నది. ఏ విధమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలతోనూ తబ్లీఘ్ ప్రమేయం పెట్టుకోదు. కేవలం ధార్మిక చింతనా నిబద్ధతను మాత్రమే బోధించే విభిన్నమైన, విలక్షణమైన సంస్థ తబ్లీఘ్ జమాత్. ఈ ఇస్లామిక్ సంస్థ ఇప్పుడు అనూహ్యంగా, భారతదేశంలో కరోనా వైరస్ వ్యాప్తిలో ప్రధాన పాత్ర పోషించిందనే విమర్శలను ఎదుర్కొంటున్నది.

తబ్లీఘ్ జమాత్ అనుయాయులు కనీసం వార్తా పత్రికలను సైతం చదవరు. దీన్ని బట్టి వారికి బాహ్య ప్రపంచంతో ఉన్న సంబంధాలను ఊహించుకోవచ్చు. వార్షిక పరీక్షా ఫలితాల కొరకు ఎదురు చూసే బాలల మొదలు ఉద్యోగ విరమణతో విశ్రాంత జీవితంలోకి ప్రవేశించిన వారు, ప్రవాసంలో తీరిక లేకుండా గడిపే ముస్లింల దాకా అందరూ దైవ మార్గంలో నడవడానికి ఈ సంస్థ మార్గదర్శకత్వం వహిస్తుంది. విశ్వాసులను బృందాలుగా తీసుకెళ్ళి నమాజు విధానంలో వారికి లోతైన శిక్షణ ఇస్తుంది.

మర్కజ్ అంటే కేంద్రం, ప్రధాన కార్యాలయం. తెలంగాణలో ఇప్పటికీ అనేక ప్రభుత్వ పాఠశాలలను మర్కజీ పాఠశాలలుగా పిలుస్తారు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ హన్మకొండలోని మర్కజీ పాఠశాలలో చదివారు. 'అమీర్' అంటే అరబ్బి భాషలో 'నాయకుడు' అని అర్థం, అందుకే కువైత్, ఖతర్ రాజులను అమీర్ అని సంబోధిస్తారు. అదే విధంగా తబ్లీఘ్ సంస్థ అధినేతను కూడా అమీర్ అని అంటారు. దక్షిణాసియాతో పాటు బ్రిటన్‌లో ఈ సంస్థ పటిష్ఠంగా వేళ్ళూనుకునివున్నది. ఢిల్లీ మహానగరం తబ్లీఘ్‌కు ప్రధాన కేంద్రం. ఈ సంస్థపై నిఘా సంస్థలు నిరంతరం కన్నేసి ఉంచడం కద్దు. ఏటా 40 రోజుల పాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆధ్యాత్మిక ధర్మ ప్రబోధానికి నిర్వహించే పర్యటన ఈ సంస్థ ముఖ్య కార్యక్రమం. దీన్ని 'ఛిల్లా' అంటారు. ఛిల్లా అనేది చాలీసా (40 శ్లోకాల హనుమంతుడి పారాయణానికి కూడా చాలీసా అని పేరు). ఈ ఆధ్యాత్మిక పర్యటనా కార్యక్రమానికి ఒక సంవత్సరం ముందు నుంచీ ప్రణాళికను రూపొందిస్తారు. అందులో కొందరికి మర్కజ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. మరికొందరు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ పర్యటనలలో భాగంగా అక్కడక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సమ్మేళనాలు (ఇజ్తెమా) జరుగుతాయి. జాతీయ స్థాయిలో ఎక్కువగా ఢిల్లీ, భోపాల్ నగరాలలో జరిగే ఇజ్తెమాలలో క్రియాశీలక కార్యకర్తలు పాల్గొంటారు.



> న్యూఢిల్లీలో మార్చి 13–15 తేదీల్లో తబ్లీఘ్ జమాత్ నిర్వహించిన మత సమ్మేళనంలో పాల్గొన్న అనేక మందికి కరోనా వైరస్ సంక్రమించడంతో పెద్ద ఎత్తున దుమారం రేగుతున్నది. తమ సంస్థపై వెల్లువెత్తుతున్న విమర్శలకు వ్యతిరేకంగా తబ్లీఘ్ ప్రతినిధులు చేస్తున్న వాదనలో హేతుబద్ధత ఉన్నా నైతిక, సామాజిక బాధ్యత లేదు. అంతకు ముందు మలేషియాలో జరిగిన ఇజ్తెమాలో పాల్గొన్న కొందరికి కరోనా సోకినట్లుగా తెలిసినా భారత్‌లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో తబ్లీఘ్ విఫలమైంది.

ఈ విధంగా, మార్చి 13–15 తేదీలలో జరిగిన ఇజ్తెమాలలో పాల్గొన్న అనేక మందికి కరోనా వైరస్ సంక్రమించడం దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్నది. చట్టపరంగా పరిశీలిస్తే, ఢిల్లీ సర్కారు నిషేధం విధించిన 16వ తేదీకి పూర్వమే తమ ఇజ్తెమా జరిగిందని, తమ వద్ద ఉన్న సందర్శకుల సంఖ్య, ఇతర వివరాల గురించి ఢిల్లీ పోలీసులకు తెలియజేశామని, వారిని వారి స్వస్థలాలకు పంపించివేసేందుకుగాను ప్రత్యేక బస్సుల ఏర్పాటునకు అనుమతి కోరినా పట్టించుకోలేదని తబ్లీఘ్ జమాత్ ప్రతినిధులు అంటున్నారు. వారి వాదనలో హేతుబద్ధత ఉన్నా నైతిక, సామాజిక బాధ్యత లేదు. అంతకు ముందు మలేషియాలో జరిగిన ఇజ్తెమాలో పాల్గొన్న కొందరికి కరోనా సోకినట్లుగా తెలిసినా భారత్‌లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో తబ్లీఘ్ విఫలమైంది. విదేశీయుల రాక గూర్చి పూర్తి సమాచారం ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత వైఖరి అవలంబించింది. ఇదే సమయంలో కరోనా వైరస్ ముప్పును కేంద్రం తీవ్రంగా పరిగణించలేదు, తత్కారణంగానే మార్చి నెల నడిమినాళ్ళ దాకా కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగలేదు. ఇండోనేషియా ఇజ్తెమాలో పాల్గొని తిరిగి వచ్చిన తబ్లీఘ్ జమాత్ సభ్యులకు కరీంనగర్‌లో నిర్వహించిన వైద్య పరీక్షలలో కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. తెలంగాణ సర్కార్ సమాచారం అందించే వరకు కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయం తెలియదు. చైనా, ఇరాన్ నుంచి వచ్చే ప్రయాణీకులను పరీక్షించిన భారతదేశం అదే ఇరాన్ పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల నుండి వచ్చే ప్రయాణీకులను, దుబాయి–బెంగుళూరు–హైదరాబాద్ కేసు వెలుగులోకి వచ్చే వరకు పరీక్షించడం ప్రారంభించలేదు!

కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో భారతదేశంతో పోల్చితే గల్ఫ్ దేశాలు వెనుకబడ్డాయని చెప్పవచ్చు. భారత్, మిగిలిన గల్ఫ్ దేశాలు అమలుపరచడం ప్రారంభించిన తర్వాతనే లాక్‌డౌన్‌ను దుబాయి ప్రకటించింది. సౌదీ అరేబియాలో కరోనా మహమ్మారి బాధితుల సంఖ్య మిగతా గల్ఫ్ దేశాలలో కంటే చాలా అధికంగా ఉన్నది. అసలు భారత దేశంలో తొలి కరోనా మృతి కూడ మక్కా నుండి తిరిగి వెళ్ళిన 76 ఏళ్ళ కర్ణాటక యాత్రికుడిది కావడం గమనార్హం. కువైత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో ఉన్న కరోనా రోగులలో భారతీయుల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నది. కార్మిక ఆవాసాలలోని ఇరుకయిన గదులలో ఎక్కువ మంది నివసిస్తుండడంతో ఈ మహమ్మారి శరవేగంగా సంక్రమిస్తుండడం ఎంతైనా ఆందోళన కలిగిస్తోంది. చట్టవిరుద్ధంగా ఉంటున్న భారతీయులను తీసుకెళ్ళండంటూ కువైత్ ఒత్తిడి చేస్తుండడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కువైత్ అమీర్‌తో మాట్లాడారు.

దాదాపు అన్ని గల్ఫ్ దేశాలలోను వివిధ సాంకేతిక కారణాలవల్ల జైళ్ళలో మగ్గుతున్న ఖైదీలను విడుదల చేశారు. అలాగే వీసాల రెన్యువల్ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తామని ఈ దేశాలు ప్రకటించాయి. ప్రైవేట్ రంగం కుదేలయిపోయింది. చమురు ధరల పతనమవుతున్న నేపథ్యంలో గల్ఫ్‌లో కరోనా వైరస్ సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు.

❑ మొహమ్మద్ ఇర్ఫాన్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

జనవాక్యం

## జర్మనీ, కొరియా వ్యూహం మేలు

కరోనా పోరాటంలో ముందుచూపుతో వ్యవహరించాలి. అనుమానితులనందరినీ పరీక్షించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడటం, ప్రాణ గండం నుంచి మిగతా వారిని రక్షించడం అవసరం. ఈ విషయంలో జర్మనీ, దక్షిణ కొరియా వ్యూహాలను అనుసరించాలి. మలమూత్రాలపై వాలే ఈగల ద్వారా కూడా వైరస్ వ్యాపించే ప్రమాదముందని అంటున్నారు. అదే నిజమైతే వర్షాకాలంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయి. మురుగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల పైన జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ మల మూత్ర విసర్జనలను పూర్తిగా నిషేధించాలి.

– జక్కుల వరప్రసాద రావు

## ఆరో వేలు అవసరమా?

రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ అనుకున్న లక్ష్యాలను సాధించకపోగా అనవసర వివాదాలకు, సమస్యలకు కేంద్ర బిందువు అయ్యింది. ఇప్పుడు ఈ వలంటీర్లు అందిస్తున్న సేవలు కూడ నామ మాత్రమే! ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదు. సిబ్బందికి వేతనాలు చెల్లించటమే చాలా కష్టంగా ఉంది. ఆదాయం పూర్తిగా పడిపోయింది. అప్పు కూడా దొరకని పరిస్థితి. ఇప్పుడు అనవసరపు ఖర్చులను తగ్గించుకోవటం తప్పనిసరి. ఈ నేపథ్యంలో వలంటీర్ వ్యవస్థను పూర్తిగా రద్దుచేయటం సముచితంగా ఉంటుంది. పౌర సేవలకు గ్రామ సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తరువాత ఈ వలంటీర్లతో రాజకీయపరమైన చిక్కులు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యమంత్రి ఇక ఎటువంటి భేషజాలకు పోకుండా ఇలాంటి ఆరో వేలు వ్యవస్థలకు తెర దించటం శ్రేయస్కరం!

– గరిమెళ్ళ రామకృష్ణ

# అలసత్వంతో పెరిగిన ఉపద్రవం

వూహాన్‌లో 2019 డిసెంబర్‌లో పుట్టిన కరోనా మహమ్మారి ప్రపంచమంతా విస్తరిస్తూ 13 లక్షల మందికి పైగా సోకి, 75 వేల మందిని పొట్టన బెట్టుకుంది. సాంకేతిక, విజ్ఞాన రంగాల్లో అభివృద్ధి సాధించాయి అని చెప్పుకునే చైనా, అమెరికా, స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, ఇంగాండు వంటి దేశాలే వైరస్ మహమ్మారిని కట్టిడి చేయలేకపోతున్నాయి. నూటికి 40శాతం మంది ప్రజలు పేదరికంతో బాధపడుతూ వైద్య సౌకర్యాల లభ్యత పరిమితంగా వున్న మన దేశంలో కరోనా వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టలేకపోతే సంభవించగల నష్టం ఊహాతీతం. ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను విశ్లేషించుకొని కొవిడ్ 19ను మన దేశం నుంచి తరిమి వెయ్యటానికి తీసుకోవలసిన చర్యల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పౌర సమాజం, పౌరులు సమష్టిగా ఆలోచించవలసి వున్నది. వూహాన్‌లో చదువుకుంటూ కేరళకు జనవరి 31న వచ్చిన విద్యార్థి కరోనా పాజిటివ్‌గా దేశంలో నమోదైన తొలి కేసు. తరువాత క్రమంగా వివిధ రాష్ట్రాలలో కరోనా ప్రభావితులు పెరుగుతూండడంతో ప్రభుత్వం స్పందించింది. దాని వ్యాప్తి నివారణ కోసం పౌరులు పాటించవలసిన మార్గదర్శకాలు ప్రకటించింది. వైరస్ ప్రభావిత దేశాల నుంచి తిరిగి వచ్చిన భారతీయులు, లేక విదేశీయులకు విమానాశ్రయాల్లోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అనుమానిత కేసుల విషయంలో హోం క్వారంటైన్, ఐసోలేషన్‌లో పెట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. వ్యాప్తి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 4న ప్రకటించారు. నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రంకూడా వివిధ చర్యలను ప్రకటిస్తూ వచ్చాయి. ఎన్నో దేశాలు అనుసరిస్తున్నట్లే మన దేశంలోనూ లాక్‌డౌన్ అవసరమని మన ప్రధాని కూడా భావించారు. మార్చి 22న జనతా కర్ఫ్యూ కోసం ఇచ్చిన పిలుపు జయప్రదమైంది. దానితో మార్చి 25 నుంచి ఈనెల 14 వరకు దేశమంతటా లాక్‌డౌన్‌ను ప్రకటించారు. వ్యవసాయ పనుల నిర్వహణకు, ఉత్పత్తుల మార్కెటింగుకు ఆటంకం కలుగకుండా చూడాలని, రైతులకు ఉపయోగపడే నిర్ణయాలతోపాటు పేదలకు, కార్మికులకు, వలస కూలీలకు మేలు చేకూర్చే మరికొన్ని పథకాలను అమలు చేయడానికి పీఎం కళ్యాణయోజన పేరుతో 1.70 లక్షల కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది.

కేంద్రంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా వైద్య–ఆరోగ్య సిబ్బంది, పోలీసు యంత్రాంగం, పారిశుధ్య సిబ్బందితో పాటు మీడియా సంస్థలు, సోషల్ మీడియా ద్వారా వైరస్ నివారణకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూండడంతో అనుమానితుల సంఖ్య క్రమేపీ తగ్గుతూ ఉన్న పరిస్థితులలో ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కాజ్ వద్ద తబ్లిగి జమాత్ మార్చి 13 నుంచి 15 వరకు నిర్వహించిన మత సమ్మేళనం వలన కరోనా బారిన పడిన బాధితుల సంఖ్య అత్యంత వేగంగా పెరిగిపోతూ ప్రభుత్వాలకు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 50మందికి మించి ఎక్కడా ప్రజలు గుమిగూడవద్దని మార్చి 13 నుంచి ఆంక్షలు ఉన్నప్పటికీ తబ్లిగి జమాత్ సంస్థ దాదాపు రెండు వేల మందికి పైగా దేశ, విదేశీయులతో మార్చి 13 నుంచి 15 వరకు మత సమ్మేళనం నిర్వహించటం అత్యంత బాధ్యతా రాహిత్యం. అంతకు ముందు 26 ఫిబ్రవరి నుంచి 28 ఫిబ్రవరి వరకు మలేసియా రాజధాని కౌలాలంపూర్లో వేలాది మందితో జరిగిన తబ్లిగి జమాత్ మత సమ్మేళనంలో పాల్గొన్న వారిలో వందలాది మంది కరోనా పాజిటివ్ బాధితులుగా వారి నుంచి ఇంకా వేలాది మందికి మలేసియా దేశస్థులకే కాక, ఇండోనేషియా, ఇరాన్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు కూడా వైరస్ వ్యాపించిందని తేలింది. అందువల్లనే ఇండోనేషియాలో నిర్వహించనున్న తబ్లిగి సమావేశాన్ని నిషేధించింది.

ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం ఉన్నప్పటికీ పోలీసు డిపార్ట్ మెంట్ పైన నియంత్రణాధికారం కేంద్ర హోంశాఖ ఆధీనంలోనే ఉంటుంది. నిజాముద్దీన్‌లో పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న తబ్లిగి అంతర్జాతీయ సంస్థలో మత సమావేశాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం, కేంద్ర హోం శాఖ అడ్డుకొని నిరోధించినట్లయితే వేలాది మంది ఈ మహమ్మారి బారిన పడే ప్రమాదం, నేటి విపత్కర పరిస్థితి తప్పేది. మార్చి మొదటి వారం నుంచి వందలాది మంది ముస్లిం ప్రచారకులు టూరిస్ట్ వీసాలతో మన దేశంలోకి ప్రవేశించి ఢిల్లీలో మత సమ్మేళనానికి హాజరు కావటం, అనేక రాష్ట్రాలకు వెళ్లి మత ప్రచారం చేయటం చట్ట విరుద్ధం. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ మత సంస్థ నిర్వాహకుడు సాద్‌పైన, చట్టాన్ని అతిక్రమించిన విదేశీయులపై తగు చర్యలు తీసుకోవాలి.

మలేసియాలో తబ్లిగి జమాత్ సమ్మేళనం వలన పలు దేశాలకు చెందిన వేలాది మంది కోవిడ్ 19కు గురయ్యారని, ఇండోనేషియా, బంగ్లాదేశ్‌ల్లో కరోనా వ్యాప్తి నిరోధానికి ఆయా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల గురించి హోం శాఖ ఆధ్వర్యంలోని ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ ప్రధానికి, హోం మంత్రికి సరైన సమాచారం ఇచ్చి, ఈ మత సమ్మేళనం గురించి, దాని నిలుపుదల ఆవశ్యకత గురించి తెలియపరచక పోవడం ఎంత మాత్రమూ క్షంతవ్యం కాదు. ఇందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహించవలసి ఉంటుంది. చైనా, హాంకాంగ్‌లనుంచి వచ్చిన ప్రయాణీకులను మాత్రమే జనవరి 17నుండి థర్మల్ స్క్రీనింగ్ చేశారు. మిగతా అన్ని దేశాల వారికీ దీనిని అమలు చేసి ఐసోలేషన్ లేదా క్వారంటైన్‌కు పంపడం మార్చి 3నుంచే ఆరంభమైంది. ఈ మధ్య కాలంలో వేలాదిమంది మన దేశానికి వచ్చారు. వీరిలో కొందరి ద్వారా కరోనా నెమ్మదిగా దేశంలో వ్యాపించింది.

> 'లాక్‌డౌన్' సందర్భంగా వ్యవసాయ పనుల కొనసాగింపు, పంట ఉత్పత్తుల అమ్మకాలు, వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగానికి మినహాయింపు ఇవ్వటం అభినందనీయం. అయితే, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల మధ్యన సరైన సమన్వయం లోపించడం వల్ల అమ్మకాలు, సక్రమంగా ముందుకు సాగడం లేదు.

కరోనాపై పోరాటానికి అవసరమైన పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్; వెంటిలేటర్లు; అదనపు ప్రయోగ శాలలు; వైద్య, మున్సిపల్, పోలీస్, పారిశుద్ధ్య సిబ్బంది రక్షణ కోసం వినియోగించే వస్తువులకు రాష్ట్ర ప్రకృతి విపత్తు ఉపశమన నిధిలో 10 శాతం మించకుండా ఖర్చు చేయాలని



నిబంధన విధించడం సరికాదు. కేవలం నమూనాల సేకరణ, తనిఖీలు, స్క్రీనింగుల కొరకు మాత్రమే జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను వెచ్చించవచ్చని కేంద్రం తెలియపర్చింది. ఇదీ సరికాదు. డీఆర్‌డీవోతో మరికొన్ని సంస్థలు తక్కువ వ్యయంతో టెస్టింగ్ కిట్లు, లేబరేటరీలు, వెంటిలేటర్లు, పీపీఈలను తయారు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చెయ్యటం ఎంతైనా అభినందనీయం. 'ప్రధాన మంత్రి విపత్కర నిధి'కి సామాజిక సేవా భావంతో పారిశ్రామిక, వ్యాపార వర్గాలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు అనేక సంస్థలు భారీగా అందజేస్తున్న నిధులను ఉపయోగించి పెద్దఎత్తున పైన పేర్కొన్న పరికరాలను వెంటనే రాష్ట్రాలకు అందజేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. 'లాక్‌డౌన్' సందర్భంగా క్షేత్ర స్థాయి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సూచనలను అనుసరించి వ్యవసాయ పనుల కొనసాగింపు, పంట ఉత్పత్తుల అమ్మకాలు, వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగానికి మినహాయింపు ఇవ్వటం అభినందనీయం. అయితే, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ–మార్కెటింగ్ శాఖల మధ్యన సరైన సమన్వయం లోపించడం వల్ల అమ్మకాలు, సక్రమంగా ముందుకు సాగడం లేదు. కర్నూలు మార్కెటింగ్ యార్డు మూసివేస్తే ఉల్లి రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలి? రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉన్నది. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పోలీస్, పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న నిరుపమాన సేవలకు ప్రజలందరూ రుణపడి ఉన్నారు.

■ వడ్డే శోభనాద్రీశ్వరరావు



స్ఫూర్తి

# ఒక ట్వీట్‌తో ఆమె ప్రయత్నం నెరవేరింది!

ఆమె ఐఐటీ గ్రాడ్యుయేట్... బ్యాంకింగ్ రంగంలో మంచి ఉద్యోగాన్ని వదులుకుని, వ్యాపారవేత్తగా ఎదగాలనుకుంది. 'సరళ్ డిజైన్స్' పేరిట స్టార్టప్‌ను ప్రారంభించి శానిటరీ న్యాప్‌కిన్స్ తయారుచేసింది. 'కొవిడ్-19' విస్తరిస్తున్న ఈ సమయంలో న్యాప్‌కిన్స్ ఉత్పత్తి చేసే మిషన్‌ను 'త్రీ ప్లై మాస్క్'ల తయారీకి అనుగుణంగా మార్చేసింది. అయితే ఈలోపు అనుకోని అవాంతరాలు ఎదురయ్యాయి. ఆమె సమస్యల ట్వీట్ ఎట్టకేలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు చేరింది. ఇంకేం... కథ సుఖాంతమైంది. 'హీరోస్ కంటిన్యూస్ టు రైజ్...' అంటూ ఆయన చేసిన ఒక ట్వీట్‌తో ముంబయికి చెందిన సుహానీ మోహన్ ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తిగా మారింది. ఇంతకీ ఎవరీ సుహానీ?

సుహానీ మోహన్ (29) ఐఐటీ గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఒక అంతర్జాతీయ బ్యాంకులో కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. ఆ తర్వాత వ్యాపారవేత్తగా ఎదగాలని అనుకుంటున్న సమయంలో ఆమె ఐఐటీ మిత్రుడు కార్తీక్ మెహతా చేసిన సూచన మేరకు ఉద్యోగం మానేసి, శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ రంగంలోకి ప్రవేశించారు. ఆలోచనను ఆచరణలోకి పెట్టేముందు చాలా పరిశోధనలు చేశారు. 'సరళ్ డిజైన్స్' అనే సంస్థను ఏర్పాటు చేసి ఇద్దరూ వ్యవస్థాపకులుగా ఉన్నారు. ఈ క్రమంలో భారతదేశంలోనే తొలిసారిగా శానిటరీ ప్యాడ్స్ తయారు చేసే డీసెంట్రలైజ్డ్ ఆటోమేటిక్ మెషీన్‌ను రూపొందించారు. ఈ మిషన్లను 30కి పైగా వ్యాపారులకు, ఎన్జీవో సంస్థలకు అమ్మడంతో చిన్న చిన్న పట్టణాల్లో సైతం శానిటరీ ప్యాడ్స్ తయారీ సులువైంది. ఆ విధంగా ఈ యంత్రాలపై రెండు లక్షలమంది మహిళలకు పైగా ఉపాధి లభించింది.





ఐదేళ్లలో వారు సుమారు 70లక్షల ప్యాడ్స్‌ను తయారుచేశారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వంతో పాటు అనేక సంస్థలు వీరి కృషిని గుర్తించి ప్రశంసించాయి.

**ఏ సీక్వెల్ టు ది 'ప్యాడ్‌మ్యాన్'...**

కరోనా మనదేశంలో అడుగుపెట్టగానే సుహానీ అప్రమత్తమయ్యారు. ప్రస్తుత సమయంలో మాస్కులు చాలా అవసరమని గుర్తించారు. ప్యాడ్స్ తయారుచేసే మిషన్లనే '3 ప్లై మాస్క్'ల తయారీకి అనుగుణంగా మార్చేలా పథకరచన చేశారు. "మార్చి 15వ తేదీకే మా డిజైన్లు పూర్తయ్యాయి. అయితే లాక్‌డౌన్ కారణంగా ఉత్పత్తికి అనుకోని అవాంతరం ఏర్పడింది. నాకు తెలసిన ఎంతోమందిని ట్విట్టర్‌లో సంప్రదిస్తూనే ఉన్నా సాయం చేయమని. వారిలో ఐఐటీలో నా జూనియర్ అయిన శృతీ అగర్వాల్ కూడా ఉన్నారు. ఆమె ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర వద్ద ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దాంతో నా విన్నపం ఆయనకు చేరింది" అన్నారు సుహాని.

విషయం తెలిసిన వెంటనే ఆనంద్ మహీంద్ర 'ఏ సీక్వెల్ టు ది మూవీ ప్యాడ్‌మ్యాన్' అంటూ సుహానీ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. ఆమెకు సాయం చేసేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని అభయం ఇచ్చారు. దాంతో ఒక్కసారిగా సుహానీ ప్రయత్నానికి చేయూత లభించినట్లయ్యింది. "ఆనంద్ ట్వీట్ చేసిన నాలుగు గంటల్లో సీన్ మారిపోయింది. ఆయన 'మహీంద్రా ఆటోమోటివ్' హెడ్‌ను మాకు కనెక్ట్ చేశారు. వారి సిబ్బంది మాకు అన్నివిధాల సాయపడ్డారు. మాస్కుల ఉత్పత్తి మొదలెట్టాం. ప్రతీ రోజూ పదివేల మాస్కుల తయారీకి రంగం సిద్ధమైంది. మహీంద్రా గ్రూప్‌నకు చెందిన కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) విభాగం ద్వారా ఈ మాస్కులను ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీసులు, ఇతర సిబ్బందికి అందిస్తున్నాం. ఈ '3 ప్లై మాస్క్'లను ప్రజలకు కూడా అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొత్తానికి ఒక ట్వీట్ మా ప్రయత్నానికి ఊపిరి పోసింది" అని ఆనందాన్ని వ్యక్తం చేశారు సుహాని.

ఫిట్‌నెస్

ఇప్పుడంతా లాక్‌డౌన్. బయటకు వెళ్లే పని లేకపోవడంతో కనీసం వ్యాయామం కూడా లేకుండా పోతోంది. రోజూ ఏ జిమ్‌కో... పార్క్‌కో వెళ్లేవారు సైతం ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. అయితే ఇంట్లోనే ఉంటూ... సులువుగా చేసుకొనే కొన్ని వర్కవుట్స్‌ను ఫిట్‌నెస్ ట్రైనర్లు సూచిస్తున్నారు. వాటిని మీరూ ఫాలో అయితే గుమ్మం దాటకుండా ఫిట్‌గా ఉండవచ్చు.

# వర్కవుట్ ఫ్రమ్ హోమ్



**సూపర్‌మ్యాన్:** బొక్కబోర్లా పడుకొని, చేతులను చాచండి. ఇప్పుడు కుడి చెయ్యి, తల, ఎడమ కాలు పైకి ఎత్తి, ఐదు సెకన్ల వరకు ఉంచండి. తరువాత ఇదే తరహాలో ఎడమ చెయ్యి, తల, కుడి కాలు పైకి ఎత్తండి. అలా పదిసార్లు చేయాలి.



**బ్రిడ్జ్‌లా:** వెల్లకిలా పడుకొని... చేతులను పూర్తిగా ఫ్లోర్‌కు ఆనేట్టు చాచండి. ఇప్పుడు కాళ్లను 90 డిగ్రీల కోణంలో మడిచి, పాదాలు మొత్తం నేలకు ఆనేలా ఉంచి, తొడలు, నడుము పై భాగాన్ని ఈ చిత్రంలో చూపినట్టు పైకి లేపండి. తరువాత సాధారణ పొజిషన్‌కు వచ్చేసి, మళ్లీ ఇదే విధంగా చేయండి. అలా ఐదు నుంచి పది సెకన్ల పాటు ఉండేలా పది సార్లు చేయండి.



**మెట్రోనోమ్‌లా:** వెల్లకిలా పడుకొని, భుజాలకు సమాంతరంగా చేతులను పక్కకు చాచండి. 90 డిగ్రీల కోణంలో కాళ్లను మడిచి, కుడి వైపునకు నేల తగిలేలా వంచడానికి ప్రయత్నించండి. తరువాత రెండో పక్కకు వంచండి. ఇలా పదిసార్లు చేయాలి.



# తుపాకీ షాపుల ముందు పెద్ద క్యూలు!

కరోనా అంతరంగం



- కల్పనా రెంటాల
రచయిత్రి - పెన్సిల్వేనియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిని

"మేము అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలో ఉంటాం. అమెరికాలో కరోనా తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. నిజానికి, కరోనా కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు. సామాజిక సమస్య కూడా! కానీ అమెరికన్ ప్రభుత్వం మాత్రం కరోనా సమస్య గురించి పట్టించుకోవాల్సిన సమయంలో విచిత్రంగా ఇంపీచ్మెంట్ అంశం మీద దృష్టి కేంద్రీకరించింది. అమెరికా అధ్యక్షుడి దృష్టిలో కరోనా అనేది మొదట "ప్రతిపక్ష డెమోక్రాట్లు సృష్టించిన సమస్య." తర్వాత ఇది "చైనా వాళ్ల వైరస్." చివరకు "మనుషుల ప్రాణాల కన్నా దేశ ఆర్థికవ్యవస్థ ముఖ్యం. ఈస్టర్ పండుగ నాటి కల్లా అంతా బాగుంటుంది" అంటూ రోజుకొక వింత వ్యాఖ్య చేసి దేశాధ్యక్షుడు ప్రజల దృష్టిలో నవ్వుల పాలయ్యారు. అంతేకాక అమెరికన్ ప్రజల ప్రాణాల్ని ప్రమాదంలోకి పడేశాడు. కరోనా దెబ్బకు అమెరికన్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలోని లొసుగులన్నీ బయటపడుతున్నాయి. తీరా సమస్య ఉద్ధృతమవడంతో "ఎకానమీ కన్నా ప్రజలే ముఖ్యం" అని దేశాధ్యక్షుడు ఇప్పుడు మాట్లాడుతున్నారు. మెడికల్ సదుపాయాల కోసం గవర్నర్లు ఒకరితో మరొకరు పోటీపడుతున్నారు. కానీ దౌర్భాగ్యం ఏమిటంటే... ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీలు అమ్మే దుకాణాలను ముఖ్యమైన వ్యాపారాలుగా పరిగణించడం! సూపర్‌మార్కెట్ల వద్ద కన్నా గన్ షాపుల ముందు పెద్ద క్యూలు కనిపిస్తున్నాయి. తుపాకీలు కొనుక్కోవడానికి కొందరు ఎక్కువ ప్రాముఖ్యమిస్తున్నారు. ఎందుకని అడిగితే, "ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో లూటీలు జరిగే అవకాశాలు ఎక్కువ కాబట్టి ముందు జాగ్రత్త కోసం..." అని వాళ్లు చెబుతున్నారు. అలాగే, మద్యం షాపుల ముందు కూడా జనాలు ఎక్కువ కనిపిస్తున్నారు. ఇదో విచిత్ర పరిస్థితి.

**మానవ హక్కుల సంస్థల అభ్యర్థన!**

మేమున్న పెన్సిల్వేనియాలో "స్టే ఎట్ హోమ్" ఆదేశాలు అమలవుతున్నాయి. మానవాళి ప్రాణాలను అరచేత పట్టుకొని గడుపుతున్న ఈ సమయంలో విచిత్రంగా ప్రస్తుతం ఇక్కడ హింస ఎక్కువ అయింది. గత పదిరోజుల్లో కనీసం నాలుగు కాల్పుల సంఘటనలు జరిగాయి. అందులో ఐదుగురు చనిపోయారు. మరోపక్క మానవ హక్కుల కోసం ఉద్యమించే ఏసీఎల్‌యూ వంటి సంస్థలు జైళ్లలోని ఖైదీలను విడుదల చేయాలనీ, వారికి కరోనా వైద్యపరీక్షలు నిర్వహించాలనీ అభ్యర్థిస్తున్నాయి. నిరసన తెలియజేస్తున్నాయి. దాంతోపాటూ వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ కూడా చేస్తున్నాయి. ఇక పెన్సిల్వేనియాలోని ఒక నిత్యావసరాల దుకాణంలో, ఒక మహిళ పండ్లు, కూరగాయల మీద కావాలని కొనితెచ్చుకొని మరీ దగ్గడంతో, ముప్పై అయిదు వేల డాలర్ల విలువైన వస్తువులన్నీ చెత్తపాలయ్యాయి. ఇది వేళాకోళాలకు సమయం కాదని ఎవరైనా ఎందుకు అర్థం చేసుకోవట్లేదోనని బాధ కలుగుతోంది.

**అందరూ కలసి వస్తేనే...**

అమెరికా అగ్రరాజ్యమైనప్పటికీ, ఇక్కడి నగరాల్లో నిరాశ్రయులు చాలామందే! ఇప్పుడు వారందరినీ కొన్ని ప్రార్థనా మందిరాలకు తరలించారు. ఫిలడెల్ఫియాలోని పేదల కోసం స్థానిక ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కలిసి కొన్ని ఫుడ్ షెల్టర్లను నెలకొల్పాయి. వాటి ద్వారా ఒక్కో కుటుంబానికి వారానికి సరిపడా ఆహార ప్యాకెట్లను ఒకేసారి అందిస్తున్నారు. అలాగే, డెబ్భై అయిదు వేల డాలర్ల వార్షిక ఆదాయం కన్నా తక్కువ ఉన్న కుటుంబాల్లో... ఒక్కొక్కరికి 'కరోనా ఎకనామిక్ ఇంప్యాక్ట్ పేమెంట్' పథకం కింద పెద్దలకు పన్నెండొందల డాలర్లు, పిల్లలకు అయిదొందల డాలర్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకే, కరోనా కేవలం ఆరోగ్య సమస్య కాదు. ఆర్థిక, సామాజిక సమస్య. ఇలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు ప్రభుత్వంతో పాటు ప్రజలూ సరైన చర్యలు చేపట్టాలి. యువతరానికి కూడా వైరస్ ప్రమాదం పూర్తిగా అర్థం కావాలి. ఈ పెను ఉపద్రవం నుంచి అమెరికా బయటపడాలంటే, సమాజంలో అందరూ కలసిరావాలి."



షార్ట్‌ఫిల్మ్

# ఇంటి నుంచే సూపర్‌స్టార్లు నటించారు!

'బిగ్ బీ' ఇంట్లో తన కూలింగ్ గ్లాసెస్ ఎక్కడో పెట్టి మర్చిపోయారు. ఇంట్లోవాళ్లను అడిగితే నో రెస్పాన్స్. ఆ బాధ్యతను దిల్జీత్ దోసాంజ్, రణ్‌బీర్‌కపూర్‌లు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సూపర్‌స్టార్లను అంటే రజనీకాంత్, చిరంజీవి, మోహన్‌లాల్, మమ్ముట్టి, శివరాజ్‌కుమార్, ప్రొసెన్‌జిత్ చటర్జీలతో పాటు అలియాభట్‌ను కూడా అడిగారు. వారంతా తమ తమ భాషల్లో తెలియదన్నారు. అలియాభట్ మాత్రం తన దగ్గర ఉందని ఇస్తే, అది కాస్త దిల్జీత్, రణ్‌బీర్‌ల చేతులు మారి చివరికి ప్రియాంకచోప్రా దగ్గరకు చేరింది. అంతగా కష్టపడి, హడావిడి చేసి, చివరికి కూలింగ్ గ్లాసెస్‌ను ఆమె బిగ్‌బీ అమితాబ్‌కు ఇస్తే ఆయన ఏమన్నారో తెలుసా? 'లాక్ డౌన్ వల్ల ఇంట్లో నుంచి బయటకు కదలడం లేదు కదా. ఆ తర్వాత కావాల్సివస్తే ఇబ్బంది పడతారని ఇప్పుడే అడిగా' అని కూల్‌గా చెప్పడం కొసమెరుపు.

కేవలం నాలుగున్నర నిమిషాల నిడివి ఉన్న ఒక షార్ట్‌ఫిల్మ్‌లో ఇంతమంది సూపర్‌స్టార్లు కనిపిస్తే ఎలా ఉంటుంది? వీక్షకులకు కన్నుల పండుగే కదా. కరోనా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అమితాబ్ నేతృత్వంలో 'ఫ్యామిలీ' అనే ఈ షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందించారు.

ఇందులో విశేషమేమిటంటే ఆయా సూపర్‌స్టార్లు అందరూ కూడా వారి వారి ఇళ్లలో ఉండే నటించడం. వారంతా ఒకే ఇంట్లో ఉన్నట్టుగా చక్కగా ఎడిట్ చేసి కథను రక్తి కట్టించారు దర్శకుడు ప్రసూన్ పాండే. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ "ఈ షార్ట్‌ఫిల్మ్‌ను మేమంతా ఇంటి నుంచి బయటకు రాకుండానే షూట్ చేశాం. సినిమా పరిశ్రమ అనేది ఒక ఫ్యామిలీ. మేము తెరముందు కనిపిస్తాం కానీ మా వెనుక ఎంతో మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఈ కష్టకాలంలో వారికి అండగా నిలవాలనే సత్ సంకల్పంతో ఈ చిన్న ప్రయత్నం చేశాం. దీని స్పాన్సరర్స్ ద్వారా వచ్చిన మొత్తాన్ని సినీ కార్మికుల కోసం వినియోగిస్తాం. కరోనాను ఎదుర్కోవాలంటే మీరు కూడా ఇంట్లోనే ఉండండి... సురక్షితంగా ఉండండి" అంటూ వీడియో చివర సందేశాన్ని ఇచ్చారు. 'ఫ్యామిలీ' షార్ట్‌ఫిల్మ్ ప్రీమియర్ సోమవారం (6న) రాత్రి 9 గంటలకు సోనీ నెట్‌వర్క్ ద్వారా విడుదలయ్యింది. ఒకవైపు 'కొవిడ్ 19'పై అవగాహనను పెంచుతూనే మరోవైపు సినీ కార్మికులకు అండగా నిలవాలనే సంకల్పంతో మన సూపర్‌స్టార్లంతా ఏకమై షార్ట్‌ఫిల్మ్ తీయడం ఎంతైనా అభినందనీయం. ఈ సరదా 'ఫ్యామిలీ'ని మీరూ చూసేయండి.

కరోనా కాలం



# ఇదీ ఇప్పటి ట్రెండ్!

విరాట్ కోహ్లీకి అనుష్క హెయిర్‌కట్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో ఎంత వైరల్ అయిందో చూసే ఉంటారు. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ సొంతంగా హెయిర్ కట్ చేసుకుంటూ పెట్టిన వీడియోకి ఎన్ని కామెంట్లు వచ్చాయో గమనించే ఉంటారు. సెలబ్రిటీలే కాదు... సామాన్యులు కూడా ఇప్పుడు అదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు. లాక్‌డౌన్ మూలంగా సెలూన్‌లు మూతపడడంతో సొంతంగా హెయిర్ కట్ చేసుకుంటున్నారు. కేరళలో క్లీన్‌గా గుండు చేసుకోవడం ట్రెండ్‌గా మారింది. ఐటీ ఉద్యోగులు సోషల్ మీడియాలో ఇదే అంశంపై క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

మాసిన గడ్డం, పెరిగిన జుట్టుతో నాలుగు రోజులంటే ఎలాగోలా నెట్టుకు రావచ్చు. కానీ మూడు వారాల పాటు గడపాలంటే కొద్దిగా కష్టమే. అందుకే కొంతమంది సొంతంగా కటింగ్ చేసేసుకుంటున్నారు. ఇంకొంతమంది నీట్‌గా గుండు చేసుకుంటున్నారు. కేరళలో ఇప్పుడు ఇది ఫ్యాషన్‌గానూ మారింది. వాళ్లు గుండు చేసుకోవడమే కాకుండా స్నేహితులకు 'హోమ్ క్వారంటైన్ షేవ్ ఛాలెంజ్'ను విసురుతున్నారు.

హెయిర్ కటింగ్ సెలూన్‌లు ఎప్పుడు చూసినా బిజీగానే ఉంటాయి. ఆదివారం వచ్చిందంటే ఒక గంట వెయిట్ చేస్తే కానీ మన వంతు రాదు. కానీ ఇప్పుడు లాక్‌డౌన్ మూలంగా సర్వం మూతపడ్డాయి. దాంతో కేరళలో కొంతమంది తమకు తామే కటింగ్ పని కానిచ్చేస్తున్నారు. ఫైనల్ టచ్‌లో మాత్రం స్నేహితుల సాయం తీసుకుంటున్నారు. "గత 40 ఏళ్లలో ఎప్పుడూ ఇలా జరగలేదు. నేను మా స్నేహితుడికి కటింగ్ చేశా. వాడు నాకు చేశాడు" అని కేరళలోని కోళిక్కోడ్‌కు చెందిన ఓ వ్యక్తి చెప్పుకొచ్చారు. కోళిక్కోడ్ యువత ప్రస్తుతం ఇదే ట్రెండ్ ఫాలో అవ్వాలని అనుకుంటున్నారు. "సెలూన్‌లు మూతపడడం ఊహించని ఛాలెంజ్‌ను తెచ్చిపెట్టింది. జుట్టు కట్ చేసుకోవడం అత్యవసరం కాకపోయినా కొంచెం లుక్ బాగుండాలంటే కట్ చేసుకోక తప్పలేదని" అంటున్నారు అక్కడి యువత.

కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హోమ్ క్వారంటైన్ షేవ్ ఛాలెంజ్‌ను సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. "ఒక్క కోళిక్కోడ్‌లోనే పలువురు ఐటీ ఉద్యోగులు హోమ్ క్వారంటైన్ షేవ్ ఛాలెంజ్‌లో చేరారు. వీళ్లు రకరకాల ఐటీ కంపెనీల్లో డైరెక్టర్ హోదాల్లో ఉన్నారు" అని క్యాలికట్ ఫోరం ఫర్ ఐటీ సెక్రెటరీ అబ్దుల్ గఫూర్ అన్నారు. వీళ్లంతా కరోనా వైరస్‌పై పోరుకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో చేస్తున్నారు. ఈ ఛాలెంజ్‌లో పాల్గొనే వారు క్లీన్ కటింగ్ ఫొటోను షేర్ చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధికి తమ వంతు విరాళం అందించాలి. మరో స్నేహితుడికి ఛాలెంజ్‌ను విసరాలి. అప్పుడే ఛాలెంజ్ ముగుస్తుంది. గుండు చేసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తుండడంతో సెలబ్రిటీలను ఫాలో అవ్వడంలో మనవాళ్లు ఎప్పుడూ ముందే ఉంటారు అని నెటిజన్లు కామెంట్లతో మెచ్చుకుంటున్నారు.

● కామిక్ కరోనా

కార్టూన్: చారి పి.ఎస్




ఫటాఫట్

# క్యారెట్ రైస్... ఈజీ!



బోర్‌కొడితే భోజనానికి బదులు క్యారెట్ రైస్‌ను తినొచ్చు. దీన్ని వండడం ఈజీ. ఇంటిల్లిపాదికి నచ్చుతుంది.

**కావలసిన పదార్థాలు**

బియ్యం - కప్పు, ఆయిల్ - టేబుల్ స్పూన్, కరివేపాకు - పిడికెడు, కొత్తిమీర - పిడికెడు, యాలకులు - 4, ఉల్లిపాయ - పెద్దది 1, అల్లం, వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, క్యారెట్లు - పెద్దవి 2, కారం - రుచికి తగినంత ఉప్పు - రుచికి తగినంత, వేయించిన పల్లీలు - పిడికెడు

**తయారుచేసే విధానం**

ముందుగా అన్నం పొడిగా ఉండేలా వండుకోని చల్లారనివ్వాలి.

కడాయిలో కొంచెం నూనె వేసి వేడయ్యాక యాలకులు, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేగించాలి. దానికి అల్లం, వెల్లుల్లి పేస్ట్ కలిపి వాసన పోయేదాకా వేగించాలి. క్యారెట్‌లను తురుముగా లేదా ముక్కలుగా కోసి కడాయిలో వేసి రెండు నిమిషాలు దోరగా వేగించిన తరువాత ఉప్పు చల్లి మూతపెట్టాలి. సన్నమంట మీద క్యారెట్ ఉడికిన తర్వాత దానికి తగినంత కారం, కొత్తిమీర చల్లుకోవాలి. తరువాత చల్లారిన అన్నాన్ని వేసి బాగా కలియబెట్టి కొంచెం ఉప్పు చల్లాలి. కావాలంటే నిమ్మరసం కూడా పిండుకోవచ్చు. ఆఖరున వేగించిన పల్లీలు కలుపుకోవాలి. అంతే క్యారెట్ రైస్ సిద్ధం. పెరుగు అప్పడాలు, రైతాతో ప్లేట్‌లో వడ్డించుకోవచ్చు. చిన్నపిల్లలయితే ఇష్టంగా తింటారు.

కరోనా కేర్

# ఇలా వేసుకోవాలి!

కరోనా వైరస్ బాధితులకు చికిత్స అందించడంలో వైద్యులు, ఇతర వైద్యసిబ్బంది సేవలు వెలకట్టలేనివి. ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు కాపాడడానికి వీళ్లు నిత్యం శ్రమిస్తుంటారు. వీళ్లు వైరస్ సోకకుండా ధరించే యాప్రాన్, మాస్క్, గాగుల్స్, ఫేస్ షీల్డ్ వంటి వస్తువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ కొన్ని సూచనలు చేసింది. అవేమిటంటే...



**పీపీఈ ఎలా ధరించాలంటే...?**

- పీపీఈ అంటే 'పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్'. వైద్యులు, వైద్యసిబ్బంది వీటిని ధరిస్తూ ఉంటారు.
- శిక్షణ పొందిన టీం సభ్యుని పర్యవేక్షణలో పీపీఈ ధరించడం, తీయడం చేయాలి.
- రబ్బరు బూట్లు, ఫ్లూయిడ్ రెసిస్టెన్స్ బూట్లు మాత్రమే ధరించాలి.
- ఏ మాత్రం గాలి కూడా చొరబడని వాటర్‌ప్రూఫ్ యాప్రాన్ లేదా గౌన్ ధరించాలి.
- తరువాత నాణ్యమైన మాస్క్, గాగుల్స్ లేదా ఫేస్ షీల్డ్‌ను పెట్టుకోవాలి.
- అందుబాటులో ఉంటే... మొత్తం తలభాగం కవర్ అయ్యే విధంగా, హెల్మెట్ లాంటి హెడ్ కవర్ పెట్టుకోవచ్చు.
- పీపీఈ ధరించాక చేత్తో ముట్టుకోవడం, సర్దుకోవడం చేయకూడదు.
- ఒకవేళ పీపీఈ రీ యూజబుల్ అయితే నిర్దేశించిన స్థలంలో రీప్రాసెసింగ్ కోసం ఉంచాలి. రీ యూజబుల్‌ది కానట్టయితే వేస్ట్ కంటెయినర్‌లో వేయాలి.
- ముట్టుకొనే అవసరం లేని థర్మామీటర్లు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను వాడాలి.

**ధరించాల్సిన వరుస ఇదీ...**



- **గౌన్:** గౌన్ మెడ భాగం నుంచి వీపు భాగం పూర్తిగా కప్పి ఉండాలి.



- **మాస్క్ లేదా రెస్పిరేటర్:** మాస్క్ ఎలాస్టిక్ బ్యాండ్‌లు తల మధ్య భాగంలో ఉండేలా చూసుకోవాలి. ఎలాస్టిక్ బ్యాండ్‌లు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి. ముఖానికి సరిగ్గా సరిపోయేలా ఉండే మాస్కును ఎంచుకోవాలి.



- **గాగుల్స్ లేదా ఫేస్ షీల్డ్:** ముఖం, కళ్లు పూర్తిగా కవర్ అయ్యేలా ఫేస్ షీల్డ్ ఉండాలి.



- **గ్లౌజులు:** గ్లౌజులు మణికట్టు పూర్తిగా కవర్ అయ్యేలా ఉండాలి.

**గ్లౌజులు ఎలా తీయాలి!**



- గ్లౌజుల బయటి భాగం వైరస్‌తో కలుషితమై ఉంటుంది.
- గ్లౌజు ధరించి ఉన్న ఒక చేత్తో, ఇంకో అరచేతి ప్రాంతపు గ్లౌజును పట్టుకొని లాగి తీయాలి.
- గ్లౌజు ధరించి ఉన్న చేత్తోనే తీసి వేసిన గ్లౌజును పట్టుకోవాలి.
- ఆ గ్లౌజు సహాయంతో రెండో చేతి గ్లౌజు కూడా తీసేయాలి.

**గాగుల్స్ లేదా ఫేస్ షీల్డ్ ఎలా తీయాలి?**



- హెడ్‌బ్యాండ్‌ను వెనకాల పట్టుకొని తలపై నుంచి తీయడం ద్వారా గాగుల్స్ లేదా ఫేస్ షీల్డ్‌ను తీయాలి.
- అలాగే గౌన్, మాస్క్‌లను తీసేయాలి.

**ఇలా చేయండి!**

- ముఖంపై చేతులు పెట్టుకోకూడదు.
- ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ చేతులు పెట్టకూడదు. అవసరమైన చోట మాత్రమే ముట్టుకోవాలి.
- కలుషితమైనా, చిరిగినా గ్లౌజులు వెంటనే మార్చాలి.
- చేతులు ప్రతి క్షణం పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఆధారం: సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, అమెరికా.



# అది మహీ గొప్పతనం

- బిజినెస్ క్లాస్‌కు ఎప్పుడూ దూరమే
- సునీల్ గవాస్కర్ ప్రశంస

**న్యూఢిల్లీ:** భారత జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. సహచరులతో వ్యవహరించే తీరును బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ కొనియాడాడు. అందరితో పాటే తానూ అనే అతడి సిద్ధాంతం అద్భుతమని చెప్పాడు. మామూలుగా సొంత గడ్డపై సిరీస్‌లు ఆడుతున్నప్పుడు ఉత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు బీసీసీఐ బిజినెస్ క్లాస్‌ను ఆఫర్ చేస్తుంటుంది. ఎందుకంటే దేశవాళీ విమానాల్లో ఈ తరహా టిక్కెట్లు పరిమితంగా ఉంటాయి. ఇక కెప్టెన్, మేనేజర్, కోచింగ్ సిబ్బందికి సహజంగానే ఈ సౌకర్యం ఉంటుంది. కానీ, ధోనీ తన కెప్టెన్సీ హయాంలో బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించేందుకు ఎక్కువగా ఇష్టపడేవాడు కాదని సన్నీ తెలిపాడు. 'స్వదేశంలో అంతర్జాతీయ సిరీస్‌లు జరుగుతున్నప్పుడు ఇరు జట్ల ఆటగాళ్లు చార్టెడ్ ఫ్లైట్‌లో వెళుతుంటారు. అలాగే కెప్టెన్, కోచ్ సిబ్బంది కాకుండా మిగతా ఆటగాళ్లంతా ఎకానమీలో కూర్చోవాల్సి ఉంటుంది. కానీ క్రితం మ్యాచ్‌లో మెరుగ్గా ఆడిన వారికి బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. దీంతో పాటు ఇదే విమానంలో టీవీకి చెందిన సాంకేతిక సిబ్బంది కూడా వస్తుంటారు. కానీ కెప్టెన్‌గా తనకున్న బిజినెస్ క్లాస్ సౌకర్యాన్ని ధోనీ ఉపయోగించుకునే వాడు కాదు. అతడెప్పుడూ టీవీకి చెందిన కెమెరామెన్, సౌండ్ ఇంజినీర్లతో కూర్చునేందుకు ఇష్టపడేవాడు' అని గవాస్కర్ పేర్కొన్నాడు.



**కోహ్లీ కూడా అంతే..:** ధోనీ సంప్రదాయాన్ని ప్రస్తుత సారథి కోహ్లీ కూడా అనుసరిస్తున్నట్టుంది. ఈ విషయాన్ని గతంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ బయటపెట్టాడు. 2018లో భారత జట్టు ఆసీస్‌లో పర్యటించింది. ఈ సందర్భంలో అడిలైడ్ నుంచి పెర్త్‌కు వెళుతున్న విమానంలో కోహ్లీ, అతడి భార్య అనుష్క తమ బిజినెస్ క్లాస్ సీట్లను జట్టు పేసర్లకు ఆఫర్ చేశారని వాన్ గుర్తుచేశాడు.



## ఐపీఎల్ కాంట్రాక్టులు దక్కవని
# మా వాళ్లు భయపడ్డారు!
### ఆసీస్ ఆటగాళ్లపై క్లార్క్ విమర్శ

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాతో క్రికెట్ మ్యాచ్‌లంటే ముందుగా గుర్తుకు వచ్చేది.. స్లెడ్జింగ్. ప్రత్యర్థి ఎవరైనా సరే రెచ్చగొట్టే మాటలతో వారిని కవ్విస్తూ ఆటపై దృష్టి కోల్పోయేలా చేస్తూ పైచేయి సాధిస్తుంటారు. స్వదేశంతో పాటు, ఇతర దేశాల్లో పర్యటించినా వీరి తీరు మారదు. ఇక, భారత్‌తో మ్యాచ్‌లంటే ఇంకాస్త మితిమీరేవారు. 2007-08, 2018 ఆసీస్ టూర్‌లో భారత్‌ను ఓ ఆటాడుకున్నారు. మంకీ గేట్ ఉదంతం ఎంత సంచలనం సృష్టించిందో మర్చిపోగలమా.. కానీ ఇటీవల టీమిండియాతో ఆడుతున్నప్పుడు వీరి ప్రవర్తనలో మార్పు కనిపిస్తోందని ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా కెప్టెన్ విరాట్ కోహ్లీని కవ్వించేందుకు ఇష్టపడడం లేదని, దీనికంతటికీ ఐపీఎల్‌నే కారణమని తేల్చాడు. ఎందుకంటే విరాట్‌ను లక్ష్యంగా చేసుకుంటే ఐపీఎల్ వేలంలో ఆయా ఫ్రాంచైజీలు తమను కొనుగోలు చేయవేమోనని భయపడ్డారని క్లార్క్ ఆరోపించాడు. 'ఆర్థికంగా చూసుకుంటే ఇతర బోర్డుల కంటే బీసీసీఐ ఎంత శక్తివంతమో అందరికీ తెలుసు. ఐపీఎల్ ద్వారానూ ఆటను శాసిస్తోంది. అందుకే ఇతర జట్లతో పాటు ఆసీస్ కూడా కొంతకాలంగా కోహ్లీ సేనపై సానుకూల ధోరణిలో ఉంటోంది. భారత క్రికెటర్లపై స్లెడ్జింగ్‌కు దిగితే ఐపీఎల్‌లో దెబ్బ పడుతుందనే ఆందోళన వారిలో కనిపించింది. కొందరైతే..'కోహ్లీని స్లెడ్జింగ్ చేయను. ఎందుకంటే అతడి బెంగుళూరు జట్టులో నేను ఆడాలనుకుంటున్నా. అనవసరంగా నోరు పారేసుకుని నష్టపోవడం ఎందుకు?' అనే అభిప్రాయంతో ఉండేవారు. దీంతో ఆసీస్‌కు సహజసిద్ధంగా ఉండే దూకుడు ఇప్పుడు కనిపించడం లేదని క్లార్క్ చెప్పుకొచ్చాడు.


క్లార్క్

**బాగానే సొమ్ము చేసుకున్నారు..:** గత డిసెంబర్‌లో జరిగిన క్రికెటర్ల వేలంలో ఆసీస్ ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తిని ప్రదర్శించాయి. కమిన్స్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఏకంగా రూ.15.50 కోట్లకు కొనుగోలు చేసింది. ఓ విదేశీ క్రికెటర్‌కు ఇంత ధర పలకడం లీగ్ చరిత్రలో ఇదే తొలిసారి. అలాగే మ్యాక్స్‌వెల్ రూ.10.75 కోట్లు (పంజాబ్), కల్టర్‌నైల్ రూ.8 కోట్లు (ముంబై) తమ ఖాతాలో వేసుకున్నారు. వీరే కాకుండా చాలా మంది ఆసీస్ ఆటగాళ్లు కోట్లలో ధర పలికారు. కొందరైతే ఆయా జట్లకు కెప్టెన్లుగా కూడా కొనసాగుతుండడం విశేషం.

## గవాస్కర్, పుజార విరాళాలు

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారితో ఇబ్బంది పడుతున్న బాధితులను ఆదుకునేందుకు దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ రూ.59 లక్షలను విరాళంగా ఇచ్చాడు. ఇందులో రూ.35 లక్షలు ప్రధాని సహాయ నిధికి, రూ.24 లక్షలు మహారాష్ట్ర సీఎంఓకు సన్నీ అందించాడు. ఇక, భారత టెస్టు క్రికెటర్ చటేశ్వర్ పుజార గుజరాత్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మంగళవారం విరాళాన్ని అందించాడు. కానీ, ఎంత మొత్తం ఇచ్చాడో గోప్యంగా ఉంచాడు.

## ఆ ఇద్దరు సీనియర్లు రిటైరైతే మంచిది


రమీజ్ రాజా

**కరాచీ:** పాకిస్థాన్ వెటరన్ క్రికెటర్లు షోయబ్ మాలిక్ (38), మహ్మద్ హఫీజ్ (39) ఆటకు వీడ్కోలు చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ రమీజ్ రాజా అభిప్రాయపడ్డాడు. ఈ ఇరువురు గౌరవప్రదంగా ఆట నుంచి తప్పుకోవాలని అన్నాడు. 'షోయబ్, హఫీజ్ పాక్ జట్టుకు గొప్ప విజయాలు అందించారు. ఇందులో ఎలాంటి సందేహాలూ లేవు. అయితే, జట్టు నుంచి వారు తప్పుకోవడానికి ఇదే సరైన సమయం. ప్రతిభావంతులైన యువ క్రికెటర్లు జట్టులోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి దారి ఇవ్వాలి' అని రమీజ్ అన్నాడు.



# ఆ ఇద్దర్నీ నేనే గుర్తించా!
### ధోనీ, కోహ్లీని వెలికితీసింది అతడే

**న్యూఢిల్లీ:** బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా దిలీప్ వెంగ్‌సర్కార్‌కు ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఏజ్ గ్రూప్ క్రికెట్‌లోనే కోహ్లీ అద్భుత ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పించాడు. టాలెంట్ హంట్‌లో తనదైన ముద్రవేశాడు. 2006-08 వరకు చీఫ్ సెలెక్టర్‌గా పని చేసిన వెంగ్‌సర్కార్.. సెలెక్షన్ కమిటీకి సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాడు. తన తర్వాత ఆ బాధ్యతలు నిర్వర్తించే వారికి మార్గదర్శిగా నిలిచాడు. సహజ ప్రతిభ ఉన్న కోహ్లీ లాంటి వారికి అండగా నిలిచినా..ధోనీకి కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పాలన్న సాహసోపేత నిర్ణయం తీసుకున్నా అతడికే చెల్లింది. ప్రస్తుతం మనుగడలో లేని బీసీసీఐ టాలెంట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ వింగ్ (టీఆర్‌డీడబ్ల్యూ) హెడ్‌గా విధులు నిర్వర్తించిన తాను.. సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ పదవికి తగిన న్యాయం చేయగలనని విశ్వసించానని చెప్పాడు. విరాట్ గురించి మాట్లాడుతున్నప్పుడు.. అతడి మాటల్లో ఏదో సాధించానన్న భావం తొణికిసలాడింది. ఆస్ట్రేలియా టూర్‌కు ఏమాత్రం అనుభవం లేని కోహ్లీని వెంగీ ఎంపిక చేసి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. 'అండర్-16, అండర్-19 టోర్నీలో కోహ్లీ ఆటను నిశితంగా గమనించా. సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన తర్వాత విరాట్‌కు టీమ్‌లో అవకాశం కల్పించా. భవిష్యత్‌లో అతడు గొప్ప ఆటగాడిగా ఎదుగుతాడనే నమ్మకం నాలో కలిగింద'ని గుర్తుచేసుకున్నాడు.



### మహీ వయసు ఎక్కువైనా..

టీఆర్‌డీడబ్ల్యూ స్కీమ్ కింద అండర్-19 క్రికెటర్లను మాత్రమే గుర్తించాలని ఉంది. కానీ, ధోనీ వయసు ఎక్కువైనా.. ప్రతిభకు ఏదీ అడ్డుకారాదనే ఉద్దేశంతోనే ఆ సమయంలో ధోనీకి అవకాశం కల్పించినట్టు వెంగ్‌సర్కార్ తెలిపాడు. 'అండర్-19 మ్యాచ్ టాలెంట్ హంట్ జరుగుతున్న సమయంలో పక్కన బిహార్ జట్టు రంజీ ఆడుతోంది. కొన్ని బంతులు స్టేడియం బయటకు రావడంతో ఎవరా? అని ఆరా తీశా. అప్పటికి ధోనీ వయసు 21 ఏళ్లు. కానీ, ప్రతిభ ఉన్న వాళ్లకు అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతోనే మహీకి ఆ స్కీమ్‌లో చాన్స్ ఇచ్చాన'ని దిలీప్ చెప్పాడు. కాగా, ఒకప్పుడు ఎంతో మంది ప్రతిభావంతులను తయారు చేసిన జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) ఇప్పుడు పునరావాస కేంద్రంగా మారడంపై కల్నల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక యువ ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఎక్కువగా ఆడాలని సూచించాడు.

## రిచర్డ్స్ బెస్ట్ కానీ..
### ఆసీస్ మాజీ షేన్ వార్న్



**న్యూఢిల్లీ:**వెస్టిండీస్ గ్రేట్ వివియన్ రిచర్డ్స్ లాంటి గొప్ప బ్యాట్స్‌మన్‌ను తాను ఇంతవరకు చూడలేదని ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ షేన్ వార్న్ అన్నాడు. కానీ, విరాట్ కోహ్లీ ఆ విషయంలో పోటీకి వస్తున్నాడని చెప్పాడు. 'రిచర్డ్స్ లాంటి బ్యాట్స్‌మన్‌ను నేను ఇంత వరకూ చూడలేదు. సచిన్, లారా లాంటి మేటి బ్యాట్స్‌మెన్‌తో నేను ఆడా. అయితే, ప్రస్తుత తరంలో మాత్రం విరాట్ భేష్..! వివ్ స్థానంలో మరొకరిని ఊహించడం కష్టమే. కానీ, కోహ్లీ ఆ దిశగా ఆలోచించేలా చేస్తున్నాడు' అని వార్న్ ప్రశంసించాడు.

## ఐపీఎల్ జరిగి తీరాలి: హర్భజన్

**ముంబై:** ఖాళీ స్టేడియాల్లోనైనా ఫర్వాలేదు.. ఐపీఎల్ మాత్రం జరిగి తీరాలని టీమిండియా వెటరన్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అంటున్నాడు. 'ఎంతో మంది జీవితాలు ఐపీఎల్‌తో ముడిపడి ఉన్నాయి. అందుకే కరోనా వైరస్ అదుపులోకి వచ్చిన తర్వాత లీగ్‌ను నిర్వహించాలి. ఒకవేళ పరిస్థితులు అనుకూలించకపోతే ఖాళీ మైదానాల్లో ఆడడానికైనా ఎలాంటి అభ్యంతరం లేదు. ఆటగాడిగా అది నాకు నిరుత్సాహాన్ని కలిగించేదే అయినా.. ఇళ్లల్లో ఉన్నవారు టీవీల్లో చూసే అవకాశం ఉంది' అని భజ్జీ స్టార్స్ స్పోర్ట్స్‌తో చెప్పాడు.

## విరాట్‌కు ఫెడెక్స్ సవాల్



**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి కారణంగా ఇంటికే పరిమితమైన స్విస్ టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెడరర్.. విరాట్ కోహ్లీ సహా అనేక మంది సెలెబ్రిటీలకు ఓ సరదా చాలెంజ్ విసిరాడు. ఒక్కడే టెన్నిస్ రాకెట్‌తో బంతిని కొడుతూ సోలో డ్రిల్ చేస్తున్న వీడియోను ఫెడరర్ పోస్ట్ చేశాడు. 'అందరికీ ఉపయోగకరమైన సోలో డ్రిల్. మీరెలా చేస్తారో వీడియోతో రిప్లై ఇవ్వండి' అని ట్వీట్ చేశాడు. ఈ చాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా కోహ్లీతో సహా అనేక మందిని ఫెడరర్ నామినేట్ చేశాడు.

## సెప్టెంబరులో టీటీ వరల్డ్ చాంపియన్‌షిప్

**లొసాన్ (స్విట్జర్లాండ్):** కరోనా ధాటికి వాయిదా పడిన టేబుల్ టెన్నిస్ వరల్డ్ చాంపియన్‌షిప్‌ను సెప్టెంబరులో నిర్వహిస్తామని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) మంగళవారం తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 4 వరకు ఈ టోర్నీని నిర్వహించనున్నట్టు ఐటీటీఎఫ్ స్పష్టం చేసింది.

---

# బిజినెస్



# బుల్ జోష్

- ఆల్‌టైమ్ రికార్డు లాభం • సెన్సెక్స్ 2,476 పాయింట్లు అప్ • మళ్లీ 30 వేల ఎగువకు సూచీ
- 708 పాయింట్లు బలపడ్డ నిఫ్టీ • రూ.7.71 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు లాభం నమోదైంది. బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ ఏకంగా 2,476.26 పాయింట్లు (8.97 శాతం) పెరిగి 30,067.21 వద్దకు చేరుకుంది. ఎన్ఎస్ఈలోని నిఫ్టీ-50 సూచీ సైతం 708.40 పాయింట్లు (8.76 శాతం) పుంజుకొని 8,792.20 వద్ద స్థిరపడింది.

పాయింట్ల పరంగా చూస్తే.. సూచీల చరిత్రలో ఇదే అతిపెద్ద లాభం. పెరుగుదల శాతం ప్రకారంగా చూస్తే.. 2009 మే తర్వాత ఇదే అతిపెద్ద వృద్ధి. అమెరికా తదితర దేశాల్లో కొత్తగా నమోదయ్యే కరోనా కేసులు తగ్గుముఖం పట్టడం ప్రపంచ మార్కెట్లలో సానుకూలతను పెంచాయి. దాంతో గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లతోపాటు దేశీయ సూచీలూ ర్యాలీ తీశాయి.

### సెన్సెక్స్ టాప్-10 గెయిన్స్ (పాయింట్లలో)

| లాభం | తేదీ |
|---|---|
| 2,476.26 | 2020 ఏప్రిల్ 07 |
| 2,110.79 | 2009 మే 18 |
| 1,921.15 | 2019 సెప్టెంబరు 20 |
| 1,861.75 | 2020 మార్చి 25 |
| 1,627.73 | 2020 మార్చి 20 |
| 1,421.90 | 2019 మే 20 |
| 1,325.34 | 2020 మార్చి 13 |
| 1,139.92 | 2008 జనవరి 25 |
| 1,075.41 | 2019 సెప్టెంబరు 23 |
| 928.09 | 2008 మార్చి 25 |

- బ్లూచిప్‌లతోపాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీలకూ కొనుగోళ్ల ఆదరణ లభించింది. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 4.13 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 5.40 శాతం బలపడ్డాయి.
- భారీ ర్యాలీలో మార్కెట్ వర్గాల సంపద రూ.7.71 లక్షల కోట్లు పెరిగింది. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,16,38,099.98 కోట్లకు చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీలూ లాభపడ్డాయి. అందులో 14 కంపెనీలు 10 శాతానికి పైగా పుంజుకున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ ఏకంగా 22.60 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- సెన్సెక్స్ ర్యాలీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లదే ప్రధాన వాటా. ఆర్ఐఎల్ షేరు 11.89 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 10.18 శాతం బలపడ్డాయి.
- బుల్స్ జోరులో 26 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని చేరుకోగా.. 428 సంస్థల షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.
- బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలు పెరుగుదలను నమోదు చేసుకున్నాయి. బ్యాంకింగ్, ఇంధన రంగ సూచీలైతే 10 శాతం పైగా వృద్ధి చెందాయి. టెలికాం, ఆటో 9 శాతానికి పైగా లాభపడ్డాయి.

### రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు 49 పైసలు బలపడి 75.64 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో ర్యాలీ ఇందుకు దోహదపడింది.

### ఎంఎఫ్ సబ్‌స్క్రిప్షన్ వేళల్లో మార్పులు

మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్ 'స్టార్-ఎంఎఫ్'లో ఫండ్ పథకాల సబ్‌స్క్రిప్షన్, రిడంప్షన్ లావాదేవీలకు అనుమతించే సమయాన్ని తగ్గిస్తున్నట్లు బీఎస్ఈ తెలిపింది. ఈ నెల 7వ తేదీ (మంగళవారం) నుంచి సవరించిన వేళలు అమల్లోకి వచ్చాయి.

### బంగారం

అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు 1708 డాలర్లకు చేరుకోగా.. వెండి 15.67 డాలర్ల వద్ద ట్రేడైంది. లాక్‌డౌన్ కారణంగా దేశంలోని అన్ని నగరాల్లో బులియన్ స్పాట్ ట్రేడింగ్ నిలిచిపోయింది. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్ ప్రకారం.. మంగళవారం ఆరంభంలో ముంబై మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర రూ.45,121 వద్ద ట్రేడయి చివరకు రూ.44,480 వద్ద క్లోజైంది.

# ఉపాధి ఉఫ్..

- 125 కోట్ల మంది కార్మికులకు ముప్పు
- భారత్‌లో 40 కోట్ల మంది మరింత పేదరికంలోకి..
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇదే అతిపెద్ద సంక్షోభం
- కరోనా కష్టాలపై ఐఎల్ఓ నివేదిక

**న్యూఢిల్లీ:** కరోనా సంక్షోభంతో ప్రపంచ వ్యాప్తంగా 125 కోట్ల మంది కార్మికుల జీవనోపాధికి ముప్పు ఏర్పడిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) హెచ్చరించింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇదే అతిపెద్ద సంక్షోభమని పేర్కొంది. కరోనా కాటుకు భారత్‌లోని అవ్యవస్థీకృత రంగంలో పనిచేసే 40 కోట్ల మంది కార్మికులు మరింత పేదరికంలోకి జారుకునే ప్రమాదం ఉందని ఐఎల్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ తదితర కఠిన చర్యలు వారి ఉద్యోగాలు, ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తాజా నివేదికలో పేర్కొంది. అంతేకాదు, వారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోతున్నారని అంటోంది. రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది రెండో త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో ప్రపంచ వ్యాప్తంగా 6.7 శాతం పని గంటలు తుడిచిపెట్టుకుపోవచ్చు. ఇది 19.5 కోట్ల ఫుల్‌టైం కార్మికులు చేసే పనికి సమానం.
- పని గంటల తరుగుదల అరబ్ దేశాల్లో (8.1 శాతం లేదా 50 లక్షల ఫుల్‌టైం జాబ్స్) అత్యధికంగా నమోదు కావచ్చు. యూరప్‌లో 7.8 శాతం లేదా 1.2 కోట్ల ఫుల్‌టైం జాబ్స్, ఆసియా, ఆసియా పసిఫిక్‌లో 7.2 శాతం లేదా 12.5 కోట్ల ఫుల్ టైం జాబ్స్‌గా నమోదు కావచ్చు.
- ఆయా ఆదాయ వర్గాల వారు భారీ నష్టపోవచ్చు. ఎగువ మధ్య తరగతి వారు అత్యధికంగా 7 శాతం మేర నష్టపోవచ్చు. ఇది 2008-09 ఆర్థిక సంక్షోభ ప్రభావం కంటే అధికం.
- హోటళ్లు, ఆహార సేవలు, వస్తు తయారీ, రిటైల్, బిజినెస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రంగాలు అధికంగా ప్రభావితం కానున్నాయి.
- ఈ ఏడాది చివరినాటికి ప్రపంచవ్యాప్త నిరుద్యోగులను తొలుత 2.5 కోట్లుగా అంచనా వేశాం. కరోనా సంక్షోభం నేపథ్యంలో సంఖ్య అంతకంటే ఎక్కువగానే నమోదు కావచ్చు.



### 5 కోట్ల కొలువులు హాంఫట్

కరోనా (కోవిడ్-19) మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు విధించిన లాక్‌డౌన్‌తో ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. 'ఉజ్జాయింపుగా చూసినా, లాక్‌డౌన్ అమల్లోకి వచ్చిన తొలి రెండు వారాల్లోనే 5 కోట్ల ఉద్యోగాలు పోయి ఉంటాయి' అని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన గణాంకవేత్త ప్రణబ్ సేన్ చెప్పారు. జనవరిలో 7.16 శాతం ఉన్న నిరుద్యోగిత రేటు మార్చి 15 నాటికి 23.4 శాతానికి చేరిందని సీఎంఐఈ అనే సంస్థ తెలిపింది. దేశంలో నిరుద్యోగ రేటు గత 43 నెలల్లో ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి.

## ఎస్‌హెచ్‌జీలు, రైతన్నలకు బీఓబీ ఆర్థిక సాయం

ముంబై: కోవిడ్-19 నేపథ్యంలో ఫండింగ్ అవసరాలు తీర్చేందుకు ప్రతి మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ)కు కనిష్ఠంగా రూ.30,000, గరిష్ఠంగా రూ.లక్ష వంతున ఆర్థిక సహాయం అందించనున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్‌డ్రాఫ్ట్ లేదా టర్మ్ రుణం కింద ఈ సహాయం అందిచనున్నట్టు తెలిపింది. ఎస్‌హెచ్‌జీలు ఈ మొత్తాలను 24 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, పాడిపరిశ్రమ, ఫిషరీస్ విభాగాలకు చెందిన ఉత్పత్తులు తయారుచేసే వారికి కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్టు పేర్కొంది.

వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలకు 36 నెలల కాలపరిమితిలో తిరిగి చెల్లించే విధానంలో గరిష్ఠంగా రూ.5 లక్షలు, పాడి పరిశ్రమ, ఫిషరీస్ రైతులకు గరిష్ఠంగా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్టు తెలియచేసింది. మహిళా ఎస్‌హెచ్‌జీలు ఆ రుణా న్ని నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించవచ్చు. వ్యవసాయదారులు, ఎస్‌హెచ్‌జీలకు అందించే రుణంపై ఆ మొత్తం అందించిన నాటి నుంచి 6 నెలల మారటోరియం వర్తింపచేస్తారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డులున్న వారందరికీ వ్యవసాయ ఖర్చుల కోసం కనిష్ఠంగా రూ.10 వేలు, గరిష్ఠంగా రూ.50 వేలు సహాయం అందించనున్నట్టు ప్రకటించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 7వ తేదీకి.. | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 355 | విజయవాడ | 345 |
| 8వ తేదీకి.. | | విశాఖపట్నం | 345 |
| చిత్తూరు | 433 | వరంగల్ | 358 |
| గోదావరి | 345 | డజను గుడ్లు రూ. 54 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 80 |
| వరంగల్ | 85 | గుంటూరు | 80 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 80 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | 85 |
| కర్నూలు | 85 | నెల్లూరు | 85 |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | 93 |
| గోదావరి | 85 | | |

## పొదుపు ఖాతాపై వడ్డీ రేటు తగ్గించిన ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: రెపో రేటు తగ్గింపు ప్రభావం బ్యాంకుల పొదుపు ఖాతా (ఎస్‌బీ) డిపాజిట్లపైనా పడింది. ఈ ఖాతాల్లోని డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటును ప్రస్తుత మూడు శాతం నుంచి 2.75 శాతానికి తగ్గిస్తున్నట్టు ఎస్‌బీఐ ప్రకటించింది. ఈ నెల 15 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి వస్తుంది. అదనపు నిధుల సమీకరణ వ్యయం (ఎంసీఎల్ఆర్) ఆధారంగా ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును 7.75 శాతం నుంచి 7.40 శాతానికి తగ్గిస్తున్నట్టు తెలిపింది. ఈ తగ్గింపు ఈ నెల 10 నుంచి అమల్లోకి వస్తుంది. ఏడాది కాల పరిమితి ఉండే ఈ ఎంసీఎల్ఆర్ ఆధారిత వడ్డీ రేటు ఆధారంగానే బ్యాంకులు హోమ్ లోన్స్ వంటి రుణాలు ఇస్తుంటాయి. దీంతో 30 ఏళ్ల కాలపరిమితి ఉండే హోమ్ లోన్‌పై చెల్లించే ఈఎంఐ ప్రతి రూ.లక్షకు రూ.24 చొప్పున తగ్గుతుందని ఎస్‌బీఐ తెలిపింది.

## హైదరాబాద్ ఇళ్ల అమ్మకాల్లో 41 శాతం క్షీణత

న్యూఢిల్లీ: రియల్టీ జోరుకు కళ్లెం పడింది. కోవిడ్-19 ప్రభావం వల్ల జనవరి-మార్చి త్రైమాసికంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస గృహాల అమ్మకాలు 29 శాతం తగ్గగా హైదరాబాద్‌లో ఆ తగ్గుదల 41 శాతం ఉంది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో మూడు నెలల కాలంలో 3027 ఇళ్లు మాత్రమే అమ్ముడుపోయాయి. అమ్మకాల క్షీణతలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. రియల్టీ కన్సల్టింగ్ సంస్థ జేఎల్ఎల్ తాజా నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ఆర్థిక మందగమనం కారణంగా ప్రజలు ఇళ్ల కొనుగోలును వాయిదా వేసుకోవడం ఇందుకు కారణమని జేఎల్ఎల్ కంట్రీహెడ్, సీఈఓ రమేశ్ నాయర్ తెలిపారు. మొత్తం 7 నగరాల్లోనూ కలిపి ఇళ్ల అమ్మకాలు 29 శాతం తగ్గి 27,451కి పడిపోయాయి. అమ్మకం కాని ఇన్వెంటరీ 3.65 లక్షలకు పెరిగిపోయింది.

# ఢిల్లీలో తెలు'గోడు'

**24 రోజులుగా క్వారంటైన్‌లోనే 33 మంది.. నెగెటివ్ వచ్చినా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం**

గుంటూరు, ఏప్రిల్ 7: కరోనా వైరస్ ప్రపంచాన్ని చుట్టేస్తున్న నేపథ్యంలో ఇటలీ నుంచి స్వదేశానికి వచ్చిన తెలుగు విద్యార్థులు 24 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. 14 రోజుల క్వారంటైన్ పేరిట ఐటీబీపీ క్వార్టర్స్‌లోనే మగ్గుతున్న వారి గోడు పట్టించుకునేవారు కరువయ్యారు. ఇటలీలో ఉన్నత చదువులకు వెళ్లిన భారత విద్యార్థులు 214 మంది ప్రత్యేక విమానంలో మార్చి 14న ఢిల్లీకి చేరుకున్నారు. వారిలో 82 మంది తెలుగువారు కాగా 33 మంది ఏపీకి చెందిన వారు ఉన్నారు. వారిని ఢిల్లీలోనే క్వారంటైన్‌లో ఉంచి వివిధ దశల్లో పరీక్షలు నిర్వహించగా.. రిపోర్టులన్నీ నెగెటివ్ వచ్చాయి. అయినప్పటికీ వారిని స్వస్థలాలకు తరలించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఒకవైపు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్నా పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రత్యేక బస్సుల్లో తమ విద్యార్థులను తరలించాయి. తమను కూడా పంపాలని తెలుగు విద్యార్థులు ఆర్మీ అధికారులను కోరితే. క్లియరెన్స్ లెటర్ ఇస్తే పంపిస్తామని వారు స్పష్టం చేశారు. ఏపీ భవన్ అధికారులను సంప్రదిస్తే స్పందన లేదు. ఈ క్రమంలో వారి బాధలను వివరిస్తూ ఏబీఎన్ చానల్‌లో మంగళవారం ప్రత్యేక కథనం ప్రసారమైంది. వెంటనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం.. వారందరినీ ప్రత్యేక విమానం.. లేదంటే బస్సుల ద్వారా తరలిస్తామని ప్రకటించింది. ఏపీ మాత్రం స్పందించడం లేదని.. ఈనెల 16 వరకు అక్కడే ఉండాలంటూ ఏపీ భవన్ అధికారులు చెబుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

### హైదరాబాద్‌లో పెళ్లికి వచ్చి..

ఏఎస్‌రావునగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట్లో వివాహానికి హాజరైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు కుటుంబాలు ఇరవై రోజులుగా హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో ఇరుక్కుపోయి నానా అవస్థలు పడుతున్నాయి. స్థానిక బృందావన్ కాలనీకి చెందిన వి.టి. శ్రీనివాస్ కుమారుడి వివాహం మార్చి 21న స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జగన్నాధపురానికి చెందిన వి.జె.వి. రమణ, అంతర్వేదికి చెందిన డి.ప్రదీప్ కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు 15 మంది ఈ వివాహానికి వచ్చారు. 24న వారు తిరిగి వెళ్లవలసి ఉంది. అయితే మార్చి 22న జనతా కర్ఫ్యూ, 23 నుంచి లాక్‌డౌన్ ప్రకటించడంతో వారు ఇక్కడే ఉండిపోయారు. శ్రీనివాస్ ఇంట్లో ఇరుక్కొని ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. స్వస్థలాలకు పంపించాలని రాచకొండ కమిషనరేట్‌లో విన్నవించామని, లాక్‌డౌన్ నేపథ్యంలో వీలు కాదని వారు చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఏపీలోని 1902 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి బాధలు చెప్పుకొన్నా స్పందన లేదన్నారు.



## కరోనాపై యుద్ధానికి..!

ఇవేంటి? రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయని ఏవైనా గ్రహాంతర వాహకాలు రోడ్ల మీదకు వచ్చాయా అనుకోకండి! కరోనా మీద దండెత్తటానికి స్పైడర్ కిల్లర్ స్ప్రేయర్ వాహనాలు విజయవాడ వసున్న దృశ్యమిది. యాంటీ కరోనా ఆపరేషన్‌లో భాగంగా కృష్ణా జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఈ స్పైడర్ కిల్లర్ స్ప్రేయింగ్ వాహనాలను ఉపయోగిస్తోంది. రెండు రోజులుగా వీటితో పంచాయితీరాజ్ విభాగం గ్రామాల్లో స్ప్రే చేయిస్తోంది. ఈ విషయం తెలిసి విజయవాడ కార్పొరేషన్ సైతం నగరంలో స్ప్రే చేయించటానికి వీటిని మంగళవారం విజయవాడ రప్పించింది. గన్నవరం నుంచి జాతీయ రహదారి మీదుగా సాలెపురుగు ఆకారంలో ఉండే స్పైడర్ కిల్లర్ స్ప్రేయర్స్ వరుసగా వస్తుండటంతో 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. -విజయవాడ

## ప్రాణాలమీదకి తెచ్చిన కరోనా జాగ్రత్త

**▸▸ ఉమ్మెత్తకాయల రసం తాగడంతో కుటుంబం ఆసుపత్రిపాలు**

బైరెడ్డిపల్లె(చిత్తూరు), ఏప్రిల్ 7: ఉమ్మెత్త కాయలను నూరి నీటిలో కలిపి తాగితే కరోనా రాదని ఎవరో చెప్పడంతో ఓ కుటుంబం గుడ్డిగా నమ్మేసింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఎ.కొత్తూరుకు చెందిన వ్యవసాయ కూలీ నాగరాజు(50)కు ఉమ్మెత్త కాయల ద్రావణం కరోనాకు విరుగుడుగా పనిచేస్తుందని ఎవరో చెప్పారు. దీంతో ఆయన మంగళవారం ఆ కాయలను సేకరించి నూరి నీటిలో కలిపి తాను తాగడమే కాకుండా కుటుంబంలోని లక్ష్మమ్మ(45), సుధాకర్(25), గీత(20), భవాని(20), వెంకటమ్మ(70), హేమంత్(6), వెంకటేశ్(9)లకు ఇచ్చాడు. తాగిన కొద్ది సేపటికే వారంతా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## పట్టణాలకు అదనపు పారిశుధ్య కార్మికులు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థల పరిధిలో కరోనా వైరస్ నియంత్రణ చర్యలు మరింత పకడ్బందీగా సాగేందుకు తాత్కాలిక ప్రాతిపదికన అదనంగా పారిశుధ్య కార్మికులను నియమించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లకు అనుమతి ఇచ్చింది. కొత్తగా నియమించుకునే వారిని అత్యధికంగా 3 నెలలు మాత్రమే కొనసాగించాలని పురపాలక కమిషనర్ తన ఉత్తర్వుల్లో నిర్దేశించారు.

## సాగు అనుబంధ రంగాలకు మినహాయింపులు

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చింది. లాక్‌డౌన్ కాలంలో శాఖల వారీగా అనుసరించాల్సిన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రభుత్వ మద్దతు ధరలకు పంట ఉత్పత్తుల సేకరణ ఏజెన్సీలకు, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే మండీలకు మినహాయింపు ఇచ్చారు. ప్రభుత్వ పశువైద్య శాఖలు, పశువుల మందులకు మినహాయింపు ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయం, ఉద్యాన పంట ఉత్పత్తుల రవాణాకు అనుమతించారు.

## గుజరాత్‌లో చిక్కుకున్న జాలర్ల కోసం 10లక్షలు

లాక్‌డౌన్ కారణంగా గుజరాత్‌లోని వేరావల్ పోర్టులో చిక్కుకున్న 5వేల మంది ఏపీ వలస కార్మికులు, మత్స్యకారుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం అధికార బృందాన్ని పంపింది. ఆ బృందం వేరావల్ చేరుకుని వారి యోగక్షేమాలు తెలుసుకుని ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. వారి తక్షణ సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేసింది.

## 'ఉజ్వల'కే ఉచితం.. 95 శాతానికి అందని సాయం

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కరోనా దెబ్బకు ఎంతో మంది పేదలు ఉపాధి కోల్పోయారు. వారిని ఆదుకోవడమే లక్ష్యంగా కేంద్రంమూడు నెలలు వంట గ్యాసు ఉచితం అంటూ ప్రకటించింది. కానీ 'పీఎం ఉజ్వల యోజన' పథకం కింద కనెక్షన్ తీసుకొన్న వారికి మాత్రమే అంటూ ఉచితం మాటున ఓ షరతు విధించేసరికి రాష్ట్రంలోని 95% మంది వినియోగదారులు కంగుతిన్నారు. ఆంధ్రలో సుమారుగా 1.60 కోట్ల వంట గ్యాసు కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో ఉజ్వల పథకం కింద ఉన్నవి 4 లక్షలు మాత్రమే.

## కోవిడ్-19 కట్టడికి 120 కోట్లు: బుగ్గన

కడప, ఏప్రిల్ 7: రాష్ట్రంలో కరోనా నియంత్రణకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలవారీగా రూ.120 కోట్ల ప్రత్యేక నిధులను జిల్లాల వారీగా కలెక్టర్లకు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు.కరోనా కొంత పెరుగుతున్న నేపథ్యంలో పేదల సంక్షేమానికి రూ.1,300 కోట్లు కేటాయించామని తెలిపారు.

## అత్యవసర సేవలకు 104.. నిత్యావసరాలకు 1092

అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలకు సంబంధించి కరోనా పరీక్షా కేంద్రాలు, ఆస్పత్రుల గురించి, కరోనా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమాచారం అందించేందుకు ప్రభుత్వం 104 కాల్‌సెంటర్ ఏర్పాటు చేసిందని కోవిడ్ 19 రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 'ముక్క' షాపులు బంద్!

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కరోనా విస్తరిస్తోంది.. సామాజిక దూరం పాటించాలని మొత్తుకుంటున్నా వినకుండా చికెన్, మటన్ షాపుల ముందు క్యూ కడుతూనే ఉన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివారాలు మాత్రం ఆయా దుకాణాలు మూసివేయాలంటూ కొన్నిచోట్ల స్థానికంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అక్కడి మున్సిపల్ కమిషనర్ ఇదే నిర్ణయాన్ని తీసుకున్నారు. చికెన్, మటన్, రొయ్యలు, చేపల దుకాణాల ముందు విపరీతమైన రద్దీ ఉండడం, సామాజిక దూరం పాటించకపోవడం వల్ల ముందు జాగ్రత్తగా... ఆదివారాలు ఆయా షాపులను తెరవకూడదని ఆదేశించారు.

## నేతలు భౌతికదూరం పాటించాల్సిందే: హైకోర్టు

కరోనా వ్యాప్తి నియంత్రణ కోసం రాజకీయ నేతలు కూడా భౌతికదూరం పాటించాల్సిందేనని, లాక్‌డౌన్ నిబంధనలకు లోబడి నడచుకోవాల్సిందేనని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. లాక్‌డౌన్ సందర్భంగా సహాయ చర్యలను సమీక్షించేందుకు మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ధర్మశ్రీ మార్చి 30న చోడవరంలో అధికారులతో సమావేశం నిర్వహించారని, ఈ సందర్భంగా వారెవరూ భౌతిక దూరం పాటించలేదని వివరిస్తూ న్యాయవాది జి.లక్ష్మీనారాయణ ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. లేఖపై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో అలాంటి సమావేశాలు నిర్వహించకపోవడమే మేలని అభిప్రాయపడింది.

## 50% పింఛనుపై కౌంటర్ దాఖలు చేయండి

లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా విశ్రాంత ఉద్యోగులకు 50 శాతం పింఛను మాత్రమే అందజేయాలన్న నిర్ణయంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## కరోనా కట్టడికి మళ్లీ ఇంటింటి సర్వే: సీఎస్

కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానిత లక్షణాలున్న వారి నుంచి శాంపిల్స్ సేకరణ, పరీక్షల నిర్వహణ, కంటైన్మెంట్ ఆస్పత్రుల సన్నద్ధత అత్యంత ప్రాధాన్యత అంశాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ప్రకటించారు. కరోనా వైరస్‌పై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మరోసారి ఇంటింటి సర్వే ప్రక్రియను 3రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

### అద్దెకు వెంటిలేటర్లు

కరోనా రోగుల కోసం ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న ప్రయివేటు ఆస్పత్రుల్లోని వెంటిలేటర్లను రాష్ట్ర, జిల్లాస్థాయి ఆస్పత్రులకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దానికి సరిపడా అద్దె చెల్లించేందుకు అంగీకరించింది. కాగా, కరోనా సహాయక చర్యల్లో ఇతర శాఖలకు మాదిరిగానే అటవీశాఖలోని అన్ని స్థాయిల యూనిఫాం సిబ్బంది విధిగా పాల్గొనాలని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి ప్రతీప్‌కుమార్ ఆదేశించారు.

**▸▸ కూరలు.. కోడి.. గుడ్లు..!**



విజయనగరం జిల్లా ద్వారపూడి గ్రామంలో 500 కుటుంబాలకు 6కిలోల కాయగూరలు, 12 కోడిగుడ్లతో పాటు ఒక కోడి చొప్పున జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బొద్దల నర్సింగరావు మంగళవారం పంపిణీ చేశారు.

# 'మూడో' దశలోకి!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో... రాష్ట్రంలో కరోనావ్యాప్తి 3వ దశ ప్రారంభంలో ఉందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి చెప్పడం గమనార్హం. సోమవారం కొత్తగా 11 కరోనా కేసులు బయటపడగా.. అందులో గుంటూరు జిల్లాకు చెందిన వారే 9 మంది ఉన్నారు. రాష్ట్రంలో మొత్తం బాధితుల సంఖ్య 314కు చేరింది. మార్చి 31నాటికి మొత్తం కేసులు 44 మాత్రమే కాగా.. ఏడు రోజుల వ్యవధిలోనే ఆరు రెట్లు పెరగడం గమనార్హం. గుంటూరు జిల్లాలో ఇప్పటికి 41 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. జిల్లాలో మంగళవారం నమోదైన కేసుల్లో... 15రోజుల క్రితం విదేశాల నుంచి గుంటూరుకు వచ్చిన మహిళ ఉన్నారు. ఆమె కుటుంబ సభ్యులను అధికారులు క్వారంటైన్‌కు తరలించనున్నారు. మర్కజ్ నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వ్యక్తి కుమార్తె (16)కు కూడా వైరస్ సోకింది. మంగళవారం పాజిటివ్ వచ్చిన మరో ఐదుగురికి కూడా 'ఢిల్లీ కనెక్షన్' ఉన్నట్లు గుర్తించారు. ఇక... విదేశాలు, ఢిల్లీ ప్రయాణంతో సంబంధం లేని డాక్యుమెంట్ రైటర్‌కు, ఆయన ద్వారా ఒక స్నేహితుడికీ వైరస్ సోకినట్లు తేలింది. కడప జిల్లా ప్రొద్దుటూరులోనూ మరొకరికి కరోనా సోకినట్లు నిర్ధారణయింది. ఇతనికి ఢిల్లీ కనెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో జిల్లాలో బాధితుల సంఖ్య 28కి చేరింది. నెల్లూరులోనూ ఒకరికి కరోనా వైరస్ సోకి మొత్తం కేసుల సంఖ్య 43కు చేరింది. కర్నూలులో శుక్రవారం మరణించిన వ్యక్తికి కరోనా సోకినట్లు సోమవారం నిర్ధారించారు. దీంతో రాష్ట్రంలో కోవిడ్ మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది.

### మూడో దశ మొదలు...

రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి మూడో దశ ప్రారంభంలో ఉందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ సర్వైలెన్స్ (సామాజిక నిఘా), వ్యాధి నిర్ధారణ పరీక్షల సామర్థ్యం పెంపు, భవిష్యత్ అవసరాల మేరకు ఆస్పత్రులను సిద్ధం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. "ఇప్పటికే విదేశాల నుంచి వచ్చిన సుమారు 29 వేల మందిని, ఢిల్లీ మర్కజ్ సమావేశాలకు వెళ్లిన సుమారు వెయ్యి మందిని గుర్తించి.. వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాం. 304 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. వాటిలో 280 కేసులు మర్కజ్‌తో ముడిపడినవే. మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారి ద్వారా వారి కుటుంబీకులకు, వారి ద్వారా బంధుమిత్రులకు వైరస్ వ్యాప్తి చెందుతున్నట్టు గుర్తించాం" అని తెలిపారు. వీరంతా కలిపి మొత్తం 3,500 మంది ఉన్నారని, వీరి శాంపిల్స్ తీసుకుని పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఇంటింటి సర్వే ద్వారా మరో 5 వేల మందిని గుర్తించామని, వైద్యాధికారుల సూచనల మేరకు వారిలో 1,800 నుంచి 2,000 మందికి పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. 65 ఏళ్ల వయసు వారు, హైపర్ టెన్షన్, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడుతూ హై రిస్క్ కేటగిరీలో ఉన్నవారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించి ఆంక్షలు విధించామని, లాక్‌డౌన్ ఉన్నా లేకున్నా గుంటూరు, విజయవాడ నగరాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా హాట్‌స్పాట్‌లలో ఆంక్షలు కొనసాగుతాయన్నారు. 'ప్రస్తుతం రోజుకు వెయ్యి శాంపిళ్లను పరీక్షించగలుగుతున్నాం. మొత్తంగా 2 లక్షల టెస్టులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే 3 లక్షల ర్యాపిడ్ టెస్ట్ కిట్లకు ఆర్డర్లు ఇచ్చాం. ప్రతి జిల్లాకో కోవిడ్ ఆస్పత్రి ఏర్పాటు చేశాం. రాష్ట్రస్థాయిలో 4 కోవిడ్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో పనిచేసే వైద్యులు, నర్సులు, సిబ్బందిని అవసరం మేరకు నియమించాం" అని తెలిపారు. వారందరికీ 12 వేల పీపీఈలు, 20 వేల ఎన్95 మాస్కులు, 40 లక్షల గ్లౌజులు, 12 లక్షల సర్జికల్ మాస్కులు, ఇతర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచామని వివరించారు.

**జిల్లాల వారీగా కేసుల వివరాలు....**

| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
|---|---|---|
| అనంతపురం | 6 | |
| చిత్తూరు | 17 | |
| తూర్పు గోదావరి | 11 | 1 |
| గుంటూరు | 41 | |
| కడప | 28 | |
| కృష్ణా | 29 | 2 |
| కర్నూలు | 74 | |
| నెల్లూరు | 43 | 1 |
| ప్రకాశం | 24 | 1 |
| విశాఖపట్నం | 20 | 1 |
| పశ్చిమగోదావరి | 21 | |
| మొత్తం | 314 | 6 |

### అది కరోనా మరణమే

'ఆంధ్రజ్యోతి' కథనంపై ప్రభుత్వం స్పందన

కర్నూలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'కరోనాతో చెలగాటం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కర్నూలులో తొలి కరోనా మరణం నిజమేనని వెల్లడిస్తూ అధికారికంగా లేఖ విడుదల చేసింది. జిల్లాకు చెందిన 45ఏళ్ల పేషెంట్ ఏప్రిల్ 1న కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. వెంటనే కోవిడ్-19 పరీక్షల నిమిత్తం అతని నమూనాలను వైద్యులు సేకరించారు. ఆ వ్యక్తికి అంతకుముందే డయాబెటిస్ ఉన్నట్లు వైద్యశాఖ నిర్ధారించింది. కోవిడ్ పాజిటివ్ నిర్ధారించిన ఈ పేషెంట్ చికిత్స తీసుకుంటూ 3న కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని ఐసొలేషన్ వార్డులో మృతి చెందాడని ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఆయనకు ఢిల్లీ ప్రయాణంతో ఏ సంబంధం లేదని ధ్రువీకరించింది. కాగా, కర్నూలు జిల్లాలో లాక్‌డౌన్ ప్రక్రియను మరింత కఠినతరం చేశారు. ఇప్పటికే ఈ జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య 74కు చేరిన సంగతి తెలిసిందే. ఆయా ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించిన అధికారులు ఆంక్షలను కట్టుదిట్టం చేశారు. నంద్యాలలో 48 గంటల నిర్బంధ కర్ఫ్యూ విధించగా మిగిలిన ప్రాంతాల్లో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.



## కరోనా దాస్తే దాగేది కాదు

**▸▸ బాబు పరాయిరాష్ట్రంలో ఉన్నారు**

**▸▸ మంత్రి పేర్ని నాని ఆగ్రహం**

విజయవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోవిడ్ వైరస్‌ను దాచిపెట్టాల్సిన అవసరం లేదని, అది దాస్తే దాగేది కూడా కాదని రాష్ట్ర రవాణా, సమాచార, పౌరసంబంధాల మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ఎవరికివారు ప్రయత్నాలు చేస్తున్నారని, ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, నర్సులు, సిబ్బందికి మాస్కులు, గ్లౌజులు లేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి మంగళవారం సాయంత్రం విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. పరాయి రాష్ట్రంలో హోం క్వారంటైన్‌లో ఉన్న నాయకుడు (చంద్రబాబు).. ఇక్కడ కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు చేయడం లేదని, అంతా దాచిపెడుతున్నారంటూ విమర్శలు చేస్తున్నారని, ఆయన ఈ రాష్ట్రంలో ఉండడం లేదు కాబట్టి ఇక్కడ ఏం జరుగుతుందో ఆయనకు తెలియడం లేదని అన్నారు. నర్సీపట్నానికి చెందిన ఒక డాక్టరు సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. 'అతను డాక్టరా? రాజకీయ నాయకుడా? ఆ డాక్టరు గాడికి బలుపు ఎక్కువ కాకపోతే.. తెలంగాణలో బాగా చేస్తున్నారు.. ఇక్కడ బాగా చేయడం లేదని ముఖ్యమంత్రుల గురించిమాట్లాడతాడా' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# రెడ్‌జోన్స్‌లో ర్యాండమ్ పరీక్షలు



## వైజాగ్ తరహాలో జరపాలి.. వీలైతే హాట్‌స్పాట్‌లలో కూడా

**▸▸ క్వారంటైన్ కేంద్రాలు, ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు: సీఎం జగన్**

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా వైజాగ్ తరహాలో రెడ్‌జోన్ ప్రాంతాల్లో ర్యాండమ్ వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో క్రమంగా కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన అధికారులను, వైద్యులను అభినందించారు. ఇలాంటి తరుణంలో మరికొద్ది రోజులు మరింత శ్రద్ధ తీసుకుంటే.. కోవిడ్-19ను నివారించి దేశానికే ఆదర్శంగా నిలుస్తామని అన్నారు. మంగళవారమిక్కడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కరోనా నివారణ చర్యలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి తిరిగివచ్చిన వారూ .. వారి ప్రైమరీ కాంటాక్టు పరీక్షలు పూర్తయ్యాక ఎవరెవరికీ పరీక్షలు నిర్వహించాలన్న విషయమై చర్చ జరిగింది. కుటుంబ సర్వే ద్వారా జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పిలాంటి ఏదో ఒక లక్షణంతో బాధపడుతున్నవారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. వైజాగ్ తరహాలోనే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ర్యాండమ్ సర్వే జరగాలని సీఎం ఆదేశించారు. హాట్‌స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ర్యాండమ్ సర్వేపైనా కూడా దృష్టి సారించాలని కోరారు.క్వారంటైన్ కేంద్రాల్లో సదుపాయాలు, వసతులను పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. క్రిటికల్ కేర్ కోసం నిర్దేశించిన కోవిడ్ -19 ఆస్పత్రులు సన్నద్ధంగా ఉండాలన్నారు. క్వారంటైన్ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు వసతులు మెరుగుపరచాలని కోరారు.

**వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ పై ప్రత్యేక దృష్టి**

వ్యవసాయోత్పత్తుల మార్కెంగ్‌పై ప్రత్యేక దృష్టిని సారించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను జగన్ ఆదేశించారు. వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని .. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పారు. ప్రతి రోజూ కనీసం 150 ట్రక్కుల అరటిని ఎగుమతి చేస్తున్నామన్నారు. టమాట విషయంలో ఇబ్బందులు తొలగాయన్నారు. ఆక్వా ఎగుమతులు పెరిగాయన్నారు.

### 'ఢిల్లీ'వారికి పరీక్షలు పూర్తి!

రాష్ట్రంలో నమోదైన పాజిటివ్ కేసుల వివరాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అందించారు. సోమవారం సాయంత్రం అయిదు గంటల నుంచి మంగళవారం ఉదయం వరకూ 150 కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని.. ఒకే పాజిటివ్ కేసు వచ్చిందని అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో మొత్తం 997 మందికి పరీక్షలు నిర్వహిస్తే ఇందులో 196 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. తబ్లీగీ జమాత్‌కు వెళ్లి వచ్చిన వారితో ప్రైమరీ కాంటాక్టు అయి.. మూడు నాలుగు గంటలకు వారితో కలసి ప్రయాణం చేసిన వారిని గుర్తించి 2,400 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తే.. వారిలో 84 మందికి పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ప్రైమరీ కాంటాక్టులో ఉన్నవారిలో 280 కేసులు పాజిటివ్ వచ్చాయన్నారు. విదేశాల నుంచి వచ్చిన 205 మందికి పరీక్షలకు నిర్వహిస్తే.. 11 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. వారితో కాంటాక్టు అయిన 120 మందిని పరీక్షిస్తే.. వీరిలో ఆరుగురు పాజిటివ్‌గా తేలారని.. కరోనా లక్షణాలు కలిగిన 134 మందికి పరీక్షలు చేస్తే .. వారిలో ఏడుగురికి నెగిటివ్ ఉందని వెల్లడైందని తెలిపారు. వలంటీర్లు, ఏఎన్ఎం, హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పర్యవేక్షణలో లక్ష మంది హోం క్వారంటైన్‌లో ఉన్నారని చెప్పారు. అకాల వర్షాలపై సీఎం ఆరా తీశారు. బాధిత రైతులను గుర్తించి ఆదుకోవాలన్నారు.



# ట్రూనెట్‌తో కరోనా టెస్ట్

**285 కేంద్రాల్లో వైరస్ పరీక్షలు.. వేగం పుంజుకోనున్న నిర్ధారణ**

**▸▸ రోజుకు 7వేల నమూనాల పరిశీలన.. టీబీ కేంద్రాల్లోని యంత్రాల వినియోగం**

**▸▸ ఐసీఎంఆర్ సూచనల మేరకు చర్యలు**

అమరావతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కరోనా నిర్ధారణ పరీక్షల ప్రక్రియ వేగం పుంజుకోనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం ఏడు ప్రయోగశాలల్లో కలిపి 1200కు మించి పరీక్షలు చేయలేని అవస్థ తొలగిపోనుంది. ఐసీఎంఆర్ సూచనల మేరకు క్షయ (టీబీ) నిర్ధారణ కేంద్రాలలోని ట్రూ నెట్ యంత్రాల ద్వారా కరోనా పరీక్షలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించుకుంది. ఇవి అందుబాటులోకి వస్తే... రోజుకు ఏడువేల కరోనా నిర్ధారణ పరీక్షలు చేయవచ్చు. రాష్ట్రంలో 240 ట్రూనెట్ సెంటర్లు ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లా కేంద్రాల్లో మరో 45 సీబీ నెట్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. వెరసి... రాష్ట్రంలో మొత్తం 285 ట్రూనెట్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు వీటిని కరోనా నిర్ధారణ పరీక్ష కోసం ఉపయోగించుకోనున్నారు. ఇప్పటికే తిరుపతి ట్రూనెట్ కేంద్రంలో ప్రయోగాత్మకంగా కరోనా పరీక్షలు చేశారు. ఈ ఫలితాలను కరోనా ల్యాబ్‌లలో కూడా పరీక్షించారు. రెండుచోట్ల ఒకే రకమైన రిపోర్టులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే విధంగా మరొక ట్రూనెట్ సెంటర్‌లో కూడా పరీక్షలు నిర్వహిస్తారు. అక్కడ కూడా ఫలితాలు ఒకే రకంగా వస్తే, పూర్తి స్థాయిలో ట్రూనెట్ సెంటర్లను కరోనా నిర్ధారణ కోసం ఉపయోగిస్తారు.

### రోజుకు 12 గంటలు...

ట్రూనెట్ మిషన్ల ద్వారా గంటకు రెండు పరీక్షలు చేయవచ్చు. రోజుకు 12 గంటల పాటు వీటిని ఉపయోగించవచ్చు. అంటే... ఒక్కో మిషన్‌తో రోజుకు 24 శాంపిల్స్‌ను పరీక్షించవచ్చు. వెరసి... 285 యంత్రాలతో రోజుకు 6840 మందికి కరోనా పరీక్షలు నిర్వహించవచ్చు. ప్రభుత్వం ఇప్పటికే రెండు లక్షల మందికి కరోనా స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించింది. ట్రూనెట్ మిషన్లను ఉపయోగించినట్లయితే కేవలం 20 రోజుల్లో స్క్రీనింగ్ మొత్తం పూర్తి చేయవచ్చు. అలాకాకుండా ఇప్పుడున్న ల్యాబ్స్ ద్వారా రెండు లక్షల మందికి స్క్రీనింగ్ ఆరు నెలలు దాటుతుంది. ట్రూనెట్ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలంటే... ఇందుకు అవసరమైన కరోనా కిట్లు అత్యవసరంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఏడు ల్యాబ్స్‌కే పూర్తిస్థాయిలో కిట్లు పంపిణీ చేయలేక ప్రభుత్వం చేతులెత్తేస్తోంది.

### పాజిటివ్ వస్తే మరోసారి నిర్ధారణ...

మరోవైపు ట్రూనెట్ సెంటర్లతో ఒక చిన్న సమస్య ఉంది. ఈ మిషన్లు స్క్రీనింగ్‌కు మాత్రమే ఉపయోగపడతాయి. ఈ మిషన్లలో కరోనా పాజిటివ్‌గా వచ్చిన శాంపిల్‌ను మరోసారి కరోనా కోసం ఏర్పాటు చేసిన ల్యాబ్‌కు పంపాలి. అక్కడ కూడా పాజిటివ్ వస్తేనే ఆ వ్యక్తికి కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారిస్తారు. 'నెగెటివ్' విషయంలో ఈ ప్రక్రియ అక్కర్లేదు. 240 ట్రూనెట్ సెంటర్లలో 15 చోట్ల మాత్రమే అత్యంత నాణ్యమైన యంత్రాలున్నాయి. అక్కడ చేసిన టెస్టులను మరోసారి నిర్ధారణ కోసం పంపించాల్సిన అవసరం లేదు. మిగిలిన 225 ట్రూనెట్ మిషన్లలో పరీక్షించిన శాంపిల్స్‌లో పాజిటివ్ వస్తే మాత్రం మరోసారి పరీక్షించాల్సి ఉంటుంది. ట్రూనెట్ సెంటర్లలో కరోనా పరీక్షలను గురువారం నుంచే నిర్వహించే అవకాశాలున్నాయి.

## కరోనా కల్లోలం

# గల్ఫ్ ఎన్నారైలకు కరోనా కష్టాలు



కువైత్‌లో దిగ్బంధించిన ప్రాంతంలో వేసేందుకు తెచ్చిన ముళ్ల కంచె

**▸▸ స్వీయ నిర్బంధంలోనూ వైరస్ వ్యాప్తి**

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లిన ప్రవాస భారతీయులకూ కరోనా కష్టాలు తప్పడం లేదు. దుబాయ్, కువైత్, బహ్రెయిన్, ఖతర్, సౌదీ అరేబియా తదితర దేశాల్లో స్వీయ నిర్బంధంలో ఉన్నప్పటికీ వైరస్ సోకుతోంది. దీనికి ప్రధాన కారణం అక్కడి లేబర్ క్యాంపుల్లోని ఇరుకైన గదులేనని అధికారులు గుర్తించారు. విదేశీ కార్మికులు నివసించే ఈ క్యాంపుల్లో భౌతిక దూరం పాటించడం అసాధ్యమని నిర్ధారణకు వచ్చారు. దుబాయ్‌లో అల్‌రాస్, నాయిఫ్ ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయ ఉద్యోగుల్లో చాలా మందికి పాజిటివ్ రావడంతో వీరిని క్వారంటైన్‌కు తరలిస్తున్నారు. అల్‌ఖోజ్, బర్ దుబాయ్, జబల్ అలీ ప్రాంతాల్లో భారీ స్థాయిలో నివసిస్తున్న తెలుగు కార్మికులంతా ఆంక్షల మధ్య నివసిస్తున్నారు. ఖతర్‌లోనూ తెలుగు కార్మికులు భారీ సంఖ్యలో నివసిస్తున్న సనయ్యా ప్రాంతంలో పూర్తి దిగ్బంధం కొనసాగుతోంది. కువైత్‌లోని కరోనా బాధితుల్లో భారతీయ కార్మికులే ఎక్కువగా ఉండటంతో కువైతీలు కన్నెర్ర చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రవాసీయులు ఎక్కువగా నివసిస్తున్న మహెబులా ప్రాంతాన్ని కువైత్ సైన్యం దిగ్బంధం చేసింది. మహెబులాలో బిహార్‌కు చెందిన ప్లంబర్‌కు తొలుత కరోనా సోకింది. తర్వాత మరింత మంది భారతీయులకు వైరస్ వ్యాపించడంతో వారి క్యాంపులోని వారిని ఆస్పత్రికి తరలించారు. బహ్రెయిన్‌లో 100 మంది భారతీయులు కోవిడ్-19 బారిన పడ్డారు. సౌదీ అరేబియాలో రియాద్, దమ్మామ్, హోఫుఫ్, జెద్దా, తైఫ్, ఖోబార్ ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు.

## పొడిగింపు దిశగా ఆలోచిస్తున్నాం

**▸▸ లాక్‌డౌన్‌పై కేంద్ర ప్రభుత్వ స్పందన**

**▸▸ వచ్చే వారం రోజులు దేశానికి కీలకం: వెంకయ్య**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ పొడిగింపు దిశగా అడుగులు పడుతున్నాయి. చాలా రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 14కు మించి పొడిగించాలని కోరుతున్నాయని, నిపుణులు కూడా అదే సూచిస్తున్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తాము కూడా పొడిగింపు దిశగా ఆలోచిస్తున్నట్లు వెల్లడించాయి. అయితే, పొడిగింపుపై తుది నిర్ణయమేదీ తీసుకోలేదని, దానిపై ఊహాగానాలకు వెళ్లొద్దని ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ చెప్పారు. మార్చి 25న నుంచి 21 రోజుల లాక్‌డౌన్ దేశంలో కొనసాగుతోంది. నిత్యావసరాలను, అత్యవసర సేవల సిబ్బందిని మాత్రమే రోడ్ల మీదకు అనుమతిస్తున్నారు. లాక్‌డౌన్ ఏప్రిల్ 14తో ముగియాల్సి ఉంది. అయితే, కరోనా వ్యాప్తి కొనసాగుతుండటంతో లాక్‌డౌన్ ఎత్తేస్తే పరిస్థితి ఘోరంగా తయారవుతుందని దేశవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ప్రధాని మోదీ దేశ ప్రజలను సుదీర్ఘ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మరోవైపు తెలంగాణ సీఎం కేసీఆర్ లాక్‌డౌన్‌ను పొడిగించాలని కేంద్రాన్ని కోరారు. తాజాగా మంగళవారం కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు కూడా పొడిగింపు మంత్రం పఠించాయి. కర్ణాటకలో రెడ్‌జోన్లు అనేకం ఉన్నందున లాక్‌డౌన్‌ను ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించాలని వైద్య మంత్రి సుధాకర్ కోరారు. లాక్‌డౌన్ పొడిగింపు ఉంటుందని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచనప్రాయంగా చెప్పారు. లాక్‌డౌన్‌ను దశలవారీగా ఎత్తేస్తామని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహలోత్ ప్రకటించారు. కాగా, వచ్చే ఏడు రోజులు దేశ ప్రజలకు కీలకమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ ఏడు రోజుల ప్రగతిని బట్టే లాక్‌డౌన్ ఎత్తివేత వ్యూహం ఉంటుందని చెప్పారు. కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, కేంద్రంలోని వివిధ శాఖలకు ఉద్యోగులు రావడానికి అనుమతించాలని ఇటీవలే ప్రధాని మోదీ నిర్ణయించారు. దశల వారీగా లాక్‌డౌన్ ఎత్తేస్తారని, హాట్ స్పాట్‌లుగా గుర్తింపు పొందిన ప్రాంతాల్లోనే లాక్‌డౌన్ కొనసాగుతుందని అంటున్నారు. ఏప్రిల్ 14న లాక్‌డౌన్‌ను ఎత్తేయాలని ముందుగా భావించారని, అయితే తబ్లీగీ జమాత్ ద్వారా కరోనా వైరస్ విస్తరణ పరిస్థితి సంక్లిష్టంగా మారిందని ఒక అధికారి చెప్పారు. పైగా స్పెయిన్‌లో మరణాల సంఖ్య తీవ్రంగా మారడంతో పునరాలోచనలో ఉన్నామని తెలిపారు.

## రాష్ట్రాలకు ఓవర్‌డ్రాఫ్ట్ నిబంధనల సడలింపు

**▸▸ సెప్టెంబరు 30 దాకా వర్తింపు: రిజర్వ్ బ్యాంకు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: లాక్‌డౌన్‌తో ఆదాయాన్ని కోల్పోతున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రిజర్వ్ బ్యాంకు ఓవర్‌డ్రాఫ్ట్ నిబంధనలను సడలించింది. నెలో 14 పని దినాల నుంచి 21 పని దినాలకు.. త్రైమాసికంలో 36 పని దినాల నుంచి 50 పని దినాలకు ఓవర్‌డ్రాఫ్ట్ గడువును పొడిగించింది. ఈ సడలింపు సెప్టెంబరు 30వ తేదీ వరకు అమల్లో ఉంటుందని పేర్కొంది.

## దేశంలో 26 వేల సహాయ శిబిరాలు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: లాక్‌డౌన్‌తో ఇబ్బంది పడుతున్న పేదలు, చిక్కుకుపోయిన వలస కార్మికుల కోసం 578 జిల్లాల్లో 26,476 సహాయ శిబిరాలు పని చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇందులో కోటి మందికిపైగా ఆశ్రయం కల్పించి, ఆహారం అందిస్తున్నామని వివరించింది. కేంద్ర హోంశాఖలో అదనపు కార్యదర్శి జ్ఞానేశ్‌కుమార్ మంగళవారం ఈ మేరకు కోర్టుకు నివేదిక సమర్పించారు. పౌరహక్కుల నేతలు హర్ష్ మందర్, అంజలీ భరద్వాజ్ దాఖలు చేసిన పిల్‌ను సీజే బోబ్డే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. కాగా, కరోనా నేపథ్యంలో 50 ఏళ్లు పైబడిన ఖైదీలకు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి మధ్యంతర బెయిల్ లేదా పెరోల్ ఇవ్వాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించబోమని కోర్టు తెలిపింది. ఖైదీల దరఖాస్తులను ప్రభుత్వాలు పరిశీలించి విడివిడిగా నిర్ణయాలు తీసుకోవాలని బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. బ్రిటన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులను స్వదేశానికి రప్పించాలన్న వ్యాజ్యంపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులిచ్చింది.

## కరోనా తగులుగాక.. జడ్జికి లాయర్ శాపం

కోల్‌కతా, ఏప్రిల్ 7: బస్సు వేలం నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వనందుకు అసహనానికి గురైన న్యాయవాది ఏకంగా న్యాయమూర్తికి కరోనా తగలాలని శాపనార్థాలు పెట్టారు. ఈ ఘటన కోల్‌కతా హైకోర్టు వీడియో కాన్ఫరెన్స్ విచారణలో చోటు చేసుకుంది. వాయిదాలు చెల్లించని ఓ బస్సును బ్యాంకు వారు జనవరి 15న సీజ్ చేసి వేలానికి పెట్టారు. లాయర్ బిజోయ్ అధికారి స్టే కోరగా జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా తిరస్కరించారు. దీంతో బిజోయ్ ఆగ్రహంతో మైక్రోఫోన్‌ను విసిరేసి జడ్జికి శాపనార్థాలు పెట్టారు. దీనిపై 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## సీబీఎస్ఈ 11వ తరగతిలో 3 కొత్త సబ్జెక్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: సీబీఎస్ఈ పదకొండో తరగతిలో వచ్చే విద్యాసంవత్సరం(2020-21) నుంచి మరో మూడు కొత్త సబ్జెక్టులు చేరనున్నాయి. అవి డిజైన్ థింకింగ్, ఫిజికల్ యాక్టివిటీ ట్రైనింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.

## 'ఫేషియల్ రికగ్నిషన్'కు భారతీయులు ఓకే

ముంబై, ఏప్రిల్ 7 : ముఖం ఆధారంగా వ్యక్తిని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వాడకంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్నా.. భారతీయులు మాత్రం సానుకూలంగానే ఉన్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ 'నార్టన్‌లైఫ్‌లాక్' సర్వేలో తేలింది. 1000 మంది అభిప్రాయాలను సేకరించగా, వారిలో నాలుగింట మూడోవంతు మంది తామంతా 'ఫేషియల్ టెక్'కు అనుకూలమేనని స్పష్టం చేశారు. ఈ పరిజ్ఞానాన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ పథకాల అయితే వినియోగదారుల సమాచార గోప్యతకు భంగం వాటిల్లే అవకాశాలు ఉంటాయని 58% మంది ఆందోళన వ్యక్తం చేశారు.

## 17 వర్క్‌షాపుల్లో రోజుకు 1000 పీపీఈలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: వైద్యులకు వైరస్ నుంచి రక్షణ కల్పించే పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ సూట్ (పీపీఈ)ల తయారీకి రైల్వే శాఖ సిద్ధమైంది. డీఆర్డీవో అనుమతి లభించిన నేపథ్యంలో రోజుకు 1000 పీపీఈలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 17 వర్క్‌షాపుల్లో వీటిని తయారు చేయనుంది. రైల్వే ఆస్పత్రుల్లో కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు, ఇతర పారామెడికల్ సిబ్బందికి ఈ పీపీఈలను అందజేయనున్నట్లు రైల్వే శాఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. తమ వర్క్‌షాపుల్లో తయారు చేసిన పీపీఈల్లో 50 శాతం దేశంలోని ఇతర వైద్య సిబ్బందికి కూడా అందజేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది.

## తెలంగాణలో 400 దాటిన కరోనా కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణలో మరో 40కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం నాటికి రాష్ట్రంలో కేసుల సంఖ్య 404కు చేరింది. తాజా కేసులన్నీ మర్కజ్‌తో సంబంధమున్నవేనని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 348 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 45మంది డిశ్చార్జ్ కాగా 11మంది కరోనాతో చనిపోయారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. అతని కుటుంబంలోని వ్యక్తే ఢిల్లీ వెళ్లి రావడంతో కుటుంబంలో 18మందికి పరీక్ష చేయగా, 19 ఏళ్ల యువకుడికి కరోనా బయటపడింది. ఢిల్లీవెళ్లిన వ్యక్తికి మాత్రం రాలేదు. ఢిల్లీ నుంచి గుంటూరు వెళ్లిన వ్యక్తి మరణంతో ఆయనతోపాటు బోగీలో ప్రయాణించిన ముగ్గురు వరంగల్ అర్బన్ జిల్లా వాసులను, వారి కాంటాక్టులు పదిమందిని క్వారంటైన్‌కు పంపారు. జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒకరు ఢిల్లీ వెళ్లి వచ్చి, విధుల్లో పాల్గొంటున్నారు. విషయం తెలిసి ఆయన్ను క్వారంటైన్‌కు పంపారు. పాజిటివ్ వచ్చిన సైఫాబాద్ హెడ్ కానిస్టేబుల్‌తో కలిసి పనిచేసిన ఇద్దరు ఎస్‌ఐలు, ఒక ఏఎస్ఐ, 8 మంది టి. స్పెషల్ పోలీసులు, స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు ఇద్దరు, నలుగురు కానిస్టేబుళ్లను క్వారంటైన్‌లో ఉంచారు. 12మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు అధికారులకు పరీక్షలు చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ కంటి వైద్యుడు ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లి వచ్చి, విషయాన్ని గోప్యంగా ఉంచి విధుల్లో చేరి, పేషంట్లను చూడటంపై ఆసుపత్రి డైరెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్యుడిపై 176, 188, 270, 271 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అదృష్టవశాత్తు ఆయనకు నెగటివ్ వచ్చింది. మహబూబ్‌నగర్ పట్టణంలో 23రోజుల పసికందుకు కరోనా సోకింది. తండ్రి మర్కజ్‌కు వెళ్ళిరావడంతో అతని ద్వారా ఈ మగ శిశువుకు వైరస్ సోకింది. ఆయన ట్యూషన్ చెప్పే పిల్లల తల్లిదండ్రులిద్దరికి కూడా మంగళవారం పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

## నిలకడగా బ్రిటన్ ప్రధాని ఆరోగ్యం

**▸▸ స్వయంగా శ్వాస తీసుకుంటున్నారు**

**▸▸ న్యుమోనియా లక్షణాలు లేవు**

**▸▸ ముందు జాగ్రత్త కోసమే ఐసీయూ చికిత్స**

**▸▸ టెన్ డౌనింగ్ స్ట్రీట్ వర్గాల వెల్లడి**

**▸▸ బోరిస్ కోలుకోవాలని మోదీ ఆకాంక్ష**



లండన్, ఏప్రిల్ 7: కరోనా బారిన పడి ఐసీయూలో చికిత్స పొందుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ పరిస్థితి ప్రస్తుతానికి నిలకడగా ఉందని.. ఎలాంటి ఉపకరణాల సాయం లేకుండానే ఆయన ఊపిరి పీల్చుకోగలుగుతున్నారని బ్రిటన్ సర్కారు ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనకు న్యూమోనియా లక్షణాలు లేవని.. ముందుజాగ్రత్త చర్యగానే వైద్యులు ఆయనను ఐసీయూకు తరలించారని పేర్కొంది. బోరిస్ ఆరోగ్య పరిస్థితి గురించి ఎలిజబెత్ రాణికి వైద్యవర్గాలు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాయి. ఆయనకు 4 లీటర్ల ఆక్సిజన్ అందించినట్టు వార్తలు వస్తుండటంతో బోరిస్ ఆరోగ్య పరిస్థితి గురించి సర్కారు నిజాలు దాచిపెడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోరిస్ జాన్సన్ ఆఖరుసారి గురువారం నాడు కనిపించారని, ఆ తర్వాత ఆయన మీడియాకు కనిపించలేదంటే పరిస్థితి తీవ్రంగా ఉన్నట్టేనని కొందరంటున్నారు. కాగా.. బోరిస్‌ను త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో చూస్తానన్న ఆశాభావాన్ని భారత ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తం చేశారు. ఇక, కరోనా వైరస్‌పై పోరులో తయారుచేస్తున్న ప్రయోగాత్మక ఔషధాలను బోరిస్‌కు పంపాలని అమెరికాలోని ఔషధ కంపెనీలను కోరినట్టు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. బోరిస్ జాన్సన్ త్వరగా కోలుకోవాలని ట్రంప్ కుమార్తె ఇవాంక, జపాన్ ప్రధాని షింజో అబే, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, రష్యా అధ్యక్షుడు పుతిన్, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ తదితరులు ఆకాంక్షించారు. ఇక.. బ్రిటన్ ప్రధాని, ఆరోగ్యమంత్రి ఇప్పటికే కరోనా బారిన పడగా.. తాజాగా మరో మంత్రి గోవే ఐసోలేషన్‌లోకి వెళ్లారు.

# భారతీయులూ విలవిల

## హాట్‌స్పాట్లలోనే ఎక్కువగా భారత సంతతి.. అమెరికాలో నలుగురు తెలుగువారు మృతి

**▸▸ న్యూజెర్సీలో 30మందికి పాజిటివ్?**

(న్యూయార్క్ నుంచి కిలారు అశ్వనీ కృష్ణ)

అమెరికాను కరోనా వైరస్ అల్లాడిస్తోంది. సోమవారం నాటికి 10,800మంది మరణించారు. 70 ఏళ్ల పైబడిన నలుగురు తెలుగువారూ కరోనాతో మృతి చెందినట్లు సమాచారం. సిలికాన్ వ్యాలీలో ఉంటున్న ఓ తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లండన్ వెళ్లి కరోనాతో వచ్చారు. అది ఆయన తల్లికి సోకడంతో మృతి చెందింది. ఏ దేశంలోనూ జరగని స్థాయిలో ఏకంగా 16 లక్షల మందికిపైగా కరోనా పరీక్షలు అమెరికాలోనే జరిగాయి. సోమవారం రాత్రికి నమోదైన 3.66లక్షల కేసుల్లో సగం న్యూయార్క్, న్యూజెర్సీ రాష్ట్రాలకు చెందినవే. ఈ నగరాల్లో ఉంటున్న భారత సంతతికి చెందిన అమెరికా పౌరుల్లో పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని వారు గోప్యంగా ఉంచడంతో అధికారిక లెక్కలు లేవు.అమెరికాలోని భారత సంతతి వైద్యుల సమాఖ్య (ఏఏపీఐ) మాజీ అధ్యక్షుడు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. 'ఇంత విపత్తును ఊహించలేదు' అని భారత సంతతికి చెందిన అమెరికా ప్రముఖుడు రాజేంద్ర డిచ్‌పల్లి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. న్యూజెర్సీలోని ఎడిసన్ ప్రాంతంలో భారతీయులు, తెలుగువారు ఎక్కువగా ఉంటారు. ఆదివారం తెలుగువారు ఎక్కువగా ఉండే ఓక్ ట్రీ రోడ్‌లో 30 మందికి కరోనా సోకినట్లు వార్తలొచ్చాయి. తమ ఇంట్లో ఎవరికైనా కరోనా సోకితే భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు ఇరుగు పొరుగు వారికి తెలియనీయడం లేదు.

### వాళ్లకు ఫ్లూ

న్యూయార్క్‌లోని నావికాదళం షిప్ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న బృందంలో ఒకరికి పాజిటివ్ తేలింది. ఈ నగరంలో మరణాల సంఖ్య రోజూ 630 నుంచి 594కు తగ్గటాన్ని గవర్నర్ ఆండ్రూ క్యోమో కాస్త ఉపశమనంగా అభివర్ణించారు. న్యూయార్క్‌లో సోమవారం నాటికి 4,758 మరణాలు, 1.30 లక్షల కేసులు నమోదయ్యాయి. ఈ గడ్డు పరిస్థితి వారం లేదా కాస్త ఎక్కువ కాలం ఉండొచ్చని ట్రంప్ అన్నారు.



బ్రూక్లిన్‌లోని వైకాఫ్ ఆస్పత్రి నుంచి ఓ మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

కాగా, లాక్‌డౌన్‌తో భారత్‌లో చిక్కుకున్న అమెరికా పౌరుల్లో 1,300 మంది సోమవారం రాత్రి స్వస్థలం చేరుకొన్నారు. వారికి ఫ్లూ లక్షణాలు కనిపించాయని అధికారులు తెలిపారు. విపక్ష డెమోక్రటిక్ ఎంపీ కెరన్ విట్‌సెట్ కరోనా నుంచి కోలుకొన్నారు. హైడ్రాక్సీ క్లోరోక్విన్ వాడటం వల్లే తన ఆరోగ్యం కుదుటపడిందని విట్‌సెట్ ప్రకటించారు. ఇది రిపబ్లికన్ పార్టీ అధినేత ట్రంప్ మార్క్ ఔషధం. కాగా, కరోనా మృతుల అంత్యక్రియలకు 7-9 రోజులు పడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

## అమెరికాలో ప్రసిద్ధ జర్నలిస్టు కంచిబొట్ల బ్రహ్మానందం మృతి



ఏదుబాడు(పర్చూరు), ఏప్రిల్ 7: అమెరికాలోని వార్తారంగంలో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రసిద్ధ పాత్రికేయులు కంచిబొట్ల బ్రహ్మానందం(65) కరోనా తో మరణించారు. న్యూయార్క్‌లో యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా కరస్పాండెంట్‌గా పనిచేస్తూ అక్కడే కుటుంబంతో స్థిరపడ్డారు. గత నెల 23న ఫ్లూ లక్షణాలు కనిపించడంతో ఆయన స్వీయ నిర్బంధంలో ఉన్నారు. ఆ తరువాత ఐదు రోజులకే ఆరోగ్యం బాగా క్షీణించింది. కుటుంబసభ్యుల సహకారంతో అదే రోజు ఐస్‌ల్యాండ్‌లోని ఆస్పత్రిలో బ్రహ్మానందం చేరారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో సోమవారం ఉదయం మరణించారు. ఆయనకు భార్య అంజనా, కుమార్తె సుజనా, కుమారుడు సుదామా ఉన్నారు. బ్రహ్మానందం స్వస్థలం ప్రకాశం జిల్లా పర్చూరు మండల పరిధిలోని ఏదుబాడు గ్రామం. వివాహం అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. 'ద హిందూ'లో కొంతకాలం పనిచేసి అమెరికాకు కుటుంబంతో సహా వెళ్లిపోయారు. బ్రహ్మానందం మృతి పట్ల అమెరికాలోని తెలుగు సంఘాలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే ప్రెస్‌క్లబ్ నెల్లూరు శాఖ తరఫున ఏ జయప్రకాశ్, వీ వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు.

# క్లోరోక్విన్‌కు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

సడలిస్తున్నట్లు డీజీఎఫ్‌టీ ప్రకటించింది, టినిడజాల్, మెట్రోనిడజాల్, ఎసిక్లోవిర్, ప్రొజెస్టరాన్, క్లోరాంఫెనికాల్, ఆర్నిడజాల్ మొదలైన మందుల ఫార్ములేషన్స్‌ను ఇక ఎగుమతి చేయవచ్చని తెలిపింది. క్లిండామైసిన్, నియామైసిన్ మొదలైన కీలక యాంటీబయాటిక్స్ తయారీకి వీటిలో కొన్ని ఫార్ములేషన్స్ ఉపయోగిస్తారు. ఈ సడలింపు నిర్ణయం వెలువడ్డ వెంటనే అనేక గొడౌన్లనుంచీ టన్నుల కొద్దీ హెచ్‌సీక్యూ స్టాకులు రిలీజయ్యాయి. అయితే అమెరికా చేసిన ఓ హెచ్చరిక అనంతరం కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం దౌత్యపరమైన దుమారానికి దారితీసింది.

### జరిగిందేమిటి?

కొవిడ్-19 నివారణకు హెచ్‌సీక్యూ దివ్యౌషధమని, గేమ్-ఛేంజర్ అనీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతూ వస్తున్నారు. ప్రపంచంలో 70శాతం హెచ్‌సీక్యూ భారత్‌లోనే తయారవుతోంది. దీని ఎగుమతిపై మార్చి 3న డీజీఎఫ్‌టీ నిషేధం పెట్టింది. ఏప్రిల్ 5న ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి హెచ్‌సీక్యూ తమకు ఎగుమతి అయ్యేలా చూడాలని కోరారు. మోదీ అన్నీ పరిశీలించాక నిర్ణయించుకుంటామన్నారు. నిజానికి ట్రంప్ మీడియాతో మాట్లాడడానికి కొద్ది గంటలముందే భారత్- హెచ్‌సీక్యూ, పారాసిటమాల్ ఎగుమతులపై నిషేధాన్ని పాక్షికంగా సడలించాలన్న నిర్ణయానికి సూత్రప్రాయంగా వచ్చింది. ఆ మేరకు మంగళవారం లాంఛనంగా ఆమోద ముద్ర వేయాలని భావించింది. ఈలోపే ట్రంప్ మీడియా ముందుకొచ్చి ప్రతీకారం తప్పదన్న వ్యాఖ్య చేసేశారు. అయితే ఆయన వ్యాఖ్యను భారత్ తేలిగ్గా తీసుకుంది.

### ట్రంప్ అన్నదేంటి?

హెచ్‌సీక్యూ ఎగుమతికి సహకరించకపోతే- భారత్‌పై ప్రతీకారం తప్పదని ట్రంప్ సోమవారం రాత్రి హెచ్చరించారు."సరఫరా చేయరాదన్న నిర్ణయం వారు తీసుకున్నట్లు నాకు సమాచారం లేదు. నేను మాట్లాడినప్పుడు సంభాషణ సుహృద్భావ రీతిలో నడిచింది. హెచ్‌సీక్యూ ఎగుమతికి సహకరించాలని నేను కోరాను. భారత్ మా నుంచి ఏళ్లతరబడి ఎంతో సాయం పొందింది. అందుచేత అడిగాను. సరఫరా చేయరాదన్న నిర్ణయాన్ని వారు తీసుకుంటే ఆశ్చర్యమే. అది వారి ఇష్టం... అయితే తప్పనిసరిగా దానికి ప్రతీకారం ఉంటుంది" అని మీడియాతో అన్నారు.

### 20 దేశాల నుంచి ఆర్డర్లు: భారత్

హెచ్‌సీక్యూ సరఫరాను దేశాలు, అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. 'శ్రీలంక, నేపాల్ సహా దాదాపు 20 దేశాల నుంచి హెచ్‌సీక్యూ కోసం ఆర్డర్లున్నాయి. తీవ్రంగా దెబ్బతిన్న దేశాలకు దీనిని ప్రాధాన్యక్రమంలో ఎగుమతి చేస్తాం' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ చెప్పారు. 'దేశంలో సరిపడా హెచ్‌సీక్యూ నిల్వలున్నాయా లేవా అన్నది సమీక్షించాకే ఈ ఎగుమతి సడలింపు నిర్ణయం తీసుకున్నాం. ప్రపంచదేశాలన్నీ కలిసికట్టుగా సహకరించుకోవాలనే మేం చెబుతున్నాం' అని పేర్కొన్నారు. మరోవైపు.. ట్రంప్ హెచ్చరికను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తప్పుబట్టారు. స్నేహంలో ప్రతీకారానికి తావులేదని, భారత్‌కి సరిపడా ఉంటేనే ఎగుమతులు చేయాలని సూచించారు.

### నెలకు 40 టన్నుల హెచ్‌సీక్యూ ఉత్పత్తి!

దశాబ్దాల కిందట మలేరియా అదుపుకు భారత్‌లో విరివిగా వాడిన క్లోరోక్విన్ మందుకు అడ్వాన్స్‌డ్ రూపమే ఈ హెచ్‌సీక్యూ. భారత్‌లో నెలకు సగటున 40 టన్నుల హెచ్‌సీక్యూ ఉత్పత్తి జరపగల సామర్థ్యముందని భారత ఔషధ సమాఖ్య (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ చెప్పారు. 40 టన్నులంటే దాదాపు 20 కోట్ల 200 ఎమ్‌జీ టాబ్లెట్లు. కేవలం మలేరియాకే కాక రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్ మొదలైన ఆటో ఇమ్యూన్ వ్యాధులకూ ఇది పనిచేస్తుంది కాబట్టి హెచ్‌సీక్యూకి ఎంతో డిమాండ్ ఉంది.

# వెయ్యి దాటిన మహారాష్ట్ర

## దేశంలో కరోనా కేసులు 5,000+

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: దేశంలో 24 గంటల్లో కొత్తగా 508 కరోనా కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి 10 గంటల వరకు వివిధ రాష్ట్రాలు వెల్లడించిన సమాచారం బట్టి దేశంలో మొత్తం కేసులు 5,200కు చేరాయి. మరణాల సంఖ్య 162కు పెరిగింది. అయితే, సాయంత్రం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం కేసులు 4,789, మరణాల సంఖ్య 124గా ఉంది. మహారాష్ట్రలో కరోనా కేసులు దేశంలోనే తొలిసారిగా వెయ్యి కేసులు దాటాయి. కరోనా కాటుకు పుణెలో మరో ముగ్గురు, మహారాష్ట్రలో ఇప్పటి వరకు 52 మంది బలవ్వగా ఒడిసాలో తొలి కరోనా మరణం నమోదయింది.

### ఆస్పత్రుల్ని విమర్శించిన అసోం ప్రతిపక్ష ఎమ్మెల్యే అరెస్టు

గువాహటి: కరోనా ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన అసోం ప్రతిపక్ష ఏఐడీయూఎఫ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాంను పోలీసులు అరెస్టు చేశారు. ఫోన్‌లో మరో వ్యక్తితో అతని సంభాషణ ఆడియో క్లిప్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. క్వారంటైన్ కేంద్రాలు, ఆస్పత్రుల్లో పరిస్థితులు నిర్బంధ కేంద్రాల్లో కంటే అధ్వానంగా ఉన్నాయని ఆయన విమర్శించడం ఆ క్లిప్‌లో వినిపించింది. ప్రాథమిక విచారణ తర్వాత ఆయనను అరెస్టు చేశామని రాష్ట్ర పోలీసు చీఫ్ భాస్కర్ జ్యోతి మహంతా తెలిపారు.

### క్వారంటైన్ నుంచి పరారైన వైద్యుడి అరెస్టు

ఇంఫాల్/లఖ్‌నవు: మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో క్వారంటైన్ కేంద్రం నుంచి పరారైన వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఆస్పత్రిలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఆ వైద్యుడు తబ్లీగీ జమాత్‌తో లింక్ ఉన్న వ్యక్తికి చికిత్స చేశాడు. తర్వాత ఆ వ్యక్తికి కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో వైద్యుడిని, వైద్య సిబ్బందిని క్వారంటైన్‌కు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రం నుంచి వైద్యుడు తప్పించుకున్నాడు. ఇంట్లో దాక్కున్న అతన్ని అరెస్టు చేసి, తిరిగి క్వారంటైన్ కేంద్రానికి తరలించారు. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ ఆస్పత్రి నుంచి 69 ఏళ్ల కరోనా పేషెంట్ తప్పించుకున్నాడు. దుప్పటితో కిటికీ గాజు పలకలను బద్దలుకొట్టి పరారయ్యాడు. ఇటుక బట్టీలో దాక్కున్న అతన్ని స్థానికుల సమాచారంతో పట్టుకున్నారు. నేపాల్‌కు చెందిన ఈ వ్యక్తి తబ్లీగీ జమాత్‌కు వెళ్లొచ్చిన 24 మంది బృందంలో సభ్యుడు. బరేలీలోని ఇజత్‌నగర్‌లో పోలీసులపై దాడి చేసిన 150 మందిపై కేసు నమోదయింది. వారిలో 42 మందిని అరెస్టు చేశారు. మరోవైపు.. ఢిల్లీ స్టేట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ (డీఎస్‌సీఐ)లో ఇద్దరు వైద్యులు, 16 మంది వైద్య సిబ్బందికి కరోనా వైరస్ సోకింది. దీంతో ఔట్-పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ)ను మూసివేశారు. ఇక అలీగఢ్‌లో ఒక మతానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన హిందూ మహాసభ ప్రధాన కార్యదర్శి పూజా షకున్ పాండే, ఆమె భర్త అశోక్ పాండేను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.



కొవిడ్ పరీక్ష కోసం ముంబైలో నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

## అమెరికాకు వెళ్లం.. భారత్‌లోనే సురక్షితం

### కరోనా విజృంభణతో స్వదేశానికి వెళ్లేందుకు అమెరికన్ల వెనకడుగు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: భారత్‌లో చిక్కుకున్న అమెరికన్లు తమ దేశానికి వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక కరోనా కేసులు అమెరికాలోనే నమోదైన విషయం తెలిసిందే. అక్కడ కరోనా మహమ్మారి విజృంభిస్తుండడంతో భారత్‌లో ఉండడమే మంచిదని అమెరికన్లు భావిస్తున్నారు. స్వదేశానికి వెళ్లాలన్న నిర్ణయాన్ని ఇప్పటికే అనేక మంది అమెరికన్లు వెనక్కి తీసుకున్నారని కాన్సులర్ వ్యవహారాల డిప్యూటీ సహాయ కార్యదర్శి ఇయాన్ బ్రౌన్‌లీ తెలిపారు. విదేశాల్లో చిక్కుకున్న అమెరికన్లను స్వదేశానికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, అక్కడే ఉండదల్చుకుంటే వారి ఇష్టమని బ్రౌన్‌లీ వెల్లడించారు. కాగా కరోనా కారణంగా లాక్‌డౌన్‌తో తెలంగాణలో చిక్కుకున్న 99 మంది అమెరికా పౌరులను మంగళవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఏ-320 ఎయిర్ ఇండియా విమానంలో అమెరికాకు తరలించారు.

## బ్రిటన్‌లో వైద్యులకు గండం

### భారత సంతతి సర్జన్ మృతి.. స్పెయిన్‌లో మళ్లీ విజృంభణ



లండన్, ఏప్రిల్ 7: కరోనా మరణాలు తీవ్రత ప్రపంచాన్ని భయపెడుతోంది. ఈ వైరస్ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటిదాకా 75,538 మందిని బలిగొంది. ఇన్నాళ్లకు తొలిసారి మంగళవారం చైనాలో ఒక్క మరణం కూడా నమోదు కాలేదు. ఇక బ్రిటన్‌లో హృద్రోగ నిపుణుడైన భారత సంతతి వైద్యుడు జితేందర్ కుమార్(58) కరోనా చికిత్స పొందుతూ మరణించారు. ఫ్లూ లక్షణాలు కనిపించడంతో కార్డిఫ్ ఆస్పత్రిలో చేరిన ఆయన, చికిత్స అందిస్తుండగానే మంగళవారం మరణించారు. ఇదే ఆస్పత్రిలో పక్షం రోజుల్లో పలువురు వైద్య సిబ్బంది మృత్యువాతపడ్డారు. తొలి విడత కరోనా వ్యాప్తి పూర్తయ్యేనాటికి బ్రిటన్‌లో యూరప్‌లోనే అత్యధికంగా మరణాలు సంభవిస్తాయని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ వెల్లడించింది. కాస్త కుదుటపడినట్టు కనిపించిన స్పెయిన్‌లో మళ్లీ మహమ్మారి విజృంభించింది. సోమవారం 637 మంది, మంగళవారం 743మంది మృతిచెందారు. ఇక, వరుసగా వారంపాటు కొత్తకేసులు నమోదు కాకపోవడంతో ఇరాన్ పార్లమెంటు సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ సహా సభలో అత్యధికులకు కరోనా పాజిటివ్ తేలడంతో పార్లమెంటును ఉన్నపళంగా మూసివేసిన విషయం తెలిసిందే. మరోవైపు.. డెన్మార్క్ ఈ నెల 15 నుంచి పాఠశాలలు తెరవాలని నిర్ణయించింది. ఇప్పుడికప్పుడే కరోనా తీవ్రతను చవిచూస్తున్న శ్రీలంకకు భారత ప్రభుత్వం ఆపన్నహస్తం అందించింది. కరోనా పరీక్షలు, నిర్ధారణ, చికిత్సకు అత్యవసరమైన వైద్య పరికరాలు, రక్షణ సామగ్రి, మాస్కులను అందించింది. దాదాపు పది టన్నుల పరికరాలను ప్రత్యేక విమానంలో లంకకు పంపించింది.

*Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com